www.prajanaava.in
Telugu Daily

# ప్రజానావ

ప్రతి అక్షరం జనం కోసం..

పేజీలు : 08 | వెల రూ.5.00

ప్రజానావ
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
తెలుగు రాష్ట్రాల్లో శరవేగంగా అభివృద్ధి చెందుతున్న
ప్రజానావ దినపత్రికలో అతి తక్కువ ధరకే ప్రకటనలివ్వండి!
వివరాలకు ఈ క్రింది ఫోన్ నెంబర్లను సంప్రదించగలరు.
: 99484 33277 / 9014966169

Published from: Hyderabad, Karimnagar, Rangareddy, Circulated to: Warangal, Khammam, Nalgonda, Mahabubnagar, Nizamabad

హైదరాబాద్ | సంపుటి 01 | సంచిక: 35 | ఆదివారం | 6 సెప్టెంబర్, 2026



# నీటి హక్కులను కాపాడటంలో సీఎం విఫలం

- కృష్ణా జలాల్లో ఏపీకి అనుకూలంగా కేఆర్ఎంబీ వ్యవహరిస్తున్నా ఎందుకు మౌనం?
- తెలంగాణ ప్రయోజనాలను తాకట్టు పెట్టే విధంగా ప్రభుత్వం
- వ్యవహరించొద్దు జూరాల వద్ద భారీ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్ నిర్మించాలి
- తెలంగాణ రక్షణ సేన రాష్ట్ర నాయకుడు కామెర నవీన్‌కుమార్

ప్రజానావ, హైదరాబాద్: కృష్ణా జలాల్లో తెలంగాణకు అన్యాయం జరుగుతున్నా రాష్ట్ర ప్రభుత్వం తగిన స్థాయిలో స్పందించడం లేదని తెలంగాణ రక్షణ సేన రాష్ట్ర నాయకుడు కామెర నవీన్‌కుమార్ విమర్శించారు. తెలంగాణ నీటి హక్కులను పరిరక్షించాల్సిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి.. ఆంధ్రప్రదేశ్‌కు అనుకూలంగా వ్యవహరిస్తున్నారనే భావన ప్రజల్లో నెలకొందన్నారు. బంజారాహిల్స్‌లోని తెలంగాణ రక్షణ సేన కార్యాలయంలో శనివారం నిర్వహించిన మీడియా సమావే శంలో ఆయన మాట్లాడారు. కృష్ణా జలాల విషయంలో తెలంగాణ ప్రయోజనాలను కాపాడాల్సిన ప్రభుత్వం.. కొడంగల్–నారాయణపేట్, మక్తల్ లిఫ్ట్ ఇరిగేషన్ పథకాలకు ప్రాధాన్యం ఇవ్వడం సరికాదన్నారు. కృష్ణా జలాలపై తెలంగాణ హక్కులను పరిరక్షించేందుకు కేంద్రంపై ప్రభుత్వం ఒత్తిడి తీసుకురావాలని డిమాండ్ చేశారు.

### ఏపీ నీటి వినియోగంపై ప్రభుత్వం స్పందించాలి

కృష్ణా రివర్ మేనేజ్‌మెంట్ బోర్డు (కేఆర్ఎంబీ) నిర్ణయాల వల్ల తెలంగాణకు నష్టం జరుగుతోందని నవీన్‌కుమార్ ఆరోపించారు. శ్రీశైలంలో విద్యుదుత్పత్తిని నిలిపివేయాలం టూ కేఆర్ఎంబీ ఇచ్చిన ఆదేశాలపై రాష్ట్ర ప్రభుత్వం కేంద్రం దృష్టికి సమస్యను తీసుకెళ్లాలని కోరారు.పోతిరెడ్డిపాడు ద్వారా ఏపీ నీటిని మళ్లించుకునే పరిస్థితులు ఏర్పడుతున్నాయని ఆయన ఆరోపించారు. ప్రస్తుత వాటర్ ఇయర్‌లో ఏపీ పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్, సాగర్ కుడి కాల్వ, కృష్ణా డెల్టా వ్యవస్థల ద్వారా గణనీయమైన నీటిని వినియోగించుకుందని తెలిపారు. అదే సమయంలో హైదరాబాద్ తాగునీటి అవసరాలను కలుపుకుని తెలంగాణ వినియోగం తక్కువగానే ఉందన్నారు. తెలంగాణకు రావాల్సిన నీటి వాటాపై స్పష్టమైన వైఖరిని ప్రభుత్వం తీసుకోవాలని, ఏపీ నీటి వినియోగాన్ని నియంత్రించేలా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

### జూరాల వద్ద లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్ అవసరం

కృష్ణా జలాలను తెలంగాణకు పూర్తిస్థాయిలో వినియోగించుకునేలా జూరాల వద్ద భారీ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్ నిర్మించాలని నవీన్‌కుమార్ సూచించారు. పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టుతో పాటు జూరాల ఎత్తిపోతల పథకాన్ని కూడా ప్రాధాన్యంతో పూర్తి చేయాలని కోరారు. జూరాల నుంచి నీటిని ఎత్తిపోసే పథకాన్ని గత ప్రభుత్వం చేపట్టకపోవడం వల్ల తెలంగాణకు నష్టం జరిగిందని, ప్రస్తుత ప్రభుత్వం కూడా అదే వైఖరిని కొనసాగించకూడదని అన్నారు. కృష్ణా జలాల విషయంలో రాష్ట్ర ప్రయోజనాలను ముందుపెట్టి నిర్ణయాలు తీసుకోవాలని కోరారు.వెలిగొండ టన్నెల్, పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్, సాగర్ కుడి కాల్వ తదితర మార్గాల ద్వారా ఏపీ నీటిని వినియోగించుకుంటున్నా తెలంగాణ ప్రభుత్వం ఎందుకు అడ్డుకోవడం లేదని ప్రశ్నించారు. కేఆర్ఎంబీ వైఖరిపై కేంద్రంతో గట్టిగా చర్చించి తెలంగాణ హక్కులను సాధించాలని డిమాండ్ చేశారు.

### బీఆర్ఎస్ వైఖరిపైనా విమర్శలు

కృష్ణా జలాల అంశంపై ప్రస్తుతం బీఆర్ఎస్ చేస్తున్న విమర్శలపైనా నవీన్‌కుమార్ స్పందించారు. గతంలో ఆ పార్టీ అధికారంలో ఉన్న సమయంలోనూ తెలంగాణకు అన్యాయం జరిగిందని ఆరోపించారు. కృష్ణా జలాల పంపకాల విషయంలో బీఆర్ఎస్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలను ప్రజలు మరిచిపోలేదన్నారు.గత ప్రభుత్వ తప్పిదాలను ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం పునరావృతం చేయకుండా తెలంగాణ నీటి హక్కుల పరిరక్షణకు కట్టుబడి ఉండాలని కోరారు. కృష్ణా జలాల విషయంలో కేంద్రంపై ఒత్తిడి పెంచడంతో పాటు తెలంగాణ ప్రయోజనాల కోసం అవసరమైన అన్ని చర్యలు చేపట్టాలని నవీన్‌కుమార్ డిమాండ్ చేశారు.

## జీవో 97ను అసెంబ్లీలో ఎండగడతాం

- పాలిటెక్నిక్ విద్యార్థులకు బీఆర్ఎస్ అండగా ఉంటుంది
- పాలిటెక్నిక్ కళాశాలల ఆస్తులపై రేవంత్ రెడ్డి ప్రభుత్వం కన్ను.. జీవో 97 వెనుక అసలు ఉద్దేశాన్ని బయటపెడతా
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్



ప్రజానావ, సిరిసిల్ల: పాలిటెక్నిక్ కళాశాలల విలువైన భూములు, ఆస్తులపై రేవంత్ రెడ్డి ప్రభుత్వం కన్నేసిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్ ఆరోపించారు. పాలిటెక్నిక్ కళాశాలలను లేబర్ డిపార్ట్‌మెంట్ పరిధిలోకి తీసుకువచ్చేందుకు తీసుకొచ్చిన జీవో నంబర్ 97 వెనుక ఉన్న అసలు ఉద్దేశాన్ని అసెంబ్లీ వేదికగా ఎండగడతామని స్పష్టం చేశారు. జీవో 97ను రద్దు చేసే వరకు, విద్యార్థుల సమస్యలు పరిష్కరించే వరకు బీఆర్ఎస్ పార్టీ వారి వెంట ఉంటుందని భరోసా తరువాయి 2లో

## కాంగ్రెస్‌ను బర్తరఫ్ చేసే రోజులు దగ్గర్లో ఉన్నాయి

- లక్కీ లాటరీతో సీఎం అయ్యారు.. కూల్చే రోజులు దగ్గర్లోనే
- ఓటుకు నోటు కేసులో దొరికిన దొంగ రేవంత్
- 420 మోసాలకు 420 సార్లు రాజీనామా చేయాలి
- ఉద్యోగాలపై బహిరంగ చర్చకు సిద్ధమా? సీఎం, మంత్రులకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సవాల్

2

# హైదరాబాద్‌లో అతిపెద్ద ఏఐ డేటా సెంటర్





- రూ.70 వేల కోట్ల పెట్టుబడి.. 7 వేల మందికి ప్రత్యక్ష, పరోక్ష ఉపాధి
- 250 ఎకరాల్లో 1,000 మెగావాట్ల సామర్థ్యంతో క్యాంపస్
- ఫ్యూచర్ సిటీకి బలమైన పునాది పడింది: సీఎం రేవంత్‌రెడ్డి

ప్రజానావ, హైదరాబాద్: హైదరాబాద్‌లో దేశంలోనే అతిపెద్ద కృత్రిమ మేధ (ఏఐ) డేటా సెంటర్ క్యాంపస్ ఏర్పాటుకు టీసీఎస్ అనుబంధ సంస్థ హైపర్‌వాల్ట్ ముందుకొచ్చింది. ఈ ప్రాజెక్టు కోసం తెలంగాణ ప్రభుత్వంతో సంస్థ అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. సచివాలయంలో శనివారం టీసీఎస్, హైపర్‌వాల్ట్ ప్రతినిధుల బృందం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో సమావేశమై ప్రాజెక్టు వివరాలను వెల్లడించింది. ఈ సమావేశంలో ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబుతో పాటు మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ పాల్గొన్నారు. టీసీఎస్ సీఈఓ కె. కృతివాసన్, సీవోవో ఆర్తి సుబ్రమణియన్, హైపర్‌వాల్ట్ అధ్యక్షుడు వి. రాజన్న, సీఈఓ, ఎండీ దీపేష్ నందా సమావేశంలో పాల్గొన్నారు. అమెరికా నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఓపెన్‌ఏఐ చీఫ్ టెక్నాలజీ ఆఫీసర్ ఉదయ్ రుద్రరాజు హాజరయ్యారు.

### రూ.70 వేల కోట్ల పెట్టుబడి

ఫ్యూచర్ సిటీలో 250 ఎకరాలకు పైగా విస్తీర్ణంలో 1 గిగావాట్ (1,000 మెగావాట్లు) సామర్థ్యంతో అత్యాధునిక ఏఐ డేటా సెంటర్ క్యాంపస్‌ను అభివృద్ధి చేయనున్నారు. హైపర్‌వాల్ట్‌తో పాటు భాగస్వామ్య సంస్థలు ఈ ప్రాజెక్టు నిర్మాణం, నిర్వహణ కోసం దాదాపు రూ.70 వేల కోట్ల పెట్టుబడి పెట్టనున్నాయి. దీని ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా సుమారు 7 వేల ఉద్యోగాలు అందుబాటులోకి రానున్నాయి. ప్రపంచంలోని ప్రముఖ ఏఐ సంస్థలు, హైపర్‌స్కేలర్లు, గ్లోబల్ ఎంటర్‌ప్రైజ్‌లకు అవసరమైన భారీ కంప్యూటింగ్ మౌలిక వసతులను ఈ క్యాంపస్ అందించనుంది. అధిక సామర్థ్యమున్న కంప్యూటింగ్ వ్యవస్థలు, లిక్విడ్ కూలింగ్ వంటి అత్యాధునిక సాంకేతికతలను ఇందులో వినియోగించనున్నారు. దేశంలోనే అత్యంత అధునాతన, భారీ ఏఐ మౌలిక వసతుల క్యాంపస్‌లలో ఇది ఒకటిగా నిలవనుంది.

### 'చారిత్రాత్మక ప్రాజెక్టు'

ఈ ప్రాజెక్టు తెలంగాణతో పాటు దేశానికే చారిత్రాత్మకమైనదని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. ఏఐ విప్లవంలో హైదరాబాద్ తరువాయి 2లో

## కల్వకుంట్ల కుటుంబమా.. కాస్కోండి

- కేసీఆర్ సభకు రావాలి.. లేదంటే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలి
- వచ్చే ఎన్నికల్లో సీట్లు పెరిగితే 117.. లేకుంటే 90 స్థానాల్లో కాంగ్రెస్
- సిరిసిల్ల, సిద్దిపేటలోనూ కాంగ్రెస్ జెండా ఎగురవేస్తాం
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

2






## సమస్యలు గాలికొదిలేసి దేనికి ఈ సంబరాలు?

- హామీలను గాలికొదిలేసి కాంగ్రెస్ సర్కారు వేడుకలా?
- ప్రభుత్వం కుంభకోణాలమయంగా మారింది.. రేవంత్ రాజీనామా చేయాలి
- అసెంబ్లీలో ప్రజా సమస్యలపై గళమెత్తుతాం: మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు

2

## భూములు దోచుకోవడానికే 22ఏ

- 60 లక్షల ఎకరాలకు పైగా నిషేధిత జాబితాలో చేర్చారు
- అన్ని అనుమతులున్న భూములనూ 22ఏలో పెట్టారు
- బీఆర్ఎస్ మాదిరిగానే కాంగ్రెస్ 30 శాతం కమీషన్లు అడుగుతోంది
- కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

2





## కేసీఆర్‌కు పట్టిన గతే రేవంత్‌కూ పడుతుంది

- 22ఏ నిషేధిత భూముల జాబితాతో పేదల భూములు లాక్కునే కుట్ర
- ధరణితో ప్రజలను పీడించిన కేసీఆర్ సర్కార్ ఓడిపోయింది
- రేవంత్ కూడా అదే బాటలో
- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు

2



## బిహార్‌ను ముంచెత్తిన వరదలు

బిహార్‌లో వరదలు బీభత్సం సృష్టిస్తున్నాయి. గంగా, పున్‌పున్ సహా పలు నదులు ఉప్పొంగడంతో 11 జిల్లాల్లో 16.85 లక్షల మంది ప్రభావితమయ్యారు. పాట్నాలోని లోతట్టు ప్రాంతాలు నీటమునగడంతో రహదారి, రైలు రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. భగల్‌పూర్‌లో ముఖ్యమంత్రి సమ్రాట్ చౌదరి ఏరియల్ సర్వే నిర్వహించి, దెబ్బతిన్న కట్టను పరిశీలించారు. సహాయ, రక్షణ చర్యలను ముమ్మరం చేయాలని అధికారులను ఆదేశించారు. బాధితుల కోసం 80 కమ్యూనిటీ కిచెన్లు, 1,158 పడవలు, 27 ఎస్డీఆర్ఎఫ్, 7 ఎన్డీఆర్ఎఫ్ బృందాలను రంగంలోకి దించారు.

6

# హైదరాబాద్‌లో అతిపెద్ద ఏఐ డేటా సెంటర్

(మొదటి పేజీ తరువాయి)

ప్రపంచస్థాయి అగ్రగామి నగరంగా ఎదుగుతోందని పేర్కొన్నారు. భవిష్యత్తులో ఏఐ మోడళ్లు, భారీ కంప్యూటింగ్ సామర్థ్యం కీలక ప్రజా మౌలిక వసతులుగా మారనున్న నేపథ్యంలో ఆ సామర్థ్యం తెలంగాణలోనే అందుబాటులోకి రావడం రాష్ట్రానికి ఎంతో ప్రయోజనకరమన్నారు.
తెలంగాణలో భారీ పెట్టుబడి పెట్టేందుకు ముందుకొచ్చిన టీసీఎస్, హైపర్‌వాల్ట్ ప్రతినిధులను సీఎం అభినందించారు. ప్రాజెక్టు అమలుకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. టీసీఎస్ తీసుకున్న నిర్ణయంతో తన కల నెరవేరిందని రేవంత్‌రెడ్డి అన్నారు. ఫ్యూచర్ సిటీ అభివృద్ధికి బలమైన పునాది పడిందని పేర్కొన్నారు. తెలంగాణ రైజింగ్ విజన్–2047లో నిర్దేశించుకున్న 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ లక్ష్య సాధనలో ఈ ప్రాజెక్టు కీలక ముందడుగు అని అభివర్ణించారు.

### దావోస్ సమావేశంతో నాంది

ఈ ప్రాజెక్టుకు సంబంధించిన చర్చలకు 2026 జనవరిలో దావోస్‌లో సీఎం రేవంత్‌రెడ్డి, టాటా సన్స్ చైర్మన్ ఎన్. చంద్రశేఖరన్ మధ్య జరిగిన సమావేశం నాంది పలికింది. హైదరాబాద్‌లో పెట్టుబడులు పెట్టాలని చంద్రశేఖరన్‌ను కోరినట్లు సీఎం తెలిపారు. అనంతరం రాష్ట్ర ప్రభుత్వం, టీసీఎస్ ప్రతినిధుల మధ్య పలుమార్లు చర్చలు జరగడంతో కొద్ది నెలల్లోనే ప్రాజెక్టు కార్యరూపం దాల్చింది.దేశంలోని మరో ఐదు రాష్ట్రాల నుంచి పోటీ ఉన్నప్పటికీ తెలంగాణ ఈ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టును సాధించిందని ప్రభుత్వం తెలిపింది. హైదరాబాద్‌ను గ్లోబల్ ఏఐ, డేటా సెంటర్ హబ్‌గా అభివృద్ధి చేయాలన్న ప్రభుత్వ లక్ష్యానికి ఈ ప్రాజెక్టు మరింత ఊతమివ్వనుంది.

### గ్రీన్ ఎనర్జీ.. వాటర్ న్యూట్రల్ డిజైన్

భారీ ఏఐ డేటా సెంటర్ ఏర్పాటుతో ఏఐ, డేటా సెంటర్ల రంగాలతో పాటు విద్యుత్, కూలింగ్, నెట్‌వర్కింగ్, నిర్మాణం, ఇంజినీరింగ్, ఆపరేషన్స్ వంటి అనుబంధ రంగాల్లోనూ కొత్త అవకాశాలు ఏర్పడనున్నాయి. పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యం ఇస్తూ గ్రీన్ ఎనర్జీ, వాటర్ న్యూట్రల్ డిజైన్‌తో క్యాంపస్‌ను అభివృద్ధి చేయనున్నారు. సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, ప్రభుత్వ సలహాదారు కె. రామకృష్ణారావు, ఇన్వెస్ట్ తెలంగాణ సీఈఓ బి. అజిత్‌రెడ్డి, టీజీఐఐసీ ఎండీ కె. శశాంక, పరిశ్రమల శాఖ ప్రత్యేక కార్యదర్శి కృష్ణాదిత్య, డైరెక్టర్ ఆఫ్ ఇండస్ట్రీస్ నిఖిల్ చక్రవర్తి తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# జమ్మూకశ్మీర్‌లో లష్కరే కమాండర్ హతం

- యూస్‌మార్గ్‌లో భద్రతా బలగాలతో ఎదురుకాల్పులు
- పహల్గాం ఉగ్రదాడి నిందితులతో సంబంధాలున్నట్లు గుర్తింపు
- పూంఛ్, సోనామార్గ్, బోటాపత్రి దాడుల్లోనూ ప్రమేయం: అధికారులు

**శ్రీనగర్:** జమ్మూకశ్మీర్‌లో భద్రతా బలగాలు చేపట్టిన ఆపరేషన్‌లో నిషేధిత ఉగ్రవాద సంస్థ లష్కరే తయ్యిబాకు చెందిన కమాండర్ యాసిర్ హతమయ్యాడు. శుక్రవారం యూస్‌మార్గ్ పర్వత ప్రాంతాల్లో గాలింపు చేపడుతున్న భద్రతా సిబ్బందిపై ఉగ్రవాది కాల్పులు జరపడంతో ఎదురుకాల్పులు చోటుచేసుకున్నాయి. ఈ ఘటనలో యాసిర్ మరణించినట్లు కశ్మీర్ పోలీసులు శనివారం వెల్లడించారు.

### కొంతకాలంగా నిఘా

లష్కరే తయ్యిబాకు చెందిన ఉగ్రముఠాలో గతంలో యాసిర్ సభ్యుడిగా ఉన్నట్లు అధికారులు తెలిపారు. ఏడాది క్రితం ఆ ముఠా నుంచి విడిపోయి స్వతంత్రంగా ఉగ్ర కార్యకలాపాలు కొనసాగిస్తున్నట్లు పేర్కొన్నారు. పహల్గాంలో ఉగ్రదాడికి పాల్పడిన ముగ్గురు లష్కరే ఉగ్రవాదులతో యాసిర్‌కు సంబంధాలు ఉన్నట్లు గుర్తించినట్లు చెప్పారు. అప్పట్లో సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయిన ఉగ్రవాదుల ఫొటోల్లో యాసిర్ కూడా కనిపించినట్లు తెలిపారు. దీంతో అతడి కదలికలపై భద్రతా బలగాలు కొంతకాలంగా నిఘా పెట్టాయి.

### పలు దాడుల్లో ప్రమేయం

2024 మేలో పూంఛ్‌లో భారత వైమానిక దళం కాన్వాయ్‌పై జరిగిన దాడి, అదే ఏడాది అక్టోబరులో సోనామార్గ్ సమీపంలో కార్మికులపై జరిగిన దాడి, డిసెంబరులో బోటాపత్రిలో సైన్యంపై జరిగిన దాడుల్లో యాసిర్ ప్రమేయం ఉన్నట్లు అధికారులు పేర్కొన్నారు. పూంఛ్ నుంచి యూస్‌మార్గ్ మీదుగా పుల్వామాలోని పఖేర్‌పోరా వైపు ఉగ్రవాదుల కదలికలు ఉన్నట్లు నిఘా వర్గాల నుంచి సమాచారం అందడంతో ఆపరేషన్ చేపట్టినట్లు సైనికాధికారులు తెలిపారు. ఉగ్రవాదుల కోసం వారం రోజులుగా భద్రతా బలగాలు మాటువేసినట్లు చెప్పారు.యాసిర్‌తో పాటు మరికొందరు ఉగ్రవాదులు కూడా ఆ ప్రాంతంలో ఉన్నట్లు భద్రతా బలగాలు అనుమానిస్తున్నాయి. మిగతా ఉగ్రవాదుల కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయని అధికారులు వెల్లడించారు.

# ఎమ్మెల్యే పదవికి కేసీఆర్ రాజీనామా చేయాలి

మంత్రిపొన్నం ప్రభాకర్



**ప్రజానావ, హైదరాబాద్:** కేసీఆర్ తన ఎమ్మెల్యే పదవికి వెంటనే రాజీనామా చేయాలని మంత్రి పొన్నం ప్రభాకర్ డిమాండ్ చేశారు. ప్రజలకు జవాబుదారీగా ఉండాల్సిన ప్రజాప్రతినిధి తన బాధ్యతలను నిర్వర్తించనప్పుడు ఎమ్మెల్యే పదవిలో కొనసాగడం ఎందుకని ప్రశ్నించారు. ఈ డిమాండ్‌పై ఈనెల 6న ఇందిరాపార్క్ ధర్నా చౌక్ వద్ద నిర్వహించనున్న మహా ధర్నాను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. మహా ధర్నాపై హైదరాబాద్‌లో నిర్వహించిన సన్నాహక సమావేశంలో మంత్రులు పొన్నం ప్రభాకర్, శ్రీధర్ బాబు మాట్లాడారు. "బీఆర్ఎస్ ప్రభుత్వ పాలనలో రాష్ట్రానికి తీవ్ర నష్టం జరిగింది. పదేళ్లలో 100 ఏళ్ల విధ్వంసం జరిగింది. వెయ్యి రోజులుగా ఎమ్మెల్యేగా జీతం తీసుకుంటూ అసెంబ్లీకి హాజరుకాకుండా, తన నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో లేకుండా, ప్రతిపక్ష నేత పాత్రను నిర్వర్తించకుండా కేసీఆర్ వ్యవహరి స్తున్నారు. ఈ విషయాన్ని ప్రజల దృష్టికి తీసుకెళ్లనున్నాం. అదేవిధంగా కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల ప్రజాపాలనలో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను వివరిస్తాం" అని పొన్నం ప్రభాకర్ తెలిపారు.

# కల్వకుంట్ల కుటుంబమా.. కాస్కోండి



**ప్రజానావ, నకిరేకల్:** బీఆర్ఎస్ అన్ని విధాలుగా రాష్ట్రాన్ని నష్టపరిచి అధికారాన్ని కోల్పోయిందని సీఎం రేవంత్‌రెడ్డి విమర్శించారు. ప్రజా ప్రభుత్వంపై విమర్శలు చేస్తున్న బీఆర్ఎస్ నేతలు.. గతంలో తమ పాలన ఎలా సాగిందో గుర్తు చేసుకోవాలని సూచించారు. నల్గొండ జిల్లా నకిరేకల్‌లో శనివారం పర్యటించిన సీఎం.. పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. 100 పడకల ఆస్పత్రిని ప్రారంభించిన అనంతరం రాజీవ్‌గాంధీ మినీ స్టేడియంలో నిర్వహించిన బహిరంగ సభలో మాట్లాడారు.

### రైతులకు రూ.36 వేల కోట్లు జమ చేశాం

బీఆర్ఎస్ పాలనలో రైతులు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారని రేవంత్‌రెడ్డి ఆరోపించారు. చివరి విడత రైతుభరోసా నిధులు చెల్లించకుండానే ఆ ప్రభుత్వం దిగిపోయిందని విమర్శించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం పెండింగ్‌లో ఉంచిన రూ.36 వేల కోట్ల రైతుభరోసా నిధులను తమ ప్రభుత్వం రైతుల ఖాతాల్లో జమ చేసిందని తెలిపారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే 70 వేల ఉద్యోగాలను భర్తీ చేశామని చెప్పారు. నల్గొండ జిల్లాకు మూడు ఎమ్మెల్సీ పదవులు ఇచ్చామని, బీఆర్ఎస్ పాలనలో కేసీఆర్ తన కుటుంబ సభ్యులకు పదవులు కట్టబెట్టారని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం ఉద్యమకారుల పిల్లలకు పదవులు కల్పించిందని పేర్కొన్నారు.

### 1.06 కోట్ల రేషన్ కార్డులు

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 1.06 కోట్ల రేషన్ కార్డులు మంజూరు చేశామని రేవంత్‌రెడ్డి తెలిపారు. 3.48 కోట్ల మందికి సన్నబియ్యం పంపిణీ చేస్తున్నామని, బీఆర్ఎస్ కార్యకర్తలకూ ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అందుతున్నాయని అన్నారు. బీఆర్ఎస్ కార్యకర్తల ఇళ్లకు ఉచిత విద్యుత్ అందుతున్నా.. తమ ప్రభుత్వాన్ని ఎందుకు విమర్శిస్తున్నారని ప్రశ్నించారు.పేదలకు సంక్షేమ పథకాలు అందిస్తున్నందుకు కాంగ్రెస్ ప్రభుత్వం పోవాలా? అని ఆయన ప్రశ్నించారు.

### అసెంబ్లీకి రండి.. తేల్చుకుందాం

తనపై విద్యార్హతల విషయంలో బీఆర్ఎస్ నేతలు చేస్తున్న విమర్శలపై సీఎం తీవ్రంగా స్పందించారు. తనకు చదువు తక్కువైనా సంస్కారం ఉందని అన్నారు. తనపై విమర్శలు చేసే బీఆర్ఎస్ నేతలు అసెంబ్లీకి వచ్చి తమ సంస్కారం, తన సంస్కారం ఏంటో తేల్చుకోవాలని సవాల్ విసిరారు. కల్వకుంట్ల కుటుంబం తనను ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలని సవాల్ చేశారు. వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు భవిష్యత్తు లేదని, తెలంగాణలో ఆ పార్టీను మళ్లీ ఎదగనివ్వబోమని వ్యాఖ్యానించారు.

### సిరిసిల్ల, సిద్దిపేటలోనూ గెలుస్తాం

వచ్చే ఎన్నికల్లో సిరిసిల్ల, సిద్దిపేట నియోజకవర్గాల్లోనూ కాంగ్రెస్ విజయం సాధిస్తుందని రేవంత్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. ఈ నెలాఖరుకు సిరిసిల్లలో పర్యటిస్తామని, వచ్చే నెల సిద్దిపేటలో పర్యటిస్తామని చెప్పారు. బీఆర్ఎస్ నేతలు ఎవరిని తీసుకొచ్చినా కాంగ్రెస్ విజయాన్ని అడ్డుకోలేరని వ్యాఖ్యానించారు. వచ్చే ఎన్నికల నాటికి అసెంబ్లీ స్థానాల సంఖ్య పెరిగితే 117 స్థానాల్లో, ప్రస్తుత స్థానాలే కొనసాగితే 90 స్థానాల్లో కాంగ్రెస్ విజయం సాధిస్తుందని రేవంత్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. కేసీఆర్ అసెంబ్లీకి వచ్చి తనను ఎదుర్కోవాలని, లేదంటే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి గజ్వేల్‌లోనే తనతో తేల్చుకోవాలని సవాల్ విసిరారు.

# పనీర్, డెయిరీ ఉత్పత్తి కేంద్రాలపై టీజీ సేఫ్ దాడులు



**ప్రజానావ, హైదరాబాద్:** నగరంలోని పనీర్, డెయిరీ ఉత్పత్తుల తయారీ కేంద్రాలపై టీజీ సేఫ్ అధికారుల దాడులు చేశారు. 12 ప్రత్యేక బృందాలతో 14 డెయిరీ యూనిట్లలో తనిఖీలు నిర్వహించారు. ఫుడ్ సేఫ్టీ అధికారులు, పోలీస్ సిబ్బంది, హెచ్ ఫాస్ట్ అధికారులు ఈ సోదాల్లో పాల్గొన్నారు. కొన్ని యూనిట్లలో పనీర్ తయారీలో పామాయిల్, గ్లిసరాల్ మోనోస్టియరేట్ వినియోగాన్ని గుర్తించారు. తనిఖీల సందర్భంగా పలు చోట్ల పారిశుద్ధ్యం, పరిశుభ్రత లోపాలు వెలుగుచూశాయి. పలు డెయిరీ యూనిట్లలో బొద్దింకలు, ఈగల తిరుగుతుండటాన్ని గమనించారు. పలు కేంద్రాల్లో పాల సేకరణకు సంబంధించిన రికార్డులు లేవు. కల్తీపై అనుమానంతో 21 ఆహార నమూనాలను అధికారులు సేకరించారు. దాదాపు రూ.7.19 లక్షల విలువైన ఆహార పదార్థాలను సీజ్ చేశారు. దాదాపు టన్ను పామాయిల్, 476 కిలోల గ్లిసరాల్ మోనోస్టియరేట్‌ను, 150 కిలోల స్కిమ్డ్ మిల్క్ పౌడర్‌ను స్వాధీనం చేసుకున్నారు. మేవీస్ క్లాసిక్ ప్రీమియం కుకింగ్ క్రీమ్‌కు చెందిన 1,760 ప్యాకెట్లు జప్తు చేశారు. మూడు డెయిరీల ఎఫ్ఎస్ఎస్ఏఐ లైసెన్సులు సస్పెండ్ చేశారు. గగన్‌పహాడ్‌లోని ఓ డెయిరీ కేంద్రం కార్యకలాపాలు నిలిపివేయాలని ఆదేశాలు ఇచ్చారు.

# జీవో 97ను అసెంబ్లీలో ఎండగడతాం

(మొదటి పేజీ తరువాయి)

ఇచ్చారు. జీవో నంబర్ 97ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ 20 రోజులకు పైగా ఆందోళన చేస్తున్న సిరిసిల్ల పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులను శనివారం కేటీఆర్ కలుసుకున్నారు. వారి సమస్యలను అడిగి తెలుసుకుని, వారి ఆవేదనను విన్నారు. విద్యార్థులు రోడ్డెక్కితే కేసులు పెడతామని ప్రభుత్వం భయపెట్టే ప్రయత్నం చేస్తోందని, ఎలాంటి భయాందోళనలకు గురికావద్దని విద్యార్థులకు సూచించారు. హైదరాబాద్‌లోని మాసబ్‌ట్యాంక్‌తో పాటు సిరిసిల్ల, కరీంనగర్ తదితర పట్టణ ప్రాంతాల్లో విలువైన భూముల్లో ఉన్న పాలిటెక్నిక్ కళాశాలల ఆస్తులపై ప్రభుత్వం దృష్టి పెట్టిందని కేటీఆర్ ఆరోపించారు. పాలిటెక్నిక్ కళాశాలల వ్యవస్థను బలహీనపరిచి వాటి భూములను, ఆస్తులను ఇతర అవసరాలకు వినియోగించుకునే ప్రయత్నాలను అడ్డుకుంటామని స్పష్టం చేశారు. ఎల్లుండి నుంచి ప్రారంభమయ్యే అసెంబ్లీ సమావేశాల్లో జీవో 97 అంశాన్ని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలంతా ప్రభుత్వం ముందు బలంగా ప్రస్తావిస్తారని కేటీఆర్ తెలిపారు. తాను సిరిసిల్ల ఎమ్మెల్యేగా, మాజీ మంత్రిగా, ఈ జిల్లా బిడ్డగా విద్యార్థులకు అండగా నిలుస్తానని చెప్పారు.
హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డితో పాటు బీఆర్ఎస్‌కు చెందిన ఎమ్మెల్యేలంతా కలిసి విద్యార్థుల తరఫున ప్రభుత్వాన్ని నిలదీస్తారని తెలిపారు. విద్యార్థులపై పోలీసులు కేసులు పెట్టినా, ఎలాంటి వేధింపులకు గురిచేసినా బీఆర్ఎస్ విద్యార్థి విభాగం అండగా ఉంటుందని కేటీఆర్ హామీ ఇచ్చారు. తెలంగాణ ఉద్యమ సమయంలో విద్యార్థులపై నమోదైన కేసులను కేసీఆర్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఎత్తివేసిందని గుర్తుచేశారు. ఇప్పుడు కూడా విద్యార్థుల పక్షాన నిలబడి పోరాడుతామని చెప్పారు. జీవో 97ను రద్దు చేసే వరకు, ఎస్‌బీటీఈటీని కొనసాగించే వరకు విద్యార్థుల వెంట బీఆర్ఎస్ ఉంటుందని కేటీఆర్ స్పష్టం చేశారు. విద్యార్థులు తమ భవిష్యత్తు కోసం చేస్తున్న పోరాటంలో వెనక్కి తగ్గవద్దని, ప్రభుత్వం దిగివచ్చే వరకు అసెంబ్లీలోనూ, ప్రజాక్షేత్రంలోనూ పోరాటం కొనసాగిస్తామని ఆయన భరోసా ఇచ్చారు.

# కాంగ్రెస్‌ను బర్తరఫ్ చేసే రోజులు దగ్గర్లో ఉన్నాయి

**ప్రజానావ, కరీంనగర్:** ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర విమర్శలు చేశారు. తెలంగాణ యువతకు నైపుణ్యాలు లేవంటూ సీఎం చేసిన వ్యాఖ్యలను తప్పుబట్టారు. యువత సామర్థ్యాన్ని ప్రశ్నించే అర్హత రేవంత్‌రెడ్డికి లేదన్నారు. ఓటుకు నోటు కేసులో రేవంత్‌రెడ్డి దొరికిన దొంగ అంటూ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలనలో చేసిన మోసాలను ఎండగట్టేందుకు బీఆర్ఎస్ నిర్వహించిన 'యువభేరి' కార్యక్రమంలో కేటీఆర్ మాట్లాడారు. రేవంత్‌రెడ్డి కేవలం 'లక్కీ లాటరీ' తగలడం వల్లే ముఖ్యమంత్రి అయ్యారని ఎద్దేవా చేశారు. ప్రధాని మోదీని సైతం గడగడలాడించిన తెలంగాణ యువశక్తి ముందు రేవంత్‌రెడ్డి ఏ మాత్రం లెక్క కాదని వ్యాఖ్యానించారు.




### హామీలు ఎక్కడ.. ఉద్యోగాలు ఎక్కడ?

ఎన్నికలకు ముందు 'యూత్ డిక్లరేషన్' పేరుతో కాంగ్రెస్ నేతలు అనేక హామీలు ఇచ్చారని కేటీఆర్ అన్నారు. అధికారంలోకి వచ్చిన తర్వాత యువతకు ఉద్యోగాలు కల్పించకుండా అవినీతికి పాల్పడు తున్నారని ఆరోపించారు. యువతను మోసం చేసిన ప్రభుత్వానికి రాబోయే రోజుల్లో ప్రజలే తగిన సమాధానం చెబుతారని అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో పదేళ్లలో 2.32 లక్షల ఉద్యోగాలు కల్పించామని కేటీఆర్ తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలనలో కేవలం 16 వేల ఉద్యోగాలు మాత్రమే ఇచ్చిందని ఆరోపించారు. ఉద్యోగాల కల్పనపై ప్రభుత్వంతో బహిరంగ చర్చకు తాము సిద్ధమని సవాల్ విసిరారు.

### '420 మోసాలకు 420 రాజీనామాలు'

ఎమ్మెల్యే పదవికి కేసీఆర్ రాజీనామా చేయాలని కాంగ్రెస్ నేతలు డిమాండ్ చేయడంపై కేటీఆర్ స్పందించారు. తెలంగాణ రాష్ట్రాన్ని సాధించేందుకు పోరాడిన కేసీఆర్ రాజీనామా చేయాలా? లేక ఎన్నికల హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేసిన రేవంత్‌రెడ్డి రాజీనామా చేయాలా? అని ప్రశ్నించారు. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా చేసిన '420 రకాల మోసాలకు' రేవంత్‌రెడ్డి 420 సార్లు రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఒక్క మంత్రిని బర్తరఫ్ చేయడం మాత్రమే కాకుండా, త్వరలోనే కాంగ్రెస్ ప్రభుత్వాన్నే ప్రజలు బర్తరఫ్ చేసే రోజులు వస్తాయని వ్యాఖ్యానించారు.

### కమీషన్ల కోసం మంత్రుల కొట్లాట

కాంగ్రెస్ ప్రభుత్వంలో మంత్రులు అభివృద్ధి, ప్రజా సంక్షేమంపై కాకుండా కమీషన్ల కోసం పరస్పరం కొట్టుకుంటున్నారని కేటీఆర్ ఆరోపించారు. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు.తెలంగాణ యువతకు ఉద్యోగాలు, ఉపాధి అవకాశాలు కల్పించడంలో ప్రభుత్వం విఫలమైందని ఆరోపించిన కేటీఆర్.. యువత సమస్యలపై సమాధానం చెప్పాలని సీఎం రేవంత్‌రెడ్డిని డిమాండ్ చేశారు. యువతను తక్కువ చేసి మాట్లాడటం మానుకుని, ఉద్యోగాల కల్పనపై వాస్తవాలను ప్రజల ముందు ఉంచాలని అన్నారు.

# 10 రోజుల తర్వాత శిథిలాల నుంచి సజీవంగా!

- 225 మీటర్ల సొరంగం నుంచి చైనా కార్మికుడి రక్షణ
- శిథిలమైన ఇంటి నుంచి 64 ఏళ్ల మహిళను కాపాడిన సహాయక బృందాలు
- తీవ్ర విషాదంలో ఆశలు నింపిన రెండు ఘటనలు

**ఖాట్మాండు:** వరదల బీభత్సంతో అతలాకుతలమైన నేపాల్‌లో సహాయక చర్యలు కొనసాగుతున్న వేళ.. పదో రోజు రెండు అద్భుత ఘటనలు చోటుచేసుకున్నాయి. శిథిలాలు, బురదలో చిక్కుకున్న ఇద్దరు వ్యక్తులను సహాయక బృందాలు సజీవంగా వెలికితీశాయి. జలవిద్యుత్ ప్రాజెక్టు సొరంగంలో చిక్కుకున్న చైనా కార్మికుడితో పాటు.. కూలిపోయిన ఇంటి శిథిలాల్లో చిక్కుకున్న 64 ఏళ్ల మహిళను సురక్షితంగా రక్షించారు. ఈ ఘటనలు తీవ్ర విషాదంలో ఉన్న నేపాల్‌లో కొత్త ఆశలు నింపాయి.



225 మీటర్ల సొరంగంలో చిక్కుకున్న కార్మికుడు జలవిద్యుత్ ప్రాజెక్టులోని 225 మీటర్ల పొడవైన సొరంగంలో చిక్కుకున్న చైనా కార్మికుడిని రక్షించేందుకు నేపాల్ సైన్యం, దక్షిణ కొరియాకు చెందిన విపత్తు సహాయక నిపుణులు సంయుక్తంగా ఆపరేషన్ చేపట్టారు. బురద, శిథిలాలను తొలగిస్తూ ముందుకు సాగిన సహాయక సిబ్బంది.. చివరకు అతడి జాడను గుర్తించారు. సురక్షితంగా బయటకు తీసుకొచ్చిన అనంతరం వైద్య పరీక్షల కోసం అతడిని ఆసుపత్రికి తరలించారు. తనను రక్షించేందుకు వచ్చిన సిబ్బందిని చూసిన సమయంలో ఆ కార్మికుడు తీవ్ర భావోద్వేగానికి గురైనట్లు అధికారులు తెలిపారు.

### శిథిలాల కింద మరో ప్రాణం

మరో ఘటనలో కూలిపోయిన ఇంటి శిథిలాల్లో చిక్కుకున్న 64 ఏళ్ల మహిళను సహాయక బృందాలు సురక్షితంగా బయటకు తీశాయి. వరదల తర్వాత పదో రోజు కూడా శిథిలాల మధ్య ప్రాణాలతో ఉన్నవారిని గుర్తించి రక్షించడంతో సహాయక చర్యల్లో పాల్గొంటున్న సిబ్బందిలో మరింత ఆశ నెలకొంది.

### కొనసాగుతున్న గాలింపు

ఆగస్టు 26న హిమానీనదం విరిగిపడటంతో నేపాల్‌లో భారీ వరదలు సంభవించాయి. పలు గ్రామాలు, ఇళ్లు, రహదారులు, వంతెనలు వరద ప్రవాహానికి కొట్టుకుపోయాయి. ఈ విపత్తులో ఇప్పటివరకు 1,300 మందికి పైగా మృతి చెందగా.. 5,000 మందికి పైగా గల్లంతైనట్లు అధికారులు వెల్లడించారు.ముఖ్యంగా జలవిద్యుత్ ప్రాజెక్టుల్లో చిక్కుకున్న వారి కోసం సహాయక బృందాలు గాలింపు చర్యలను కొనసాగిస్తున్నాయి.

# సమస్యలు గాలికొదిలేసి దేనికి ఈ సంబరాలు?

**ప్రజానావ, హైదరాబాద్:** కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా నిర్వహిస్తున్న వేడుకలపై బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్‌రావు తీవ్ర విమర్శలు చేశారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా ఏ ముఖం పెట్టుకుని పాలన విజయోత్సవాలు నిర్వహిస్తున్నారని ప్రశ్నించారు. ప్రజా సమస్యలను గాలికొదిలేసి సంబరాలు చేసుకోవడం విడ్డూరంగా ఉందని ఎద్దేవా చేశారు.
కాంగ్రెస్ నాయకుల తీరు 'ఉల్టా చోర్ కొత్వాల్ కో డాంటే' అన్న చందంగా తయారైందని హరీశ్‌రావు విమర్శించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పాలనా విధానం, పనితీరుపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉందని ఆరోపించారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా కుంభకోణాలమయంగా మారిపోయిందని మండిపడ్డారు.



### రాజీనామా చేయాల్సింది రేవంత్‌రెడ్డే

ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైన సీఎం రేవంత్‌రెడ్డి రాజీనామా చేయాలని బీఆర్ఎస్ డిమాండ్ చేస్తుంటే..
కాంగ్రెస్ నేతలు కేసీఆర్ రాజీనామా చేయాలని కోరడం విడ్డూరంగా ఉందని హరీశ్‌రావు అన్నారు. తెలంగాణ కోసం పోరాడిన కేసీఆర్ రాజీనామా చేయాల్సిన అవసరం లేదని, ప్రజలను మోసం చేసిన రేవంత్‌రెడ్డే బాధ్యత వహించాలని పేర్కొన్నారు. వెయ్యి రోజుల పాలనపై ప్రభుత్వం గొప్పలు చెప్పుకోవడం కంటే ప్రజలకు ఇచ్చిన హామీల అమలు, పాలనా వైఫల్యాలపై సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

### అసెంబ్లీలో ప్రజా సమస్యలే ఎజెండా

రాబోయే అసెంబ్లీ సమావేశాల్లో విద్యార్థులు, నిరుద్యోగుల సమస్యలతో పాటు జీఓ 97 రద్దు, రైతాంగానికి నమ్మకమైన ఉచిత విద్యుత్ సరఫరా తదితర కీలక అంశాలను బీఆర్ఎస్ ప్రధానంగా ప్రస్తావిస్తుందని హరీశ్‌రావు తెలిపారు. ప్రజల సమస్యలను ప్రభుత్వం విస్మరిస్తే అసెంబ్లీ వేదికగా నిలదీస్తామని స్పష్టం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను సభలో ఎండగట్టేందుకు బీఆర్ఎస్ అధినేత కేసీఆర్.. బీఆర్ఎస్ఎల్పీ సమావేశంలో పార్టీ ఎమ్మెల్యేలకు పూర్తి దిశానిర్దేశం చేస్తారని హరీశ్‌రావు తెలిపారు.ప్రజలకు ఇచ్చిన హామీల అమలుపై ప్రభుత్వం స్పష్టమైన సమాధానం చెప్పాలని, పాలనలో పారదర్శకత పాటించాలని ఆయన డిమాండ్ చేశారు.

# భూములు దోచుకోవడానికే 22ఏ



**ప్రజానావ, హైదరాబాద్:** రాష్ట్రంలో భూములను దోచుకునేందుకే 22ఏ నిషేధిత జాబితాను తీసుకొచ్చారని కేంద్ర మంత్రి, తెలంగాణ బీజేపీ నేత కిషన్‌రెడ్డి ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యం భూములు విక్రయించడమేనని, మాజీ సీఎం కేసీఆర్ తరహాలోనే ప్రస్తుత సీఎం రేవంత్‌రెడ్డి కూడా భూములపై కన్నేశారని విమర్శించారు.నిషేధిత భూముల సమస్యపై భాజపా ఆధ్వర్యంలో శనివారం ఇందిరాపార్కు ధర్నాచౌక్ వద్ద నిర్వహించిన మహాధర్నాలో కిషన్‌రెడ్డి మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాపాలన పేరుతో అధికారంలోకి వచ్చి ప్రజల భూములను లక్ష్యంగా చేసుకుంటోందని ఆరోపించారు.

### అనుమతులున్న భూములూ 22ఏలోనే

ధరణి పేరుతో గత బీఆర్ఎస్ ప్రభుత్వం భూముల విషయంలో ప్రజలను ఇబ్బందులకు గురిచేసిందని కిషన్‌రెడ్డి విమర్శించారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం కూడా అదే తరహాలో వ్యవహరిస్తోందని ఆరోపించారు. అన్ని రకాల అనుమతులు ఉన్న భూములను సైతం 22ఏ నిషేధిత జాబితాలో చేర్చారని అన్నారు.చాలామంది తమ భూములు 22ఏ జాబితాలో ఉన్నాయన్న విషయం కూడా తెలియని పరిస్థితి ఉందని పేర్కొన్నారు. రాష్ట్రాన్ని స్థిరాస్తి వ్యాపార కేంద్రంగా మార్చారని, భూములు విక్రయించకపోతే ప్రభుత్వాన్ని నడపలేని పరిస్థితి ఏర్పడిందని విమర్శించారు.

### 60 లక్షల ఎకరాలకుపైగా..

రాష్ట్రంలో 60 లక్షల ఎకరాలకు పైగా భూములను 22ఏ జాబితాలో చేర్చారని కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. వక్ఫ్ భూములు మినహా అన్ని భూములపై సీఎం రేవంత్‌రెడ్డి కన్నేశారని ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వాన్ని 'ఆర్ఆర్ రియల్ ఎస్టేట్ సంస్థ'గా మార్చారని విమర్శించారు. ప్రభుత్వ ఉద్యోగులకు వేతనాలు, పదవీ విరమణ ప్రయోజనాలు అందించలేని స్థితికి రాష్ట్రాన్ని తీసుకొచ్చారని ఆరోపించారు. ప్రజల భూములను నిషేధిత జాబితాలో చేర్చడం వెనుక కమీషన్ల వ్యవహారం ఉందని వ్యాఖ్యానించారు.

### 'దోచుకున్న ప్రతి రూపాయినీ వసూలు చేస్తాం'

కాంగ్రెస్ నేతలు, అధికారులకు కిషన్‌రెడ్డి హెచ్చరిక చేశారు. తాము అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజల నుంచి దోచుకున్న ప్రతి రూపాయినీ వసూలు చేసి తిరిగి ప్రజలకు పంచుతామని అన్నారు. బీఆర్ఎస్ మాదిరిగానే కాంగ్రెస్ ప్రభుత్వం కూడా 30 శాతం కమీషన్లు అడుగుతోందని ఆరోపించారు.రానున్న రోజుల్లో 22ఏ సమస్యపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని, ఇంటింటికీ వెళ్లి ప్రచారం చేయాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. 22ఏ జాబితాలో చేర్చిన పేదల భూములను వెంటనే తొలగించి, బాధితులకు న్యాయం చేయాలని కిషన్‌రెడ్డి డిమాండ్ చేశారు.

# పెంటగాన్‌లో లీకుల కలకలం

- ఇరాన్ యుద్ధంపై కీలక సమాచారం బయటకు
- 50 మందికి 'లై డిటెక్టర్' పరీక్షలు

**న్యూఢిల్లీ:** అమెరికా–ఇరాన్ యుద్ధానికి సంబంధించిన అత్యంత సున్నితమైన సమాచారం మీడియాకు ఎవరు చేరవేస్తున్నారన్న ప్రశ్న అమెరికా రక్షణ శాఖలో కలకలం రేపుతోంది. ఇరాన్‌తో కొనసాగుతున్న ఘర్షణలో అమెరికా కీలక ఆయుధాల నిల్వలు వేగంగా తగ్గుతున్నాయంటూ వరుస కథనాలు వెలువడుతున్న నేపథ్యంలో.. వాటికి సమాచారాన్ని అందిస్తున్న మూలాలను గుర్తించేందుకు పెంటగాన్ దర్యాప్తును ముమ్మరం చేసినట్లు తెలుస్తోంది. ఇందులో భాగంగా యూఎస్ మిలటరీ జాయింట్ స్టాఫ్‌కు చెందిన సుమారు 50 మంది సైనిక, పౌర సిబ్బందికి పాలిగ్రాఫ్ (లై డిటెక్టర్) పరీక్షలు నిర్వహించినట్లు 'ది న్యూయార్క్ టైమ్స్'ను ఉటంకిస్తూ అంతర్జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి. ఇరాన్‌తో జరుగుతున్న ఘర్షణ నేపథ్యంలో అమెరికా వద్ద దీర్ఘశ్రేణి క్షిపణులు, పేట్రియట్ ఇంటర్‌సెప్టర్లు వంటి కీలక ఆయుధాల నిల్వలు తగ్గుతున్నాయంటూ ఇటీవల పలు మీడియా సంస్థలు కథనాలు ప్రచురించాయి. ఈ సమాచారాన్ని రక్షణ శాఖలో పనిచేస్తున్న వ్యక్తులే మీడియాకు చేరవేశారా? అన్న కోణంలో అధికారులు దర్యాప్తు చేస్తున్నారు. ముఖ్యంగా అమెరికా ఆయుధ నిల్వలు గణనీయంగా తగ్గిన వివరాలు రహస్య సమాచార పరిధిలోకి వస్తాయా? వాటిని ఉద్దేశపూర్వకంగా బయటకు చేరవేశారా? అనే అంశాలపై సిబ్బందిని ప్రశ్నించినట్లు సమాచారం. ఈ పాలిగ్రాఫ్ పరీక్షలు ఆగస్టులో నిర్వహించినట్లు తెలుస్తోంది. జాయింట్ స్టాఫ్‌లో సుమారు 1,500 నుంచి 2,000 మంది అధికారులు, సిబ్బంది పనిచేస్తుండగా.. వారిలో దాదాపు 50 మందిని లై డిటెక్టర్ పరీక్షలకు ఎంపిక చేయడం ప్రాధాన్యం సంతరించుకుంది. అయితే ఈ వ్యవహారంపై పెంటగాన్ అధికార ప్రతినిధి సీన్ పార్నెల్ అంతర్గత సిబ్బంది, దర్యాప్తు అంశాలపై వ్యాఖ్యానించేందుకు నిరాకరించారు. జాతీయ భద్రతకు సంబంధించిన రహస్య సమాచారం లీక్ కావడాన్ని అమెరికా రక్షణ శాఖ అత్యంత తీవ్రంగా పరిగణిస్తోందని, అందుకు అనుగుణంగానే దర్యాప్తు కొనసాగుతోందని ఆయన స్పష్టం చేసినట్లు సమాచారం.

# స్వర సిద్ధి గోవిందునికి కామాక్షి వారి స్వర సేవ

- అన్నమయ్య సంకీర్తనలతో భక్తి సంగీత పరిమళం
- అలరించిన కామాక్షి స్కూల్ ఆఫ్ మ్యూజిక్ కళాకారులు



**ప్రజానావ, తిరుపతి:** అన్నమయ్యపురంలో పద్మశ్రీ డా. శోభారాజు ఆధ్వర్యంలో ప్రతి శనివారం నిర్వహిస్తున్న అన్నదానం–అన్నమ స్వరార్చన కార్యక్రమం భక్తి సంగీతంతో వైభవంగా కొనసాగుతోంది. ఇందులో భాగంగా ఈ శనివారం కామాక్షి స్కూల్ ఆఫ్ మ్యూజిక్ ఆధ్వర్యంలో గురువులు శ్రీమతి సీత దేవిక ద్రోణంరాజు, శ్రీమతి వక్కలంక సౌజన్య మార్గదర్శకత్వంలో అన్నమ స్వరార్చన కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. తొలుత విష్ణు సహస్ర నామ స్తోత్రం, లక్ష్మి అష్టోత్తర శతనామ స్తోత్రం, అన్నమయ్య అష్టోత్తరం, గురుదేవతా స్తుతితో కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. అనంతరం కామాక్షి స్కూల్ ఆఫ్ మ్యూజిక్‌కు చెందిన కళాకారులు శ్రీమతి సీత దేవిక ద్రోణంరాజు, శ్రీమతి వక్కలంక సౌజన్య, చింత లక్ష్మి శ్రీ వైష్ణవి, దిల్లీ సుమ, పడకంటి రిద్ధి, కొరివి లలిత, సాన్విత్ రాచూరి, కర్రె విష్ణు ప్రియ, మోనిక చొల్లేటి, సహస్ర మంత, తిమ్మరాజు చంద్రిక, సి. ఆరాధ్య, ఎం.వి.ఎస్. సాయి శ్రుతి, నందన కృతి సత్యవోలు, పవని పొలోజు, విదుల రాయబండి, శ్రేష్ఠ ద్రోణంరాజు, మహాలక్ష్మి ద్రోణంరాజు తదితరులు శ్రీ స్వరసిద్ధి వేంకటేశ్వర స్వామివారికి భక్తిపూర్వక స్వరార్చన సమర్పించారు. "మేలుకొనవే నీలమేఘ, ఆదిమూర్తి యీతడు, మత్స్య కూర్మ వరాహ, అంగనకు నీవె, రామ రామచంద్ర, కొలువై వున్నాడు, ఇందరికీ అభయంబు, ఎట్టు గూడె పెండ్లి, శరణు శరణు సురేంద్ర, పెరిగినాడు చూడరో, నారాయణా చ్యుతానంత, ఈతడే ముక్తి దోవ, లాలి శ్రీ కృష్ణయ్య" వంటి అన్నమాచార్య సంకీర్తనలను శ్రుతి–లయ సమన్వయంతో ఆలపించి భక్తులను విశేషంగా ఆకట్టుకున్నారు. శిష్యుల గానంలో అన్నమయ్య సాహిత్యంలోని భక్తి, మాధుర్యం, ఆధ్యాత్మిక భావం ప్రతిధ్వనించగా, సమష్టి స్వరార్చన భక్తులకు ఆధ్యాత్మికా నందాన్ని పంచింది. శ్రీనివాస్ కీబోర్డుపై, అజయ్ తబలాపై వాయిద్య సహకారం అందించడంతో గాన కార్యక్రమానికి మరింత శోభ చేకూరింది. ఈ సందర్భంగా అన్నమాచార్య భావనా వాహిని పక్షాన గురువులు, కళాకారులను అభినందిస్తూ, అన్నమయ్య సంకీర్తనలను భావపూర్వకంగా ఆలపిస్తూ భక్తి సంగీత పరంపరను కొనసాగిస్తున్న కామాక్షి స్కూల్ ఆఫ్ మ్యూజిక్ కృషిని ప్రశంసించారు. అనంతరం అన్నమాచార్య భావనా వాహిని వ్యవస్థాపకురాలు పద్మశ్రీ డా. శోభారాజు, సంస్థ మేనేజింగ్ ట్రస్టీ డా. నందకుమార్ పాల్గొన్న కళాకారులకు శ్రీ స్వరసిద్ధి వేంకటేశ్వర స్వామివారి జ్ఞాపికలను అందజేసి సత్కరించారు. కార్యక్రమం ముగింపులో శ్రీ స్వరసిద్ధి వేంకటేశ్వర స్వామివారికి అంగనలీరే మంగళహారతి సమర్పించగా, అనంతరం భక్తులకు ప్రసాద వితరణతో అన్నమ స్వరార్చన కార్యక్రమం విజయవంతంగా ముగిసింది.



## దివ్యాంగులకు అండగా.. బియ్యం పంపిణీ

**ప్రజానావ, హైదరాబాద్:** రామంతాపూర్ డివిజన్ పరిధిలో ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్న దివ్యాంగులు, వికలాంగులకు రామంతాపూర్ మాజీ కార్పొరేటర్ గంధం జ్యోత్స్న నాగేశ్వర్ రావు తన వంతు సహాయాన్ని అందించారు. శారీరక వైకల్యాలతో ఇబ్బందులు పడుతున్న వారి పరిస్థితులను చూసి చలించిన ఆయన.. వారి ఆర్థిక పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని సొంత ఖర్చులతో ఉచితంగా బియ్యం బస్తాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాజీ కార్పొరేటర్ మాట్లాడుతూ.. ఆర్థికంగా వెనుకబడిన, శారీరక వైకల్యాలతో ఇబ్బందులు పడుతున్న దివ్యాంగులను ఆదుకోవ డం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. సమాజంలో అండగా నిలిచే అవసరం ఉన్న వారికి తనవంతు సహకారం అందించేందుకు ఎల్లప్పుడూ ముందుం టానని తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు సురం శంకర్, నందు తదితరులు పాల్గొన్నారు.

# బాల్య వివాహాల నివారణపై అవగాహన



**ప్రజానావ, కొందుర్గు :** బాల్య వివాహాలను పూర్తిగా నిర్మూలించి, ప్రతి బాలబాలికకు విద్య, రక్షణ, సురక్షితమైన బాల్యాన్ని అందించాలనే లక్ష్యంతో ఆశ్రిత–జస్ట్ రైట్స్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో రంగారెడ్డి జిల్లా కొందుర్గులోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయం (కేజీబీవీ)లో బాల్య వివాహాల నివారణపై అవగాహన కార్యక్రమం, ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. నవంబర్ 27ను అంతర్జాతీయ బాల్య వివాహాల వ్యతిరేక దినంగా ప్రకటించిన సందర్భంగా, ప్రాంతంలో బాల్య వివాహాల నివారణకు కృషి చేసిన మహిళా శిశు సంక్షేమ శాఖ సూపర్‌వైజర్, షీ టీమ్స్ పోలీసులు, ఉపాధ్యాయులను ఆశ్రిత–జస్ట్ రైట్స్ ప్రతినిధులు ప్రత్యేకంగా అభినందించి సత్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో వక్తలు మాట్లాడుతూ, బాల్య వివాహాల వల్ల బాలికల విద్య, ఆరోగ్యం, భద్రత, భవిష్యత్తుపై తీవ్ర ప్రతికూల ప్రభావాలు పడతాయని ఆందోళన వ్యక్తం చేశారు. 18 సంవత్సరాలు నిండని బాలికకు వివాహం చేయడం చట్టరీత్యా నేరమని, బాల్య వివాహాల నివారణకు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు మరియు సమాజంలోని ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని పిలుపునిచ్చారు. గ్రామీణ ప్రాంతాల్లో అనుమానాస్పదంగా బాల్య వివాహాలు జరుగుతున్నట్లు సమాచారం అందిన వెంటనే సంబంధిత అధికారులకు తెలియజేయాలని, అలాగే బాలల అత్యవసర సహాయం కోసం చైల్డ్ హెల్ప్‌లైన్ నెంబర్ 1098ను సంప్రదించవచ్చని అవగాహన కల్పించారు. అనంతరం నిర్వహించిన ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలలో భాగంగా, విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమైనదని కొనియాడారు. బాల్య వివాహాలు, బాల కార్మికత్వం, పాఠశాలలు మానివేసే సమస్యలను ప్రాథమిక దశలోనే గుర్తించి, పిల్లలకు రక్షణ కల్పించడంలో ఉపాధ్యాయులు ఎల్లప్పుడూ ముందుండాలని కోరారు. కార్యక్రమంలో భాగంగా ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించి, వారి సేవలను ప్రశంసించారు. "బాల్య వివాహాలు లేని సమాజం – ప్రతి బాలికకు విద్య" అనే సందేశాన్ని సమాజంలోకి విస్తృతంగా తీసుకెళ్తామని విద్యార్థులు, ఉపాధ్యాయులు మరియు అధికారులు కలిసి ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్‌వైజర్ ఉజ్వల, షీ టీమ్స్ మరియు పోలీస్ శాఖ అధికారులు, పాఠశాల ఉపాధ్యాయులు, ఆశ్రిత–జస్ట్ రైట్స్ ప్రతినిధులు, విద్యార్థినులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఉక్రెయిన్‌పై రష్యా దాడులకు
# మూడు రోజుల బ్రేక్

- పుతిన్ కీలక ఆదేశాలు
- మాస్కో చేరుకున్న ట్రంప్ ప్రత్యేక ప్రతినిధులు విట్కాఫ్, కుష్నర్

**మాస్కో:** ఉక్రెయిన్‌పై రష్యా కొనసాగిస్తున్న దాడులకు తాత్కాలికంగా బ్రేక్ పడింది. మూడు రోజుల పాటు ఉక్రెయిన్‌పై దాడులు నిలిపివేయాలని రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ సైన్యాన్ని ఆదేశించారు. శనివారం నుంచే ఈ ఆదేశాలు అమ ల్లోకి వస్తాయని ప్రకటించారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రత్యేక ప్రతినిధులు స్టీవ్ విట్కాఫ్, జేర్డ్ కుష్న ర్ రష్యాలో పర్యటిస్తున్న నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. వారి రాక సందర్భంగా ఎలాంటి ఘర్షణ వాతావరణం ఉండకూడదన్న ఉద్దేశంతోనే పుతిన్ ఈ తాత్కాలిక విరామానికి ఆదే శించినట్లు సమాచారం. ఇప్పటికే రష్యా చేరుకున్న విట్కాఫ్, కుష్నర్‌లకు రష్యా అధ్యక్షుడి ప్రతినిధి కిరిల్ డిమిత్రీవ్ స్వాగతం పలికారు. ఉక్రెయిన్‌తో కొనసాగు తున్న యుద్ధానికి ముగింపు పలికేందుకు, ఇరుదేశాల మధ్య సంధి కుదిర్చేందుకు రష్యా ప్రతినిధులతో వారు చర్చలు జరపనున్నారు. గతంలోనూ కిరిల్ డిమిత్రీవ్ పుతిన్ తరఫున ఉక్రెయిన్ యుద్ధంపై అమెరికా నేతలతో చర్చలు జరిపారు. ఇదిలా ఉండ గా, యుద్ధానికి ముగింపు పలికేందుకు తమ వద్ద సరికొత్త, బలమైన ప్రతిపాదనలు ఉన్నాయని అమెరి కా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ శుక్రవారం వెల్లడిం చారు. ఆ ప్రతిపాదనలపై చర్చించేందుకే తమ ప్రత్యేక ప్రతినిధులను రష్యాకు పంపినట్లు తెలిపారు. అయితే ఆ ప్రతిపాదనలు ఏమిటన్న విషయాన్ని మాత్రం ట్రంప్ వెల్లడించలేదు. విట్కాఫ్, కుష్నర్‌లు సమర్థంగా మధ్యవర్తిత్వం చేయగలరని, ఇప్పటికే వారు పలు సందర్భాల్లో విజయవంతంగా చర్చలు జరిపారని ట్రంప్ పేర్కొన్నారు. తాజా చర్చలు సఫలమై రష్యా–ఉక్రెయిన్ యుద్ధానికి ముగింపు పలికే దిశగా అడుగులు పడతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. మరోవైపు రష్యా తమపై దాడులను నిలిపివేయాలని ఉక్రెయిన్ అధ్యక్షుడు వొలొదిమిర్ జెలెన్స్కీ విజ్ఞప్తి చేశారు. నాలుగేళ్లకుపైగా కొనసాగుతున్న రష్యా–ఉక్రెయిన్ యుద్ధానికి తెరపడే అవకాశాలపై తాజా పరిణామాలు మరోసారి ఆశలు రేకెత్తిస్తున్నాయి.

# భార్యను తొలగించారని.. టీచర్లపై పగ!

- సాంబార్‌లో గోవు పేడ పొడి కలిపిన వ్యక్తి
- అదృష్టవశాత్తూ విద్యార్థులకు తప్పిన ముప్పు
- టీచర్లు రుచి చూసిన శాంపిల్‌లోనే కల్తీ



**ఈరోడ్:** భార్యను పాఠశాల వంట మనిషి ఉద్యోగం నుంచి తొలగించారన్న కోపంతో ఓ వ్యక్తి టీచర్లపై ప్రతీకారం తీర్చుకునేందుకు చేసిన పని తమిళనాడులో కలకలం రేపింది. ఈరోడ్ జిల్లాలోని ఓ ప్రభుత్వ పాఠశాలలో చోటుచేసుకున్న ఈ ఘటనలో ఆర్ముగం అనే వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీసుల వివరాల ప్రకారం.. ఆర్ముగం భార్య ఆ పాఠశాలలో వంట మనిషిగా పనిచేసేది. అయితే ఆమె వంట సరిగ్గా చేయకపోవడం, విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండటంతో ఇటీవల పాఠశాల యాజమాన్యం ఆమెను విధుల నుంచి తొలగించింది. దీంతో ఆర్ముగం పాఠశాల సిబ్బందిపై తీవ్ర ఆగ్రహం పెంచుకున్నాడు. ఎలాగైనా వారిపై పగ తీర్చుకోవాలని నిర్ణయించుకుని పథకం వేశాడు. తమిళనాడు ప్రభుత్వ పాఠశాలల్లో అమలు చేస్తున్న ఉచిత అల్పాహార పథకంలో భాగంగా సాంబార్ కూడా వడ్డిస్తుంటారు. ఈ నేపథ్యంలో ఆగస్టు 29న పాఠశాలకు వెళ్లిన ఆర్ముగం.. సాంబార్‌లో కలిపేందుకు గోవు పేడతో తయారు చేసిన పొడిని తీసుకెళ్లాడు. అయితే విద్యార్థులకు వడ్డించే సాంబార్‌లో కాకుండా, ముందుగా ఉపాధ్యాయులు రుచి చూసేందుకు ప్రత్యేకంగా తీసి ఉంచిన సాంబార్ శాంపిల్‌లో సాంబార్ పొడికి బదులుగా గోవు పేడ పొడిని కలిపాడు. సాధారణంగా విద్యార్థులకు ఆహారం వడ్డించే ముందు ఉపాధ్యాయులు దాని రుచి, నాణ్యతను పరిశీలిస్తారు. ఎప్పటిలాగే టీచర్లు సాంబార్‌ను రుచి చూడగా చేదుగా, వింతగా అనిపించింది. పసుపు పొడి ఎక్కువగా కలవడం వల్ల రుచి మారి ఉండొచ్చని తొలుత భావించారు. అయితే అనుమానం వచ్చి పరిశీలించగా సాంబార్‌లో గోవు పేడ పొడి కలిసినట్లు గుర్తించారు. ఈ పని ఆర్ముగమే చేసినట్లు తెలుసుకుని పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు ఆర్ముగంను అరెస్ట్ చేసి దర్యాప్తు చేపట్టారు. అయితే ఆర్ముగం విద్యార్థులకు వడ్డించే సాంబార్‌లో కాకుండా టీచర్లు రుచి చూసే శాంపిల్‌లోనే గోవు పేడ పొడిని కలపడంతో పిల్లలకు ఎలాంటి హాని జరగలేదు. లేదంటే పెద్ద ప్రమాదమే జరిగి ఉండేదని అధికారులు భావిస్తున్నారు. భార్యను ఉద్యోగం నుంచి తొలగించా రన్న కారణంతో పాఠశాల సిబ్బందిపై పగ పెంచుకుని ఇలాంటి చర్యకు పాల్పడటం స్థానికంగా చర్చనీయాంశంగా మారింది.

# బడా గణేష్ దర్శనానికి.. భారీ ఏర్పాట్లు

- 50 లక్షలకు పైగా భక్తులు వచ్చే అవకాశం
- రద్దీకి తగ్గట్టుగా పటిష్ట ఏర్పాట్లు
- ట్రాఫిక్, పారిశుద్ధ్యం, విద్యుత్, తాగునీటిపై ప్రత్యేక దృష్టి



**ప్రజానావ హైదరాబాద్:** ఖైరతాబాద్ బడా గణేష్ నవరాత్రి ఉత్సవాలను ఈ నెల 14 నుంచి 25వ తేదీ వరకు అంగరంగ వైభవంగా నిర్వహించనున్నట్లు ఖైరతాబాద్ ఎమ్మెల్యే, ఉత్సవ కమిటీ అధ్యక్షుడు దానం నాగేందర్ తెలిపారు. శనివారం స్థానిక మున్సిపల్ వార్డు కార్యాలయ ప్రాంగణంలో ఉత్సవాల నిర్వహణపై ఏర్పాటు చేసిన కోఆర్డినేషన్ సమావేశంలో ఉత్సవ కమిటీ సభ్యులు, వివిధ శాఖల అధికారులతో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా దానం నాగేందర్ మాట్లాడుతూ.. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని ముందస్తు ప్రణాళికతో ఏర్పాట్లు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలోని వివిధ జిల్లాలతో పాటు దేశవ్యాప్తంగా ఖైరతాబాద్ బడా గణేష్‌ను దర్శించుకునేం దుకు భక్తులు తరలివచ్చే అవకాశం ఉన్నందున సాధారణ భక్తులతో పాటు వీఐపీలు, వీవీఐపీలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా మెరుగైన సదుపా యాలు కల్పించాలని సూచించారు. ఇప్పటికే భక్తుల రద్దీ పెరుగుతోందని, ఈ ఏడాది గతం కంటే అధిక సంఖ్యలో భక్తులు వచ్చే అవకాశం ఉన్నందున అధికారులు, ఉత్సవ కమిటీ సభ్యులు భక్తిశ్రద్ధలతో సమన్వయంతో పనిచేయాలన్నారు. ముఖ్యమంత్రి, గవర్నర్, కేంద్ర మంత్రులు, రాష్ట్ర మంత్రులు, ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు స్వామివారిని దర్శించుకునే సమయంలో ప్రోటోకాల్‌ను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. పోలీసు బందోబస్తు, బారికేడింగ్, నిరంతర విద్యుత్ సరఫరా, తాగునీరు, విద్యుత్ దీపాల అలంకరణ, పారిశుద్ధ్య నిర్వహణ, ట్రాఫిక్ నియంత్రణ, లూజ్ వైరింగ్ తొలగింపు, రోడ్ల మరమ్మతులు, స్ట్రీట్‌లైటింగ్ వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశించారు. దేవాదాయశాఖ ఆధ్వర్యంలో పండితులతో వేద పారాయణం, కళా ప్రదర్శనలు, రోజువారీ కార్యక్రమాలను నిర్వహించడంతో పాటు వాటిని మీడియా ద్వారా విస్తృతంగా ప్రచారం చేయాలని సూచించారు. భారీ రద్దీ నేపథ్యంలో ప్రసాదాల పంపిణీలో ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు ఏర్పాట్లు చేయాలని, సాధారణ భక్తులకు, వీఐపీలకు ప్రత్యేక మార్గాలను ఏర్పాటు చేసి ప్రతి భక్తుడికి సజావుగా దర్శనం కల్పించేలా పటిష్ట ప్రణాళిక రూపొందించాలని అన్నారు. ఈ నవరాత్రి ఉత్సవాల్లో 50 లక్షలకు పైగా భక్తులు స్వామివారిని దర్శించుకునే అవకాశం ఉందని, అందుకు అనుగుణంగా అన్ని శాఖలు పూర్తి సమన్వయంతో పనిచేయాలని దానం నాగేందర్ సూచించారు. ఖైరతాబాద్ పరిసరాల్లో ఎక్కడా ట్రాఫిక్ జామ్ కాకుండా ముందస్తు ప్రణాళికతో వాహనాలను దారి మళ్లించి నిర్ణయించిన పార్కింగ్ ప్రాంతాలకు తరలించాలని పోలీసు అధికారులను ఆదేశించారు. సమావేశంలో జీహెచ్ఎంసీ అదనపు కమిషనర్ రవికిరణ్, కేపీసీ మురళీకృష్ణతో పాటు హెచ్ఎండీఏ, విద్యుత్, జీహెచ్ఎంసీ, వైద్య, ఆర్అండ్‌బీ, దేవాదాయ, పోలీస్ తదితర శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# మురికి కూపాల నుంచి.. ముస్తాబు చెరువుల దాకా

- కబ్జాల చెర నుంచి జలకళకు
- వాకింగ్ ట్రాక్‌లు, పచ్చదనం, వ్యూపాయింట్లతో కొత్త రూపు
- ఇప్పటికే మూడు చెరువులు ప్రారంభం.. మరో మూడు ప్రారంభానికి సిద్ధం






**ప్రజానావ హైదరాబాద్:** ఒకప్పుడు మురుగునీటితో కంపుకొడుతూ.. గుట్టలుగా పేరుకుపోయిన ప్లాస్టిక్ వ్యర్థాలతో దుర్వాసన వెదజల్లుతూ.. ముల్లపొదలు, చెత్తాచెదారంతో ప్రజలు అటువైపు చూడాలంటేనే భయపడే పరిస్థితి. అలాంటి చెరువుల రూపురేఖలు ఇప్పుడు పూర్తిగా మారుతున్నాయి. కబ్జాల చెర నుంచి బయటపడుతున్న చెరువులు జలకళతో కళకళలాడుతూ నగరవాసులకు ఆహ్లాదాన్ని పంచేలా ముస్తాబవుతున్నాయి. చెత్త, మురుగు, ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించడంతో పాటు వాకింగ్ ట్రాక్‌లు, కూర్చునే సదుపాయాలు, పచ్చదనం, పిల్లలు ఆడుకునేలా వసతులు కల్పిస్తూ చెరువులను ఆహ్లాదకరమైన ప్రదేశాలుగా తీర్చిదిద్దుతున్నారు. ఇప్పటికే మూడు చెరువులు ప్రజలకు అందుబాటులోకి రాగా.. మరో మూడు చెరువులు ఈ నెలాఖరులోగా ప్రారంభానికి సిద్ధమవుతున్నాయి.

### ఉప్పల్ నల్లచెరువుకు కొత్త కళ

ఉప్పల్ నల్లచెరువు సరికొత్త అందాలతో ఆకట్టుకునేలా మారింది. ఆక్రమణల కారణంగా 52.30 ఎకరాలకు పరిమితమైన చెరువు విస్తీర్ణాన్ని హైడ్రా 67.31 ఎకరాలకు పెంచింది. చెరువు చుట్టూ 2.4 కిలోమీటర్ల బండ్‌తో పాటు వాకింగ్ ట్రాక్‌ను అందుబాటులోకి తెచ్చింది. అన్ని వయసుల వారు సేదతీరేలా గజబోలు, కుర్చీలు ఏర్పాటు చేస్తున్నారు. వరదనీరు సులభంగా చెరువులోకి చేరేలా ఇన్‌లెట్లు, చెరువు నిండిన అనంతరం పరిసర ప్రాంతాలకు వరద ముప్పు లేకుండా ఔట్‌లెట్ వ్యవస్థను అభివృద్ధి చేశారు. చెరువు చుట్టూ ఆక్రమణల తొలగింపులో ఎలాంటి సడలింపులు లేకుండా చర్యలు చేపట్టారు.

### చెరువుల అభివృద్ధిపై కమిషనర్ పరిశీలన

మాధాపూర్‌లోని తమ్మిడికుంట, సున్నం చెరువుల అభివృద్ధి పనులను హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ శనివారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. తమ్మిడికుంటలో పేరుకుపో యిన బయో వ్యర్థాలను తొలగించడంతో పాటు మురుగునీటిని పూర్తిగా తొలగించి, పాత ఆనవాళ్లు లేకుండా అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. మెటల్ చార్మినార్ వైపు ఉన్న ప్లాస్టిక్ వ్యర్థాల సేకరణ, వేరు చేసే యూనిట్లతో చెరువుకు కాలుష్య ముప్పు ఉందని పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఇప్పటికే హెచ్చరించిన నేపథ్యంలో వాటిని వెంటనే తొలగించాలని అధికారులను ఆదేశించారు. సున్నం చెరువు పరిసరాలను పరిశీలించిన ఆయన.. చెరువు బండ్‌పై వ్యూపాయింట్ ఏర్పాటు చేయాలని, మరింత పచ్చదనం పెంచి ఆహ్లాదకరమైన వాతావరణాన్ని కల్పించాలని సూచించారు. అంతకుముందు కృష్ణాకాంత్ పార్కును కూడా పరిశీలించారు. రెండో విడతలో చేపట్టిన 14 చెరువుల్లో భాగమైన కృష్ణాకాంత్ పార్కు చెరువు లోతు, విస్తీర్ణం పెంచితే వరద ముప్పును చాలావరకు నియంత్రించవచ్చని రంగనాథ్ పేర్కొన్నారు. చెరువులోకి నేరుగా వరదనీరు చేరేలా చర్యలు చేపడితే కృష్ణానగర్, యూసుఫ్‌గూడతో పాటు చెరువు దిగువన ఉన్న శ్రీనివాసనగర్, అమీర్‌పేట ప్రాంతాలు నీట మునిగే ప్రమాదాన్ని నివారించవచ్చని తెలిపారు. ఇలా నగరంలోని చెరువులను కేవలం నీటి వనరులుగానే కాకుండా.. పర్యావరణ పరిరక్షణ, వరద నియంత్రణతో పాటు ప్రజలకు ఆహ్లాదం, వ్యాయామం, సేదతీరే వేదికలుగా తీర్చిదిద్దే దిశగా పనులు సాగుతున్నాయి.

## చేవెళ్ల అభివృద్ధికి..
# నిధుల వరద!

- రోడ్లు, ట్రాఫిక్, అండర్‌పాస్‌లు, అండర్‌డ్రైనేజీపై సమీక్ష
- అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని మంత్రి కోమటిరెడ్డి ఆదేశం

**ప్రజానావ, రంగారెడ్డి:** చేవెళ్ల పట్టణ అభివృద్ధిపై రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ప్రత్యేక దృష్టి సారించారు. శనివారం చేవెళ్ల మున్సిపల్ చైర్‌పర్సన్ దేవర సమత వెంకట్‌రెడ్డి నివాసానికి మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి విచ్చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాలే యాదయ్యతో కలిసి మంత్రి కోమటిరెడ్డిని చైర్‌పర్సన్ దంపతులు, కౌన్సిలర్లు, స్థానిక నాయకులు శాలువాలతో ఘనంగా సన్మానించారు. అనంతరం మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఎమ్మెల్యే కాలే యాదయ్యతో కలిసి చేవెళ్ల నియోజకవర్గంతో పాటు మున్సిపల్ పరిధిలో చేపట్టాల్సిన పలు అభివృద్ధి కార్యక్రమాలపై సుదీర్ఘంగా చర్చించారు. ముఖ్యంగా రహదారుల అభివృద్ధి, పట్టణంలో ట్రాఫిక్ సమస్యల పరిష్కారం, అండర్‌పాస్‌ల నిర్మాణం, అండర్‌డ్రైనేజీ వ్యవస్థ, ఇతర మౌలిక వసతుల కల్పనకు అవసరమైన నిధులపై సమీక్షించారు. చేవెళ్ల నుంచి మన్నెగూడ వరకు కొనసాగుతున్న రహదారి పనులను వేగవంతం చేసి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. పట్టణంలో పెరుగుతున్న అవసరాలకు అనుగుణంగా మౌలిక వసతులను మెరుగుపర్చేందుకు అవసరమైన నిధులను మంజూరు చేయించేందుకు కృషి చేస్తానని మంత్రి హామీ ఇచ్చారు. చేవెళ్ల ప్రభుత్వ జూనియర్ కళాశాలకు కంప్యూటర్లు, ఫర్నిచర్ అందించాలని ప్రతీక్‌రెడ్డి ఫౌండేషన్ ద్వారా చేసిన విజ్ఞప్తిపై మంత్రి సానుకూలంగా స్పందించారు. విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేలా అవసరమైన సహకారం అందిస్తామని తెలిపారు.



# విద్యా రంగానికి జీవితం అంకితం

గతంలో 1952 నుండి 1962 వరకు భారతదేశానికి మొదటి ఉపరాష్ట్రపతిగా పనిచేశాడు. 1949 నుండి 1952 వరకు సోవియట్ యూనియన్‌లో భారతదేశానికి రెండవ రాయబారిగా ఉన్నాడు. 1939 నుండి 1948 వరకు బెనారస్ హిందూ విశ్వ విద్యాలయానికి నాల్గవ వైస్–ఛాన్సలర్‌గా, 1931 నుండి 1936 వర కు ఆంధ్ర విశ్వవిద్యాలయానికి రెండవ వైస్–ఛాన్సలర్‌గా డా ఉన్నాడు. రాధాకృష్ణన్ తులనాత్మక మతం, తత్వశాస్త్రం యొక్క 20వ శతాబ్దపు అత్యంత ప్రభావవంతమైన, విశిష్టమైన పండితులలో ఒకరిగా పరిగణించబడ్డాడు.

సర్వేపల్లి రాధాకృష్ణ (1888 సెప్టెంబరు 5 – 1975 ఏప్రిల్ 17) 1962 నుండి 1967 వరకు భారతదేశానికి రెండవ రాష్ట్రపతిగా పనిచేసిన భారతీయ రాజకీయవేత్త, తత్వవేత్త, రాజనీతిజ్ఞుడు. గతంలో 1952 నుండి 1962 వరకు భారతదేశానికి మొదటి ఉపరాష్ట్రపతిగా పనిచేశాడు. 1949 నుండి 1952 వరకు సోవియట్ యూనియన్‌లో భారతదేశానికి రెండవ రాయబారిగా ఉన్నాడు. 1939 నుండి 1948 వరకు బెనారస్ హిందూ విశ్వవిద్యాలయానికి నాల్గవ వైస్–ఛాన్సలర్‌గా, 1931 నుండి 1936 వర కు ఆంధ్ర విశ్వవిద్యాలయానికి రెండవ వైస్–ఛాన్సలర్‌గా కూడా ఉన్నాడు. రాధాకృష్ణన్ తులనాత్మక మతం, తత్వశాస్త్రం యొక్క 20వ శతాబ్దపు అత్యంత ప్రభావవంతమైన, విశిష్టమైన పండితులలో ఒకరిగా పరిగణించ బడ్డాడు. ఆయన కలకత్తా విశ్వవిద్యాలయంలో కింగ్ జార్జ్ వి చైర్ ఆఫ్ మెంటల్ అండ్ మోరల్ సైన్స్‌లో 1921 నుండి 1932 వరకు, ఆక్స్‌ఫర్డ్ విశ్వవిద్యాలయంలో స్పాల్డింగ్ చైర్ ఆఫ్ ఈస్టర్న్ రెలిజియన్ అండ్ ఎథిక్స్ కు 1936 నుండి 1952 వరకు తన సేవలనందించాడు. భారతీయ తాత్వికచింతనలో పాశ్చాత్య తత్వాన్ని ప్రవేశ పెట్టారని ప్రతీతి. రెండు పర్యాయాలు ఉపరాష్ట్రపతి పదవి చేపట్టి, తరువాత రాష్ట్రపతిగా ఒక పర్యాయం పదవిని చేపట్టి, భారతదేశపు అత్యంత క్లిష్టకాలంలో (చైనా, పాకిస్తాన్లతో యుద్ధ సమయం) ప్రధానులకు మార్గనిర్దేశం చేశాడు. డాక్టర్ రాధాకృష్ణన్ వలం ఒక రాష్ట్రపతి మాత్రమే కాదు. తన జీవితంలో ఎక్కువ భాగాన్ని విద్యా రంగాని అంకితం చేసిన నిబద్ధత కలిగిన ఉపాధ్యాయుడు, ప్రఖ్యాత తత్వవేత్త. ఆయన అనేక విద్యా సంస్థల్లో తత్వశాస్త్ర బోధకుడిగా పనిచేశారు. ఆంధ్ర విశ్వవిద్యాల యం, బెనారస్ హిందూ విశ్వవిద్యాలయాలకు వైస్–ఛాన్సలర్‌గా విశిష్ట సేవలందించా రు. ఆ తర్వాత స్వతంత్ర భారత దేశపు మొట్ట మొదటి ఉపరాష్ట్రపతిగా, అనంతరం రెండవ రాష్ట్రపతిగా బాధ్యతలు నిర్వర్తిం చారు. విద్య గురించి ఆయన వ్యక్తపరిచిన ఆలోచనలు నేటికీ ఎంతో ప్రాసంగి కమైనవి. గతంలో ఒక ఉపాధ్యాయ దినోత్సవ ప్రసం గంలో మాజీ రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ డాక్టర్ రాధాకృష్ణన్ సూక్తిని గుర్తుచేసు కుంటూ.. “విద్య యొక్క అంతిమ లక్ష్యం వలం సమాచా రాన్ని సేకరించడం మాత్రమే కాదు... మనలను బాధ్యతాయుతమైన పౌరులుగా తీర్చిదిద్దే మానసిక పరిపక్వతను, హేతుబద్ధమైన ఆలో చనా దృక్పథాన్ని, ప్రజాస్వామ్య స్ఫూర్తిని పెంపొందించడమే.” అని పర్కొన్నా రు. ఈ ఉన్నతమైన ఆలోచనే రాధాకృష్ణన్‌ను ఈ దినోత్స వానికి నిరంతర ప్రేరణగా నిలబెట్టింది. ఆయన దృష్టిలో విద్య అంటే వలం పాఠ్యపుస్త కాలు, పరీక్షలు లేదా సాంతిక నైపుణ్యాల పరిమితం కాదుజ.. విద్యార్థుల్లో స్వతంత్ర ఆలోచనా శక్తి, తార్కిక దృష్టి, బాధ్య తాయుత పౌర భావాలను పెంపొందించడమే నిజమైన విద్య. భారత దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన వెంటనే, 1948లో ంద్ర ప్రభుత్వం డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ అధ్యక్షతన ప్రతిష్టాత్మక విశ్వవిద్యాలయ విద్యా కమిషన్ (నివర్సిటీ ఎడ్యుషన్ కమిషన్)ను ఏర్పాటు చేసింది. ఈ కమిషన్ దేశంలోని విశ్వవిద్యాలయ విద్య తీరుతెన్నులను లంక షంగా పరిశీలించి, భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా కీలక మార్పులను సూచించింది. స్వతంత్ర భారతంలో ఉన్నత విద్యా వ్యవ స్థ అభివృద్ధికి ఈ నివేదిక ఒక బలమైన పునాదిగా నిలిచింది. విశ్వ విద్యాలయ విద్య నిర్మాణం, బోధనా ప్రమాణాలు, పరిశోధనలు మరియు విద్యా నిర్వహణ వంటి రంగాలపై ఈ కమిషన్ సిఫార్సులు తీవ్ర ప్రభా వాన్ని చూపాయి. తర్వాతి కాలంలో వచ్చిన కొఠారి కమిషన్ నివేదికతో పాటు, రాధాకృష్ణన్ కమిషన్ ఇచ్చిన 1948–49 నాటి నివేదిక దేశ విద్యా విధానాల రూపకల్పనకు వలస్తంభంగా నిలిచిందని ప్రభుత్వ పత్రాలు స్ప ష్టం చేస్తున్నాయి. ప్రస్తుత విద్యాసంస్థలకు ఇచ్చే “డీమ్డ్ విశ్వవిద్యాలయాల” హోదా అనే భావన కూడా రాధాకృష్ణన్ కమిషన్ సిఫార్సుల నుంచే ఉద్భవించింది. ఉపాధ్యాయ దినోత్సవం 2026 సందర్భంగా దేశ రాజధాని న్యూఢిల్లీలో జాతీయ ఉపాధ్యాయ అవార్డుల ప్రదానోత్సవం జరగనుంది. పాఠశాల విద్యా రంగానికి విశేష సేవలందించిన 48 మంది ఉపాధ్యాయు లకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము సెప్టెంబర్ 5న ఈ ప్రతిషా త్మక పురస్కా రాలను అందజేయనున్నారు. ఈ పురస్కార గ్రహీతలను జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలలో వడు దశల పారదర్శక ప్రక్రియ ద్వారా ఎంపిక చేశారు. వీరు దేశంలోని 27 రాష్ట్రాలు, 7 ంద్రపాలిత ప్రాంతాలు, ఆరు ంద్ర ప్రభుత్వ సంస్థల పరిధికి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. పాఠశాల విద్య నాణ్యతను పెంచి, తమ బోధన ద్వారా విద్యార్థుల జీవితాలను తీర్చి దిద్దిన ఉపాధ్యాయులను గుర్తించి సత్కరించేందుకు భారత ప్రభుత్వం 1958లో జాతీయ ఉపాధ్యాయ అవార్డులను ప్రారంభించింది. భారతదే శంలో జరుపుకునే ఉపాధ్యాయ దినోత్సవానికి, ప్రపంచవ్యాప్తంగా నిర్వ హించే అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవానికి మధ్య తేడా ఉంది. ప్రపంచ ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఏటా అక్టోబర్ 5న నిర్వహిస్తారు. యునెస్కో వివరాల ప్రకారం, 1994 నుండి ఈ దినోత్సవాన్ని జరుపు కుంటున్నారు. ఉపాధ్యాయుల స్థితిగతులకు సంబంధించి 1966లో ఐక్యరాజ్యసమితికి చెందిన ఐఎల్ఓ, యునెస్కో చేసిన చారిత్రక సిఫార్సు లను ఆమోదించిన జ్ఞాపకార్థం దీనిని నిర్వహిస్తున్నారు. ఈ సిఫార్సుల ద్వారా ఉపాధ్యాయుల హక్కులు, బాధ్యతలు, శిక్షణ, నియామకం, పని పరిస్థితులకు సంబంధిం చిన అంతర్జాతీయ ప్రమాణాలు ఏర్పడ్డాయి. విద్యార్థులు తమ ఉపాధ్యా యుల కోసం సాంస్కృతిక ప్రదర్శనలు, ఆటల పోటీలు ఏర్పాటు చేసి కృతజ్ఞ తలు తెలియజేస్తున్నారు. అనేక పాఠశాలల్లో సీనియర్ విద్యార్థులే స్వ యంగా ఉపాధ్యాయుల పాత్రను పోషించి జూనియర్ తరగతులకు బోధి స్తుండగా, ఉపాధ్యాయులు తమ రోజువారీ తరగతి గది బాధ్యతల నుండి కాసేపు విశ్రాంతి తీసుకుని ఈ సంబరాల్లో పాలుపంచుకుంటున్నారు.

భారతదే శంలో జరుపుకునే ఉపాధ్యాయ దినోత్సవానికి, ప్రపంచవ్యాప్తంగా నిర్వ హించే అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవానికి మధ్య తేడా ఉంది. ప్రపంచ ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఏటా అక్టోబర్ 5న నిర్వహిస్తారు. యునెస్కో వివరాల ప్రకారం, 1994 నుండి ఈ దినోత్సవాన్ని జరుపు కుంటున్నారు. ఉపాధ్యాయుల స్థితిగతులకు సంబంధించి 1966లో ఐక్యరాజ్యసమితికి చెందిన ఐఎల్ఓ, యునెస్కో చేసిన చారిత్రక సిఫార్సులను ఆమోదించిన జ్ఞాపకార్థం దీనిని నిర్వహిస్తున్నారు.



## ఇందిరా మహిళా శక్తి సోలార్ యూనిట్లకు భూమిపూజ

ప్రజానావ, ఉమ్మడి మహబూబ్ నగర్ బ్యూరో : మహిళా సంఘాలను ఆర్థికంగా బలోపేతం చేయడమే లక్ష్యంగా కొల్లాపూర్ మండలం అంకిరావుపల్లి, సింగోటం గ్రామాల్లో ఇందిరా మహిళా శక్తి ఆధ్వర్యంలో ఏర్పాటు చేయనున్న 800 కిలోవాట్ల 11 కేవీ సోలార్ యూనిట్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన జరిగింది. శనివారం మంత్రులు డాక్టర్ సీతక్క, జూపల్లి కృష్ణారావు, నాగర్‌కర్నూల్ ఎంపీ డాక్టర్ మల్లు రవి, జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్‌లతో కలిసి ఈ పనులకు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా మంత్రులు మాట్లాడుతూ.. సోలార్ యూనిట్ల ద్వారా మహిళా సంఘాలకు శాశ్వత ఆదాయ మార్గాలు సమకూరడంతో పాటు గ్రామీణ మహిళల ఆర్థిక సాధికారత సాధ్యమవుతుందని తెలిపారు. అంతకుముందు అంకిరావుపల్లి గ్రామంలో రూ.17.78 కోట్ల అంచనా వ్యయంతో నిర్మించనున్న హ్యామ్ రోడ్ల నిర్మాణ పనులకు కూడా మంత్రులు, ప్రజాప్రతినిధులు శంకుస్థాపన చేశారు.

# దత్తత పేరుతో రూ.1.40 లక్షల మోసం

- మగ శిశువును దత్తత ఇప్పిస్తామని నమ్మించి డబ్బులు తీసుకున్న ముఠా
- ఆరుగురి అరెస్ట్, మరికొందరు పరారీ

ప్రజానావ, భద్రాద్రి కొత్తగూడెం: సంతానం లేని మహిళకు మగ శిశువును దత్తత ఇప్పిస్తామని నమ్మించి రూ.1.40 లక్షలు తీసుకుని మోసం చేసిన కేసులో ఆరుగురిని టేకులపల్లి పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ వ్యవహారంతో సంబంధం ఉన్న మరికొందరు పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు. టేకులపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఇల్లందు డీఎస్పీ యు.వెంకన్నబాబు శనివారం విలేకరుల సమావేశంలో కేసు వివరాలు వెల్లడించారు. డీఎస్పీ కథనం ప్రకారం.. సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్ మండలం బీరంగూడకు చెందిన గౌరీగారి ప్రమీలకు వివాహమై ఎనిమిదేళ్లు గడిచినా సంతానం కలగలేదు. దీంతో చిన్నారిని దత్తత తీసుకోవాలనే ఉద్దేశంతో ఆమె సోషల్ మీడియాలో పోస్టు పెట్టారు. ఆ పోస్టును చూసిన ఖమ్మం ప్రాంతానికి చెందిన ఓ వ్యక్తి వాట్సాప్ ద్వారా ప్రమీలను సంప్రదించి, తనకు తెలిసిన వారి వద్ద మగ శిశువు ఉన్నాడని, రూ.4 లక్షలకు దత్తత ఇస్తారని నమ్మించాడు. అంత మొత్తం తన వద్ద లేదని ప్రమీల చెప్పడంతో చివరకు రూ.1.40 లక్షలకు ఒప్పందం కుదిరింది. అనంతరం ఆమె సోషల్ మీడియా పోస్టు విషయాన్ని లక్ష్మీ దేవిపల్లి మండలం లక్ష్మీ పురానికి చెందిన వేదలపల్లి రాంబాబుకు చెప్పి, శిశువును చూపించినట్లు పోలీసులు తెలిపారు. ప్రమీల నుంచి డబ్బులు తీసుకున్న తర్వాత అక్కడ గొడవ జరిగినట్లు నాటకం ఆడి పరారయ్యేలా రాంబాబు, సదరు వ్యక్తి పథకం రచించారు. ఇందులో రాంబాబు కుమారుడు రోహిత్, అతని స్నేహితులు తాటి నాగార్జున, ఈసం రాంబాబుతో పాటు చిన్నారి తల్లిదండ్రులు మడివి వెంకటేష్, శారదను భాగస్వాములను చేసినట్లు డీఎస్పీ తెలిపారు. పథకం ప్రకారం సెప్టెంబర్ 4న ప్రమీల చిన్నారిని దత్తత తీసుకునేందుకు టేకులపల్లి ఏ కాలనీ స్మశానవాటిక సమీపంలోని ప్రాంతానికి వచ్చింది. అక్కడ రాంబాబు ఆమెకు శిశువును చూపించి రూ.1.40 లక్షలు తీసుకున్నాడు. కొద్దిసే పటికే రాంబాబు కుమారుడు, అతని స్నేహితులు అక్కడికి చేరుకుని గొడవ పడుతున్నట్లు నటిస్తూ ప్రమీలతో పాటు ఆమె వెంట వచ్చిన మరో మహిళను భయభ్రాం తులకు గురిచేశారు. అనంతరం చిన్నారి తల్లిదండ్రు లను కారులో పంపించి, డబ్బులు తీసుకున్న వ్యక్తితో కలిసి నిందితులు అక్కడి నుంచి పరారయ్యారు. జరిగిన పరిణామంతో షాక్‌కు గురైన ప్రమీల తాను మోసపోయినట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టి శనివారం బొమ్మనపల్లి ఎక్స్‌రోడ్డు వద్ద పెట్రోలింగ్ చేస్తుండగా పోలీసులను చూసి పారిపోతున్న నిందితులను పట్టుకున్నారు. విచారణ లో వారు నేరాన్ని అంగీకరించినట్లు పోలీసులు తెలిపారు. వారి నుంచి రూ.1.40 లక్షల నగదు, రెండు ద్విచక్ర వాహనాలు, నాలుగు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. కేసును ఛేదించిన టేకులపల్లి సీఐ బి.సత్యనారాయణ, ఎస్ఐ కె.తిరు పతి, పోలీసు సిబ్బందిని డీఎస్పీ యు.వెంకన్నబాబు అభినందించారు.

# కోతుల గుంపు దాడి.. మహిళకు తీవ్ర గాయాలు

- తప్పించుకునే క్రమంలో అదుపుతప్పి కిందపడిన బాధితురాలు
- రుద్రంపూర్‌లో పెరుగుతున్న కోతుల బెడదతో ప్రజల్లో ఆందోళన



ప్రజానావ, భద్రాద్రి కొత్తగూడెం: ఇంటి పనులు చేసుకుంటున్న మహిళపై ఒక్కసారిగా కోతుల గుంపు దాడి చేయడంతో, వాటి నుంచి తప్పించుకునే క్రమంలో అదుపు తప్పి కిందపడిన ఘటనలో ఆమెకు తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన శనివారం సింగరేణి కొత్తగూడెం ఏరియాలోని రుద్రంపూర్ పంచాయతీ పరిధిలో చోటుచేసుకుంది. కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం.. రుద్రంపూర్ పంచాయతీ పరిధిలోని నాలా ఏరియాకు చెందిన కామ భవ్య ఇంట్లో పనులు చేసుకుంటుండగా ఒక్కసారిగా కోతుల గుంపు దాడి చేసింది. వాటి నుంచి తప్పించుకునేందుకు పరుగులు తీస్తుండగా అదుపుతప్పి కిందపడిపోయింది. ఈ ఘటనలో ఆమె తలకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే కుటుంబ సభ్యులు భవ్యను కొత్తగూడెంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. వరుస దాడులతో ఆందోళన: రుద్రంపూర్ పంచాయతీ పరిధిలో కొంతకాలంగా కోతుల బెడద తీవ్రంగా పెరిగిందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ వారంలోనే గోపిరియాకు చెందిన వృద్ధురాలు మాదాసు లక్ష్మి, నాలా ఏరియాకు చెందిన సునీతతో పాటు కొనిసెటి లింగయ్య అనే వృద్ధుడిపై కూడా కోతులు దాడి చేసినట్లు స్థానికులు తెలిపారు. గత కొన్ని రోజులుగా కోతుల భీభత్సంతో ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రావాలన్నా భయపడే పరిస్థితి నెలకొందని చెబుతున్నారు. ఏ కాలనీకి వెళ్లినా కోతుల భయంతో ఇంటి తలుపులు మూసుకుని ఉండాల్సిన పరిస్థితి ఏర్పడిందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### ఇతర ప్రాంతాల నుంచి తీసుకొచ్చి వదిలేస్తున్నారా?

సుమారు మూడేళ్ల క్రితం సింగరేణి అధికారులు కోతులను పట్టించినప్పటికీ ప్రస్తుతం మళ్లీ వాటి సంఖ్య భారీగా పెరిగిందని స్థానికులు పేర్కొంటున్నారు. ఇతర ప్రాంతాల నుంచి కోతులను తీసుకొచ్చి ఈ ప్రాంతంలో వదిలివేస్తున్నారనే అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. దీంతో పంచాయతీ పరిధిలో మనుషులతో సమానంగా కోతులు కనిపిస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గతంలో నిర్వహించిన గ్రామసభల్లోనూ కోతుల బెడద, వాటి వల్ల ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను అధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు గ్రామస్తులు తెలిపారు. అయినప్పటికీ సమస్యకు శాశ్వత పరిష్కారం లభించలేదని వాపోతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి కోతులను పట్టుకునేందుకు అవసరమైన నిధులు మంజూరు చేసి, వాటి బెడద నుంచి ప్రజలకు రక్షణ కల్పించాలని రుద్రంపూర్ పంచాయతీ ప్రజలు కోరుతున్నారు.



## అంబులెన్స్‌లోనే ప్రసవం

- మగబిడ్డకు జన్మనిచ్చిన తల్లి

ప్రజానావ, ఉమ్మడి మహబూబ్ నగర్ బ్యూరో : 108 సిబ్బంది చూపిన సమయస్ఫూర్తి ఓ తల్లి, బిడ్డ ప్రాణాలను కాపాడింది. ఏదుల మండలం గుండావాళ్ళ నాయక్ తండాకు చెందిన జయలక్ష్మికి నొప్పులు రావడంతో కుటుంబీకులు 108కి సమాచారం ఇచ్చారు. ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో నొప్పులు ఎక్కువ కావడంతో ఈఎంటీ వీరేష్, ఆశా వర్కర్ సాయంతో అంబులెన్స్‌లోనే ప్రసవం నిర్వహించారు. జయలక్ష్మి మగ బిడ్డకు జన్మనివ్వగా, అనంతరం వారిని ఎంసీహెచ్‌కి తరలించారు. సమయానికి స్పందించిన ఈఎంటీ వీరేష్, పైలట్ కిరణ్ చారిలను స్థానికులు, కుటుంబ సభ్యులు ప్రశంసించారు.

## లోక్ అదాలత్‌తో సమయం, డబ్బు ఆదా: ఎస్పీ డి. జానకి



ప్రజానావ, ఉమ్మడి మహబూబ్ నగర్ బ్యూరో : కోర్టుల చుట్టూ ఏళ్ల తరబడి తిరుగుతూ సమయం, డబ్బు వృథా చేసుకోవద్దని, సెప్టెంబర్ 12న నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని మహబూబ్‌నగర్ జిల్లా ఎస్పీ డి. జానకి పిలుపునిచ్చారు. శనివారం జిల్లా పోలీసు కార్యాలయంలో కోర్టు లైజన్, డ్యూటీ అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆమె మాట్లాడారు. కక్షిదా రులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రాజీ మార్గంలో కేసులు పరిష్కరిం చుకునేలా సరైన కౌన్సిలింగ్ ఇవ్వాలని ఎస్పీ సూచించారు. లోక్ అదాలత్ ద్వారా గరిష్ట సంఖ్యలో కేసులు పరిష్కారమయ్యేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని, సమన్లు, వారెంట్ల అమలును వేగవంతం చేయాలని ఆదేశించారు.

# ఉత్తమ ఎంఈఓగా నకిరేకంటి రవి

- ఉపాధ్యాయ దినోత్సవ వేడుకల్లో జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా అవార్డు అందజేత
- పెన్‌పహాడ్‌కు చెందిన మరో నలుగురు ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపిక

ప్రజానావ, సూర్యాపేట: సూర్యాపేట జిల్లా ఉత్తమ ఎంఈఓగా పెన్‌పహాడ్‌కు చెందిన నకిరేకంటి రవి ఎంపికయ్యారు. ప్రస్తుతం పెన్‌పహాడ్ ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తూ మండల పూర్తిస్థాయి బాధ్యతలను నిర్వర్తిస్తున్న ఆయనకు ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా జిల్లా ఉత్తమ ఎంఈఓ అవార్డు లభించింది. శనివారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన జిల్లాస్థాయి ఉపాధ్యాయ దినోత్సవ వేడుకల్లో జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్, డీఈఓ అశోక్‌కుమార్ చేతుల మీదుగా నకిరేకంటి రవి అవార్డును అందుకున్నారు. ఇదే సందర్భంగా పెన్‌పహాడ్ మండలానికి చెందిన కందిబండ రాజేశ్వరి (జడ్పీహెచ్ఎస్ అనంతారం), సందా సైదిరెడ్డి (ప్రాథమిక పాఠశాల, పెద్ద సీతారాం తండా), వనమా లక్ష్మీ (కేజీబీవీ, పెన్‌పహాడ్) జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికై అవార్డులు అందుకున్నారు. అవార్డులు అందుకున్న నకిరేకంటి రవి, కందిబండ రాజేశ్వరి, సందా సైదిరెడ్డి, వనమా లక్ష్మీ లను పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు తంగేళ్ల జితేందర్‌రెడ్డి, సీహెచ్ఎం కొండ మల్లారెడ్డి, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు ఎరంశెట్టి రవీందర్‌బాబు, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షురాలు ప్రమీల, పీఆర్‌టీయూ టీఎస్ జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు అల్లాడి సత్యనారాయణ, మండల శాఖ అధ్యక్షుడు నల్ల శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శి సంధ్యాల వినోద్, వివిధ సంఘాల బాధ్యులు ఉమర్ షేక్, జి.ఆనంద్ భాస్కర్, జాటోత్ దశరథ్, చందా సైదిబాబు, సీనియర్ నాయకులు వి.సుదర్శన్, ఆసియా జాబీన్, ఉపాధ్యాయులు వై.ఉపేందర్, ఎన్.లక్ష్మయ్య, ఉగ్గం నాగరాజు, ఎం.స్నేహలత, కేజీబీవీ ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు.

# రైతులకు పండుగ లేదు.. ఎండుగే

- కాంగ్రెస్ పాలనపై మిర్యాలగూడ రైతు ఆగ్రహం
- యూరియా కోసం ఇబ్బందులు, కరెంట్ కోతలు
- రైతు బంధుపైనా అసంతృప్తి



ప్రజానావ, నల్లగొండ: కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రైతుల పరిస్థితి దయనీయంగా మారిందని మిర్యాలగూడకు చెందిన ఓ రైతు ఆవేదన వ్యక్తం చేశారు. మీడియాతో మాట్లాడుతూ.. యూరియా కోసం రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, యాప్‌లో నమోదు చేసుకుని కొనుగోలు చేయాలని చెబుతున్నప్పటికీ ఆ విధానం అందరికీ అందుబాటులో లేదని అన్నారు. యాప్‌లో నమోదు చేసుకుని కొనుగోలు చేసిన రైతులకు సైతం కొన్ని సందర్భాల్లో యూరియా అందడం లేదని ఆరోపించారు. విద్యుత్ కోతలతోనూ రైతులు ఇబ్బందులు పడుతున్నారని, రైతు బంధు పరిస్థితి కూడా గతంలో మాదిరిగా లేదని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలన పూర్తయిందంటూ ఆ పార్టీ నేతలు సంబరాలు చేసుకుంటున్నారని, వారికి మాత్రమే అది పండుగ అని.. రైతులకు మాత్రం పండుగ లేదని, కష్టాలే మిగిలాయని మండిపడ్డారు. రేవంత్ రెడ్డి రైతు బిడ్డనని చెప్పుకుంటున్నారని, రైతులకు నీరు, విద్యుత్‌తో పాటు అవసరమైన సౌకర్యాలు కల్పిస్తే తాము ఎందుకు వ్యతిరేకిస్తామని ప్రశ్నించారు. రైతులకు మంచి చేస్తే తాము స్వాగతిస్తామని అన్నారు. ‘మళ్లీ గెలుస్తా’ అంటూ నేతలు ఎన్ని మాటలు చెప్పినా ప్రజలు వాటిని నమ్మే పరిస్థితి లేదని వ్యాఖ్యానించారు. కేసీఆర్ హయాంలో అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు జరిగినప్పటికీ ఆయనకూ ఓటమి తప్పలేదని గుర్తుచేశారు. మార్పు వస్తుందనే ఆశతో కాంగ్రెస్‌కు ఓటు వేసిన ప్రజలకు ప్రస్తుతం నిరాశే మిగిలిందని అన్నారు. రాష్ట్ర రైతుల సమస్యలపై ప్రభుత్వం దృష్టి సారించాల్సిన అవసరం ఉందని, ముఖ్యంగా సాగునీరు, విద్యుత్, ఎరువుల లభ్యత వంటి అంశాల్లో రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలని కోరారు.

## నాణ్యమైన విత్తనాలతో మేలు

ప్రజానావ భద్రాద్రి కొత్తగూడెం: రైతు స్థాయిలోనే విత్తనోత్పత్తి చేపట్టడం ద్వారా స్థానిక రైతులకు నాణ్యమైన విత్తనాలు అందుబాటులోకి వస్తాయని కృషి విజ్ఞాన కేంద్రం జిల్లా ప్రోగ్రాం కో–ఆర్డినేటర్ డాక్టర్ టి.భరత్ అన్నారు. జూలూరుపాడు మండలం పాపకొల్లు, కొత్తూరు గ్రామాల్లో ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం, నాబార్డ్, పీఏసీఎస్ సంయుక్త ఆధ్వర్యంలో సాగు చేస్తున్న వరి ఫౌండేషన్ సీడ్ క్షేత్రాలను శనివారం పీఏసీఎస్ చైర్మన్ కొమ్మినేని పాండురంగా రావుతో కలిసి ఆయన పరిశీలించారు. పంట ఎదు గుదల, క్షేత్ర పరిస్థితులను పరిశీలించి రైతులకు విత్తనోత్పత్తిలో పాటించాల్సిన మెళకువలను వివరిం చారు. కల్తీలేని నాణ్యమైన ఫౌండేషన్ విత్తనాన్ని ఉత్పత్తి చేసి నాణ్యతా ప్రమాణాలను పాటించాలని సూచించారు. కార్యక్రమంలో సొసైటీ సీఈఓ లంకా నరసింహారావు, సిబ్బంది సాయి నిరంజన్, వ్యవసా య విస్తరణ అధికారులు విజయభాను, గోపీకృష్ణ, రైతులు పాల్గొన్నారు.

## అసభ్య వీడియోపై బాధితుల బంధువుల ధర్నా

ప్రజానావ, యాదాద్రి భువనగిరి: సోషల్ మీడియాలో మహిళను కించపరిచేలా అసభ్యకర వీడియో పోస్ట్ చేశారన్న ఆరోపణలపై రేవనపల్లికి చెందిన ఏనుగు జైపాల్‌రెడ్డిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ బాధితురాలి బంధువులు శనివారం భూదాన్ పోచంపల్లి పోలీస్‌స్టేషన్ ఎదుట ధర్నా నిర్వహించారు. రేవనపల్లికి చెందిన ఏనుగు జైపాల్‌రెడ్డి, ఆయన తండ్రి ఏనుగు స్వామిరెడ్డి కలిసి ఓ యూట్యూబ్ ఛానల్‌లో మహిళలను అసభ్యకరంగా, కించపరిచే విధంగా మాట్లాడి ఇంటర్వ్యూ చేశారని బాధితుల బంధువులు ఆరోపించారు. దీనిపై వారిని ప్రశ్నించేందుకు వెళ్లిన తమపై తాము దాడి చేసేందుకు వచ్చారంటూ జైపాల్‌రెడ్డి పోలీసులకు తప్పుడు ఫిర్యాదు చేశారని గుల్లం శేఖర్ ఆరోపించారు. తమ సమస్యపై నాలుగు రోజుల క్రితమే పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినప్పటికీ పోలీసులు పట్టించుకోవడం లేదని బాధితుల బంధువులు ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామంలోనే కూర్చొని ఇరువర్గాలు మాట్లాడుకోవాలని ఎస్ఐ జగన్ సూచిస్తూ కాలయాపన చేస్తున్నారని ఆరోపించారు. తాము ఉన్నత కులానికి చెందిన వారిపై దాడి చేశారంటూ ఫిర్యాదు చేయగానే తమకు చెందిన 11 మందిపై కేసు నమోదు చేశారని, తాము ఇచ్చిన ఫిర్యాదుపై మాత్రం కేసు ఎందుకు నమోదు చేయడం లేదని ప్రశ్నించారు.

# విద్యార్థుల సమస్యలపై బీఆర్ఎస్వీ ఆందోళన

- జీవో 97ను రద్దు చేయాలి
- ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలి
- ఉద్యోగ ఖాళీలన్నీ భర్తీ చేయాలని డిమాండ్



ప్రజానావ, భద్రాద్రి కొత్తగూడెం: విద్యార్థులు, నిరుద్యోగుల సమస్యలను కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆరోపిస్తూ బీఆర్ఎస్ రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన నిరసనల్లో భాగంగా శనివారం భద్రాచలంలో బీఆర్ఎస్వీ ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహించారు. పట్టణంలోని అంబేద్కర్ సెంటర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో బీఆర్ఎస్ విద్యార్థి విభాగం నాయకులు, విద్యార్థులు, యువజన కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్వీ నాయకులు మాట్లాడుతూ ఎన్నికల సమయంలో విద్యార్థులు, నిరుద్యోగ యువతకు కాంగ్రెస్ ఇచ్చిన హామీలను అధికారంలోకి వచ్చిన తర్వాత విస్మరించిందని విమర్శించారు. విద్యార్థుల ప్రయోజనాలకు విఘాతం కలిగించే జీవో నంబర్ 97ను వెంటనే బేషరతుగా రద్దు చేయాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయిం బర్స్‌మెంట్ బకాయిలను తక్షణమే విడుదల చేసి, కళాశాలల యాజమాన్యాలు విద్యార్థులను ఇబ్బంది లకు గురిచేయకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవా లని కోరారు. నిరుద్యోగ యువతకు ఇచ్చిన హామీ మేరకు సమగ్ర జాబ్ క్యాలెండర్‌ను ప్రకటించి, ఖాళీగా ఉన్న అన్ని ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేయా లని డిమాండ్ చేశారు. సంక్షేమ వసతి గృహాల్లో మౌలిక వసతులను మెరుగుపరచడంతో పాటు విద్యా ర్థులు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరిం చాలని కోరారు. విద్యార్థుల భవిష్యత్తుతో ప్రభుత్వం చెలగాటమాడితే చూస్తూ ఊరుకునేది లేదని హెచ్చరించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకు లు యువరాజుతో పాటు బీఆర్ఎస్వీ కార్యకర్తలు, విద్యార్థులు, యువజన నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## సిరిసిల్ల జిల్లాలో ఉత్తమ ఉపాధ్యాయులు

- **అవార్డులు పొందిన టీచర్ల జాబితా**

**ప్రజానావ, సిరిసిల్ల :** రాజన్న సిరిసిల్ల జిల్లాలో ఉత్తమ ఉపాధ్యాయులుగా అవార్డులు పొందిన హెచ్ఎంలు, పీడీ, పీఈటీలు, స్కూల్ అసిస్టెంట్లు, ఎస్జీటీలు, కేజీబీవీ ఎస్ఓ, సీఆర్టీ, పీజీ సీఆర్టీలు, ఐఈ ఆర్పీలు పొందిన వారిలో చిట్నేని శ్రీకాంత్ రావు, టీ మనోహరాచారి, ఆడెపు రాజేశం, అజ్మీరా మదన్ లాల్, గుర్రం సందీప్, నర్ర శ్రీనివాసరెడ్డి, టీ మధుకర్ రెడ్డి, గంప లక్ష్మీ నారాయణ, ఎం లక్ష్మయ్య, మోహమ్మద్ రహీం, సీహెచ్ రమాదేవి, ఎం కోటేశ్వర్, కొప్పు రాములు, వెంగల మహేష్, మాదాడి వెంకటరావు, కుమ్మరి మల్లేశం, సీహెచ్ మాధవి లత, ఎన్ కనకయ్య, ఈ శ్రీనివాస్, కపిల్ల నరేష్, రామగిరి స్వరాజ్యలక్ష్మి, కొత్తపల్లి మమత, యాస శ్రీలత, డీ రఘు, ఎం సుజాత, బోనగిరి రాజేందర్, ఊతం విజయకుమార్, దరిపెల్లి రాజేశం, బొల్లి రమేష్, అణువోజు రాజు, తెల్ల వకుల, మేకల పద్మ, మామిళ్ల విఠల్, కే జయలక్ష్మి, ఆర్ వసంత, బి సుధారాణి, టి గీత అవార్డులు పొందారు.

## 35 ఏళ్ల పోలీసు సేవలకు ఆత్మీయ వీడ్కోలు

- **ఉద్యోగ విరమణ పొందిన ఇద్దరు హోంగార్డులను ఘనంగా సత్కరించిన రామగుండం సీపీ అంబర్ కిషోర్ ఝా**



**ప్రజానావ, పెద్దపల్లి:** పోలీసు శాఖలో 35 ఏళ్లపాటు హోంగార్డులుగా సేవలందించి ఉద్యోగ విరమణ పొందుతున్న జె. రామయ్య (హోంగార్డు నంబర్ 256), మంచిర్యాల జిల్లా పరిధి, పి. సత్తయ్య (హోంగార్డు నంబర్ 249), గోదావరిఖని, పెద్దపల్లి జిల్లా పరిధి సేవలను గుర్తు చేసుకుంటూ రామగుండం పోలీస్ కమిషనర్ కార్యాలయంలో ఆత్మీయ వీడ్కోలు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ఇద్దరు హోంగార్డులకు పూలమాలలు వేసి, శాలువాలతో ఘనంగా సత్కరించారు. పోలీసు శాఖలో సుదీర్ఘకాలం నిబద్ధతతో సేవలందించినందుకు అభినందనలు తెలిపారు. ఉద్యోగ విరమణ అనంతరం వారి జీవితం ఆరోగ్యంగా, ఆనందంగా, సుఖసంతోషాలతో సాగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో అదనపు డీసీపీ (అడ్మిన్) కె. శ్రీనివాస్, ఏఆర్ ఏసీపీ ప్రతాప్, హోంగార్డ్స్ ఆర్ఐ పెద్దన్న, పోలీస్ అధికారుల సంఘం అధ్యక్షుడు వి. నవీన్ కుమార్, ఉపాధ్యక్షుడు ఎన్. శ్రీనివాస్, ఇన్స్పెక్టర్ ఎం. తిరుపతి, ప్రధాన కార్యదర్శి జె. అంజనేయులు, సంయుక్త కార్యదర్శి కె. ఓంకార్, సంఘం సభ్యులు, హోంగార్డ్స్ ఇన్‌చార్జీలు తదితరులు పాల్గొని ఉద్యోగ విరమణ పొందుతున్న హోంగార్డులకు శుభాకాంక్షలు తెలిపారు.

## శ్రీలక్ష్మీ నరసింహస్వామి క్షేత్రం.. రథశాలకు శంకుస్థాపన

- **పాల్గొన్న ప్రజా ప్రతినిధులు, నాయకులు**



**ప్రజానావ, సిరిసిల్ల :** రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్ళపల్లి మండల కేంద్రంలో శ్రీ స్వయంభూలక్ష్మి నరసింహ స్వామి దివ్య క్షేత్రం ప్రాంగణంలో శనివారం రథశాల కు శంకుస్థాపన జరిగింది. ఈ మహోత్సవంలో నాఫ్స్ క్యాబ్ చైర్మన్ కొండూరి రవీందర్ రావు, మున్సిపల్ చైర్ పర్సన్ జిందం కళ, బీఅర్ఎస్ సిరిసిల్ల పట్టణ అధ్యక్షులు జిందం చక్రపాణి, బీఅర్ఎస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి గూడూరి ప్రవీణ్, జిల్లా అధ్యక్షులు తోట ఆగయ్య, ఉమ్మడి కరీంనగర్ జిల్లా మాజీ జడ్పీ చైర్మన్ తుల ఉమా, సిరిసిల్ల శాఖ అధ్యక్షులు జిందం చక్రపాణి, తంగళ్ళపల్లి మండల అధ్యక్షులు గజభీంకార్ రాజన్న తదితరులు పాల్గొని ఈ సందర్భంగా శ్రీ లక్ష్మి నరసింహస్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజ కార్యక్రమాలను నిర్వహించారు.

## విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకం

- **తల్లిదండ్రులు జన్మనిస్తే.. ఉపాధ్యాయులు జీవితానికి దిశానిర్దేశం చేస్తారు**
- **జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే**




**ప్రజానావ, సిరిసిల్ల :** విద్యార్థుల భవిష్యత్తుకు బలమైన పునాది వేస్తూ, వారి లక్ష్య సాధనకు మార్గనిర్దేశం చేసి, ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమని జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే తెలిపారు. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా శనివారం ఎల్లారెడ్డిపేట్ పోలీస్ స్టేషన్ పరిధిలోని దుమాల ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్ సందర్శించి, విద్యార్థుల విద్యాభ్యాసం, వారు సాధించాలనుకుంటున్న లక్ష్యాలు, భవిష్యత్ ప్రణాళికల గురించి అడిగి తెలుసుకున్నారు. తాను ఈరోజు రాజన్న సిరిసిల్ల జిల్లా ఎస్పీగా ఈ స్థాయిలో ఉన్నానంటే, నాకు విద్యాబుద్ధులు నేర్పి, మంచి మార్గాన్ని చూపించిన నా గురువుల పాత్ర ఎంతో ఉందని ఎస్పీ తన గురువులను ఈ సందర్భంగా ఆత్మీయంగా గుర్తు చేసుకున్నారు. విద్యార్థుల అభివృద్ధి కోసం ఉపాధ్యాయులు చేస్తున్న కృషిని, సేవలను కొనుయాడుతూ ఉపాధ్యాయ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపి వారిని ఘనంగా సన్మానించారు. ఎస్పీ వెంట డిఎస్పీ నాగేంద్రచారి, సిఐ వెంకటేష్, ఎస్ఐ లు, పాఠశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# పత్తి సాగు పెరిగినా.. వర్షాభావంతో దిగుబడిపై దిగులు

- **1.38 లక్షల ఎకరాల్లో సాగు**
- **పూత, కాత దశలో నీటి ఎద్దడి**
- **40–50 శాతం వర్షపాత లోటుతో రైతుల్లో ఆందోళన**



**ప్రజానావ: వరంగల్ :** జిల్లాలో ఈ వానాకాలం పత్తి సాగు గణనీయంగా పెరిగింది. గత ఐదేళ్లలో ఎన్నడూ లేనివిధంగా పత్తి సాగు విస్తీర్ణం అంచనాలకు చేరువైంది. గత పదేళ్లుగా వరి సాగు విస్తీర్ణం క్రమంగా పెరుగుతూ వస్తున్నప్పటికీ, ఈ ఏడాది ఎల్‌నినో ప్రభావంతో వర్షపాత లోటు ఏర్పడటంతో పరిస్థితులు మారిపోయాయి. ఆరుతడి, ప్రత్యామ్నాయ పంటల వైపు రైతులు మొగ్గు చూపాలని జిల్లా యంత్రాంగం సూచించడంతో పాటు సరైన సమయంలో వర్షాలు కురవకపోవడంతో వరి సాగు తగ్గి పత్తి సాగు పెరిగింది. సాధారణంగా పత్తి సాగు చేసే రైతులతో పాటు విధిలేని పరిస్థితుల్లో పలువురు రైతులు సైతం పత్తి వైపు మళ్లారు. దీంతో జిల్లాలో పత్తి సాగు 1.38 లక్షల ఎకరాలకు చేరింది. అయితే సాగు విస్తీర్ణం ఆశాజనకంగా పెరిగినప్పటికీ, సకాలంలో ఓ మోస్తరు వర్షాలు కూడా లేకపోవడంతో పత్తి చేలు ఎండుముఖం పట్టాయి. జిల్లాలో వానాకా లం సీజన్‌లో ప్రధానంగా వరి, పత్తి, మొక్క జొన్న, కంది, పామాయిల్ పంటలను సాగు చేస్తుంటారు. ఈ ఏడాది ఎల్‌నినో ప్రభావంతో 40–50 శాతం వరకు వర్షపాత లోటు ఏర్పడ టంతో బోర్లు, బావులు అడుగంటి పోయాయి. దీంతో వరి, మొక్కజొన్న వంటి నీటి అవసరం అధికంగా ఉండే పంటల సాగు రైతులకు భారంగా మారింది. సాధారణంగా జిల్లా వ్యా ప్తంగా 2.10 లక్షల ఎకరాల్లో వరి సాగు కావా ల్సి ఉండగా.. వర్షాభావ పరిస్థితుల కారణంగా 1.50 లక్షల ఎకరాలకే పరిమితమైంది. రెండో ప్రధాన పంటగా ఉండే పత్తిని ఈ ఏడాది 1.40 లక్షల ఎకరాల్లో సాగు చేయాలని అంచనా వేయగా.. దాదాపు లక్ష్యానికి చేరువగా 1.38 లక్షల ఎకరాల్లో సాగు చేశారు. అయితే ప్రస్తు తం పత్తి పంట పూత, కాత దశకు చేరుకున్న సమయంలో నీటి ఎద్దడి తీవ్ర ప్రభావం చూపుతోంది. నల్లరేగడి నేలల్లో కొంతమేర పంట పరిస్థితి మెరుగ్గా ఉన్నప్పటికీ ఎర్ర, దుబ్బ, ఇసుక నేలల్లో పత్తి మొక్కలు ఆశించిన స్థాయిలో ఎదగ కుండా ఎండుముఖం పట్టాయి. సాధారణంగా జూన్, జులై నెలల్లో విత్తనాలు వేసిన పత్తి పంట ఆగస్టు, సెప్టెంబరు నాటికి పూర్తిస్థాయిలో ఎదిగి పూత, కాత దశలోకి రావాల్సి ఉంటుంది. కానీ ఈ ఏడాది వర్షాభావంతో పంట ఎదుగుదల మందగించింది. ప్రస్తుతం ఎండలు తీవ్రంగా ఉండటంతో పూత రాలిపోతున్న పరిస్థితి నెలకొంది. దీంతో పత్తి దిగుబడి తగ్గే అవకాశం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. కనీసం ఇప్పటికైనా మోస్తరు వర్షాలు కురిస్తే పంటకు కొంత ఉపశమనం లభించి దిగుబడి మెరుగుపడే అవకాశం ఉంటుందని రైతులు ఆశగా ఎదురుచూస్తున్నారు.



## కాంగ్రెస్ వెయ్యి రోజుల పాలన అట్టర్ ప్లాప్

- **బీఆర్ఎస్ నేత రాథోడ్ జనార్దన్**

**ప్రజానావ, ఆదిలాబాద్:** కాంగ్రెస్ ప్రభుత్వ వెయ్యి రోజుల పాలన అట్టర్ ప్లాప్‌గా మారిందని, ప్రజా సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించిందని ఆదిలాబాద్ జిల్లా జడ్పీ మాజీ చైర్మన్ రాథోడ్ జనార్దన్ విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను నిరసిస్తూ శనివారం నార్నూర్ మండల కేంద్రంలోని గాంధీ చౌరస్తా రహదారిపై నిర్వహించిన నిరసన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన హామీలను అధికారంలోకి వచ్చిన తర్వాత విస్మరించిందని ఆరోపించారు. ఇచ్చిన హామీల్లో ఏ ఒక్కదానినీ పూర్తిస్థాయిలో అమలు చేసిన దాఖలాలు లేవని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వ పాలనపై ప్రజలు తీవ్ర అసంతృప్తితో ఉన్నారని అన్నారు. ప్రజా సమస్యలపై బీఆర్ఎస్ పార్టీ నిరంతరం పోరాటం చేస్తూనే ఉంటుందని రాథోడ్ జనార్దన్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఇంద్రవెల్లి మార్కెట్ మాజీ చైర్మన్ శ్రీరామ్ జాదవ్, నార్నూర్ సహకార సంఘం చైర్మన్ ఆడే సురేష్, మండల అధ్యక్షుడు మేస్రం హన్మంత్‌రావు, సర్పంచుల సంఘం మాజీ మండల అధ్యక్షుడు, సీనియర్ నాయకుడు ఉర్వేత రూప్‌దేవ్, మండల ప్రధాన కార్యదర్శి సయ్యద్ ఖాసిం, పట్టణ ఉపాధ్యక్షుడు రాథోడ్ శివాజీ, ఎస్టీ సెల్ మండల అధ్యక్షుడు రాథోడ్ సుభాష్, మైనార్టీ సెల్ అధ్యక్షుడు సుల్తాన్ ఖాన్, మాజీ ఎంపీటీసీ రాథోడ్ రమేష్, మాజీ సర్పంచ్ మడావి సాగర్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులను అన్ని రంగాల్లో తీర్చిదిద్దాలి

- **సామాజిక విలువలు, క్రమశిక్షణ అంశాలు బోధించాలి**
- **ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్**
- **జాతీయ ఉపాధ్యాయ దినోత్సవంలో ఉత్తమ ఉపాధ్యాయులకు ఘనంగా సన్మానించిన ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్**




**ప్రజానావ, సిరిసిల్ల :** విద్యార్థులను అన్ని రంగాల్లో తీర్చిదిద్దాలని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ పిలుపు నిచ్చారు. జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా జిల్లాలోని 37 మంది ఉత్తమ ఉపాధ్యాయుల సన్మాన కార్యక్రమాన్ని జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో శనివారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానించడంతో మిగతా వారికి మార్గదర్శకంగా ఉంటుందని తెలిపారు. తల్లిదండ్రుల తరువాత విద్యార్థులపై ప్రభావం చూపేది ఉపాధ్యాయులేనని స్పష్టం చేశారు. సర్వేపల్లి రాధాకృష్ణన్, అబ్దుల్ కలాం, మహాత్మా జ్యోతి రావు పూలే దంపతుల బోధనలు స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న వారికి మంచి అవకాశాలు ఉన్నాయని తెలిపారు. టీచర్లు విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని, ప్రతి విద్యార్థి మనో వికాసం, సమాజ విలువలు, కట్టుబాట్లు, క్రమశిక్షణ అంశాలపై బోధించాలని సూచించారు.

### విద్యకు అధిక ప్రాధాన్యం

రాష్ట్ర ప్రభుత్వం, సీఎం రేవంత్ రెడ్డి విద్యకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నారని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ తెలిపారు. ఇప్పటికే 11 వేల టీచర్ ఉద్యోగాలు భర్తీ చేశారని వెల్లడించారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి విద్యను అందించేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. ఇప్పటికే తెలంగాణ పబ్లిక్ స్కూల్ ప్రారంభించిందని, జిల్లాలో రెండు స్కూళ్లు రానున్నాయని వెల్లడించారు. యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ నిర్మాణ పనులు ప్రారంభించామని వివరించారు. విద్యలో విప్లవాత్మకమైన మార్పులకు శ్రీకారం చుట్టిందని గుర్తు చేశారు. ఐటీఐలను అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్లుగా తీర్చిదిద్దుతున్నామని తెలిపారు. ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘాల సమస్యలను ప్రభుత్వం పరిష్కరిస్తుందని పేర్కొన్నారు. విద్యార్థులకు టీచర్లు రోల్ మోడల్ అని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ పేర్కొన్నారు. తాను టీచర్స్ డే రోజు జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. తాను ఆరో తరగతిలో పద్యం, స్పీచ్ ఇవ్వడం మరిచిపోలేని అనుభూతి అని గుర్తు చేశారు. అప్పటి తమ మధ్య ప్రదేశ్ రాష్ట్రంలోని ఖర్గోన్ జిల్లా కలెక్టర్ ను కలిసి ఆమె మాటలతో స్ఫూర్తి పొందానని వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నాగుల సత్యనారాయణ గౌడ్, సిరిసిల్ల మున్సిపల్ చైర్ పర్సన్ జిందం కళ, జిల్లా విద్యాధికారి మొండయ్య, కోనరావుపేట మార్కెట్ కమిటీ చైర్మన్ ఎల్లయ్య, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పథకాలు ప్రజల్లోకి తీసుకెళ్లాలి

- **డీసీసీ అధ్యక్షుడు సంగీతం శ్రీనివాస్**
- **గంభీరావుపేటలో పార్టీ కార్యాలయం ప్రారంభోత్సవం**



**ప్రజానావ, గంభీరావుపేట:** ప్రభుత్వం అమలు చేస్తున్న పలు సంక్షేమ పథకాలు పార్టీ నాయకులు కార్యకర్తలు ప్రజల్లోకి తీసుకెళ్లాలని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు సంగీతం శ్రీనివాస్ పిలుపునిచ్చారు. శనివారము గంభీరావుపేట మండల కేంద్రంలో మాజీ ఎమ్మెల్యే, పీసీసీ సీనియర్ అధికార ప్రతినిధి కటకం మృత్యుంజయం, రాష్ట్ర పిసిసి అధికార ప్రతినిధి చీటీ ఉమేష్ రావులతో కలిసి కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వెయ్యి రోజుల ప్రభుత్వ పాలనలో ఇచ్చిన హామీలతో పాటు, చెప్పని పథకాలు ప్రజలకు అందించిందని అన్నారు. పదేళ్ల బిఆర్ఎస్ పాలనలో రాష్ట్రాన్ని అధోగతి పాలు చేసిందని ఆరోపించారు. దళితులకు మూడు ఎకరాల భూమి, ఇంటికో ఉద్యోగం, దళిత బంధు లాంటి ఎన్నో రకాల హామీలు ఇచ్చి బిఆర్ఎస్ పార్టీ ప్రజలను మోసం చేసిందన్నారు. కాలేశ్వరం పేరిట బిఆర్ఎస్ నాయకులు వేలకోట్ల రూపాయలు దండుకున్నారని విమర్శించారు. కూలిపోయిన ఇంటికి గృహప్రవేశం చేసినట్లుగా లోటు బడ్జెట్ ఉన్న ప్రభుత్వాన్ని ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలు నెరవేరుస్తూ అత్యంత చాకచక్యంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పరిపాలన కొనసాగిస్తున్నారని అన్నారు. ప్రజలకు ఇచ్చిన గ్యారంటీలను ప్రభుత్వం అమలు చేసి తీరుతుంది అన్నారు. బిఆర్ఎస్ నాయకులు ఎంత రోడ్డెక్కి నిరసనలు తెలిపిన ప్రజలు కాంగ్రెస్ పక్షాన్ని ఉన్నారని మరో ఐదేళ్లు రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వమే అధికారంలో ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నిమ్మల తిరుపతి గౌడ్, నాయకు లు కటకం శ్రీధర్, బంగ్లా రాజు గౌడ్, గాండ్ల బాలలక్ష్మి, మల్యాల రాజ్వీర్, అక్కపల్లి లత, ఎర్ర నరసయ్య గోపగారి లక్ష్మి నారాయణ గౌడ్, బాలయ్య, యువజన నాయకులు గుర్రం రాజు గౌడ్, దేశెట్టి రాజశేఖర్, బాలకృష్ణ, టేకుమల్ల ప్రవీణ్, గౌరీ శంకర్, తాహిర్, శంకర్, దమ్మగారి శ్రీనివాస్ రెడ్డి, అంజిరెడ్డి, ఎడబోయిన ప్రభాకర్, పిట్ల వెంకటి, తోపాటు మండల స్థాయి కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## రైల్వే కాంట్రాక్టు కార్మికులకు అన్నగా అండగా ఉంటా

- **కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా**
- **రామగుండం ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్**



**ప్రజానావ, పెద్దపల్లి:** రైల్వే కాంట్రాక్టు కార్మికుల సమస్యల పరిష్కారానికి తనవంతు సహకారం అందిస్తూ వారికి అన్నగా అండగా ఉంటానని రామగుండం ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్ అన్నారు. సౌత్ సెంట్రల్ రైల్వే మల్టీపుల్ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో 100 మందికి పైగా కాంట్రాక్టు కార్మికులు బైక్ ర్యాలీగా ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి చేరుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పూల బొకే అందజేసి శాలువాతో ఘనంగా సన్మానించారు. యూనియన్ అధ్యక్షుడు, మాజీ కార్పొరేటర్ కన్నూరి సతీష్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో కాంట్రాక్టు కార్మికులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కన్నూరి సతీష్ కుమార్ మాట్లాడుతూ రామగుండంలో ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్ 1000 రోజుల పాలనను పూర్తిచేసుకున్న సందర్భంగా శుభాకాంక్షలు తెలిపేందుకు కార్మికులు తరలివచ్చారని అన్నారు. ప్రజలకు అవసరమైన అన్ని మౌలిక వసతులు కల్పిస్తూ, నియోజకవర్గ అభివృద్ధిని చిత్తశుద్ధితో ముందుకు తీసుకెళ్తున్నారని కొనియాడారు. అన్ని వర్గాల ప్రజల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తున్న ప్రజాబంధు, రామగుండం రక్షకుడిగా ఎమ్మెల్యేకు ప్రజల్లో మంచి గుర్తింపు ఉందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేను శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. రైల్వే కాంట్రాక్టు కార్మికుల సంక్షేమానికి, వారి సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ తన సహకారం ఉంటుందని ఎమ్మెల్యే భరోసా ఇచ్చారు.

## ఆస్పత్రిలో రెండున్నరేళ్ల బాలుడి కిడ్నాప్

**ప్రజానావ, నిజామాబాద్:** నిజామాబాద్ జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆసుపత్రిలో రెండున్నరేళ్ల బాలుడి కిడ్నాప్ కలకలం రేపింది. తల్లిదండ్రులతో కలిసి చికిత్స కోసం వచ్చిన బాలుడు ఆస్పత్రి ఆవరణలో ఆడుకుంటుండగా గుర్తుతెలియని మహిళ అతడిని ఎత్తుకెళ్లింది. బాలుడిని తీసుకెళ్తున్న దృశ్యాలు ఆస్పత్రి ఆవరణలోని సీసీ కెమెరాల్లో రికార్డయ్యాయి. నిజామాబాద్–1 టౌన్ పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌వో రఘుపతి తెలిపిన వివరాల ప్రకారం.. బాల్కొండ మండలానికి చెందిన నవీన్ దంపతులు తమ ఇద్దరు కుమారులు, నాలుగేళ్ల పెద్ద కుమారుడు, రెండున్నరేళ్ల చిన్న కుమారుడు వేదాంషుతో కలిసి శనివారం ఉదయం చికిత్స నిమిత్తం జిల్లా ప్రభుత్వాసుపత్రికి వచ్చారు. తల్లిదండ్రులు ఆస్పత్రి పనుల్లో ఉండగా ఇద్దరు పిల్లలు ఆవరణలో ఓ పక్కన ఆడుకుంటున్నారు. ఈ సమయంలో అక్కడికి వచ్చిన ఓ గుర్తుతెలియని మహిళ ఇద్దరు బాలుర చేతులు పట్టుకుని తన వెంట తీసుకెళ్లేందుకు ప్రయత్నించింది. అయితే పెద్ద కుమారుడు ఆమె నుంచి చేయి విడిపించుకుని తల్లిదండ్రుల వద్దకు చేరుకున్నాడు. చిన్న కుమారుడు వేదాంషును మాత్రం ఆ మహిళ తన వెంట తీసుకెళ్లింది. తమ్ముడిని ఎవరో తీసుకెళ్లారని పెద్ద కుమారుడు తల్లిదండ్రులకు చెప్పడంతో వారు వెంటనే ఆస్పత్రి ఆవరణలో వెతికారు. ఎంత గాలించినా బాలుడి ఆచూకీ లభించకపోవడంతో కన్నీరుమున్నీరుగా విలపించారు. వెంటనే డయల్–100కు సమాచారం అందించారు. దీంతో వన్‌టౌన్ ఎస్‌హెచ్‌వో రఘుపతి సిబ్బందితో కలిసి హుటాహుటిన ఆస్పత్రికి చేరుకున్నారు. ఘటనపై వివరాలు తెలుసుకున్న పోలీసులు ఆస్పత్రిలోని సీసీ కెమెరాల ఫుటేజీని పరిశీలించారు. అందులో ఓ మహిళ బాలుడు వేదాంషును తన వెంట తీసుకెళ్తున్న దృశ్యాలు స్పష్టంగా నమోదైనట్లు గుర్తించారు. దీంతో బాలుడి ఆచూకీ కోసం ప్రత్యేక పోలీసు బృందాలను ఏర్పాటు చేసి, గుర్తుతెలియని మహిళ కోసం ముమ్మరంగా గాలింపు చర్యలు చేపట్టినట్లు ఎస్‌హెచ్‌వో రఘుపతి తెలిపారు. బాలుడిని సురక్షితంగా గుర్తించేందుకు పోలీసులు అన్ని కోణాల్లో దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

## రెండు కార్ల మధ్య స్కూటీ..
# విద్యార్థి దుర్మరణం

- **కామారెడ్డిలో ఘోర రోడ్డు ప్రమాదం**
- **9వ తరగతి విద్యార్థి హేమంత్ మృతి**
- **మరో విద్యార్థికి తీవ్ర గాయాలు**

**ప్రజానావ, కామారెడ్డి:** కామారెడ్డిలో ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుని తొమ్మిదో తరగతి విద్యార్థి ప్రాణాలు కోల్పోయాడు. రెండు కార్ల మధ్య ఎలక్ట్రిక్ స్కూటీ ఇరుక్కోవడంతో స్కూటీపై ఉన్న కూచని హేమంత్ (15) అక్కడికక్కడే మృతి చెందగా, అతడి స్నేహితుడు చింతల లోకేష్ తీవ్రంగా గాయపడ్డాడు. కామారెడ్డిలోని శ్రీరాంనగర్ కాలనీకి చెందిన హేమంత్, లోకేష్ ఇద్దరూ స్నేహితులు. స్థానిక ప్రభుత్వ పాఠశాలలో 9వ తరగతి చదువుతున్నారు. శుక్రవారం సాయంత్రం బంధువుల ఎలక్ట్రిక్ స్కూటీ తీసుకుని డ్రైవింగ్ నేర్చుకునేందుకు ఇద్దరూ రోడ్డుపైకి వచ్చారు. ఇంటర్నేషనల్ హోటల్ ఎదురుగా ఉన్న రహదారిపై వెళ్తుండగా వెనుక నుంచి వేగంగా వచ్చిన ఓ కారు స్కూటీని ఢీకొట్టింది. దీంతో స్కూటీ అదుపుతప్పి మరో కారు మధ్య ఇరుక్కోవడంతో నుజ్జునుజ్జయింది. ఈ ప్రమాదంలో హేమంత్ అక్కడికక్కడే మృతి చెందగా, లోకేష్ తీవ్రంగా గాయపడ్డాడు. క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం స్థానిక ఆస్పత్రికి తరలించారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని ప్రమాదానికి సంబంధించిన వివరాలను సేకరిం చారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టగా.. ప్రమాదానికి కారణమైన కారును నడిపింది కూడా మైనర్ బాలుడేనని గుర్తించారు. ఇదిలా ఉండగా, ప్రమాదంలో మృతి చెందిన హేమంత్, గాయపడిన లోకేష్ ఇద్దరూ నిరుపేద కుటుంబాలకు చెందినవారే కావడం మరింత విషాదాన్ని నింపింది. హేమంత్ తండ్రి గతంలోనే మృతి చెందడంతో తల్లి లావణ్య ఒక్కగానొక్క కుమారుడిని పోషిస్తోంది. మరోవైపు లోకేష్ తండ్రి దశరథ్ నెల రోజుల క్రితమే అనారోగ్యంతో మృతి చెందాడు. తల్లి రాజేశ్వరి కూలీ పనులు చేసుకుంటూ కుమారుడు, కుమార్తెను పోషిస్తోంది. కుటుంబాలకు అండగా నిలవాల్సిన సమయంలో జరిగిన ఈ ప్రమాదం రెండు కుటుంబాలను తీవ్ర విషాదంలోకి నెట్టింది.



## శ్రీ భీమేశ్వర స్వామిని దర్శించుకున్న ప్రభుత్వ విప్

**ప్రజానావ, వేములవాడ:** వేములవాడలోని శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం అనుబంధాలయమైన శ్రీ భీమేశ్వర స్వామిని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు, వేద పండితులు ఆయనకు స్వాగతం పలికి వేదాశీర్వచనం అందించారు. అనంతరం దేవస్థాన డీఈవో ప్రతాప నవీన్ శేషవస్త్రంతో సత్కరించగా, ఏఈవో నాగుల మహేష్ లడ్డూ ప్రసాదాన్ని అందజేశారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది, అర్చకులు, వేద పండితులు పాల్గొన్నారు.



## ప్రపంచంలో తొలిసారి..
# పిల్లల కంటే వృద్ధులే ఎక్కువ

- తగ్గుతున్న జననాల రేటు.. పెరుగుతున్న ఆయుర్దాయం
- 2060 నాటికి 200 కోట్లకు చేరనున్న 65 ఏళ్లు పైబడిన వారి సంఖ్య

**న్యూఢిల్లీ:** మానవ చరిత్రలో తొలిసారి ప్రపంచవ్యాప్తంగా ఐదేళ్లు లేదా అంతకంటే తక్కువ వయసున్న చిన్నారుల కంటే 65 ఏళ్లు పైబడిన వృద్ధుల సంఖ్య అధికమైంది. అమెరికా సెన్సస్ బ్యూరో నివేదిక ప్రకారం 2025లో ఈ కీలక జనాభా మార్పు చోటుచేసుకుంది. ప్రపంచవ్యాప్తంగా తగ్గుతున్న జననాల రేటు, పెరుగుతున్న ఆయుర్దాయం ఇందుకు ప్రధాన కారణాలుగా నిలిచాయి. గత ఐదేళ్లలో 65 ఏళ్లు పైబడిన వారి జనాభా శిశువులు, పసిపిల్లలు, ప్రీస్కూల్ పిల్లల సంఖ్యను అధిగమించింది. ప్రస్తుతం అత్యధిక వృద్ధ జనాభా కలిగిన దేశాల జాబితాలో అమెరికా 48వ స్థానంలో ఉంది. అక్కడ 65 ఏళ్లు, అంతకంటే ఎక్కువ వయసున్న వారి జనాభా 18.9 శాతంగా ఉండగా, 2056 నాటికి ఇది 23.4 శాతానికి చేరుతుందని అంచనా. అయితే ఇతర దేశాల్లో వృద్ధ జనాభా మరింత వేగంగా పెరుగుతున్న నేపథ్యంలో అమెరికా ర్యాంకింగ్ 110వ స్థానానికి పడిపోయే అవకాశం ఉందని నివేదికలు పేర్కొంటున్నాయి. 2025 నాటికి ప్రపంచ వ్యాప్తంగా 65 ఏళ్లు, అంతకంటే ఎక్కువ వయసున్న వారి సంఖ్య 85.20 కోట్లుగా ఉండగా, 2060 నాటికి ఇది ఏకంగా 200 కోట్లకు చేరుతుందని అంచనా. ఈ పెరుగుదల 2025–2060 మధ్య ప్రపంచవ్యాప్తంగా నమోదయ్యే మొత్తం నికర జనాభా వృద్ధిలో 55 శాతానికి సమానమని ఆక్సియోస్ పేర్కొంది. ఇదే సమయంలో ప్రపంచ జనాభా 2025లో 813 కోట్ల నుంచి 2060 నాటికి 1,023 కోట్లకు పెరుగుతుందని అంచనా. అంటే 2060 నాటికి భూమిపై నివసించే ప్రతి ఐదుగురిలో ఒకరు 65 ఏళ్లు పైబడిన వారే ఉండే పరిస్థితి ఏర్పడనుంది.

# బిహార్‌ను ముంచెత్తిన వరదలు

- 11 జిల్లాల్లో 16.85 లక్షల మందిపై ప్రభావం
- పట్నాలోనూ పలు ప్రాంతాలు జలమయం
- 1,158 పడవలు, 27 ఎస్‌డీఆర్‌ఎఫ్, 7 ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందాల మోహరింపు
- భగల్‌పూర్‌లో సీఎం ఏరియల్ సర్వే
- దెబ్బతిన్న కోజి కొర్రైయా బంధ్ పరిశీలన
- సహాయ చర్యలపై అధికారులకు ఆదేశాలు





**పట్నా:** బిహార్‌ను వరదలు అతలాకుతలం చేస్తున్నాయి. గంగా, పున్‌పున్ నదులు ఉప్పొంగడంతో 11 జిల్లాల్లోని 300 గ్రామ పంచాయతీల పరిధిలో 16.85 లక్షల మంది ప్రభావితమయ్యారు. రాష్ట్ర రాజధాని పట్నాలోని లోతట్టు ప్రాంతాలు నీటమునగడంతో రహదారి, రైలు రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. పొరుగు దేశం నేపాల్‌లో భారీ వర్షాలతో పాటు రాష్ట్రంలో కురుస్తున్న వర్షాలతో నదుల్లో నీటిమట్టాలు వేగంగా పెరుగుతున్నాయి. వరద పరిస్థితి తీవ్రంగా ఉన్న భగల్‌పూర్ జిల్లాలో ముఖ్యమంత్రి సమ్రాట్ చౌదరి శనివారం ఏరియల్ సర్వే నిర్వహించారు. నౌగాచియా ప్రాంతాన్ని పరిశీలించడంతోపాటు దెబ్బతిన్న కోజి కొర్రైయా బంధ్‌ను సందర్శించారు. కట్టల పరిస్థితిని నిరంతరం పర్యవేక్షించాలని, ప్రమాదకర ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, సహాయ, రక్షణ చర్యల్లో వేగం పెంచాలని అధికారులను ఆదేశించారు.

### 80 కమ్యూనిటీ కిచెన్లు

వరద బాధితుల కోసం వివిధ జిల్లాల్లో 80 కమ్యూనిటీ కిచెన్లను ఏర్పాటు చేశారు. ఇప్పటివరకు 45,900 పాలిథిన్ షీట్లు, 11,700 డ్రై రేషన్ ప్యాకెట్లను పంపిణీ చేశారు. ప్రజల తరలింపు, రాకపోకల కోసం 1,158 పడవలను నడుపుతున్నారు. సహాయ, రక్షణ చర్యలకు 27 ఎస్‌డీఆర్‌ఎఫ్, 7 ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందాలను రంగంలోకి దించారు. గంగా, గండక్, కోసి, బూఢీ గండక్, పున్‌పున్, బాగ్మతి తదితర నదులు పలు ప్రాంతాల్లో ప్రమాదకర స్థాయికి మించి ప్రవహిస్తున్నాయి. సెప్టెంబర్‌లో బిహార్‌లో ఇప్పటివరకు సాధారణం కంటే 69 శాతం అధికంగా 60.8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. పాట్నాలో గంగా, పున్‌పున్ ఉధృతితో ఎన్‌హెచ్–31పై వరద నీరు చేరి వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. పున్‌పున్–పర్సా బజార్ మధ్య వంతెన వద్ద నీటిమట్టం అధికంగా ఉండటంతో పలు రైళ్లను రద్దు చేసి, మరికొన్నింటిని దారి మళ్లించారు. వరద ప్రాంతాల్లో ఆహారం, మందులు, తాగునీరు, వైద్య సదుపాయాలు, సహాయ శిబిరాలు అందుబాటులో ఉంచాలని నేతలు ప్రభుత్వాన్ని కోరారు.

## 10 రోజుల తర్వాత సొరంగంలో సజీవంగా

**కాట్మాండు:** నేపాల్‌లో వరదల బీభత్సం తర్వాత సహాయక చర్యలు కొనసాగుతున్న వేళ అద్భుత ఘటన చోటుచేసుకుంది. వరదలు సంభవించి పది రోజులు గడిచిన అనంతరం త్రిశూలీ టన్నెల్‌లో చిక్కుకున్న ఓ చైనా పౌరుడిని నేపాల్ ఆర్మీ సజీవంగా రక్షించింది. అతడిని చికిత్స నిమిత్తం కాట్మాండుకు తరలించినట్లు సైన్యం ప్రకటించింది. వరద ప్రభావిత ప్రాంతాల్లోని జలవిద్యుత్ సొరంగాల్లో చిక్కుకున్న వారిని వెలికితీసేందుకు భారత, నేపాలీ బృందాలు భారీ రెస్క్యూ ఆపరేషన్ కొనసాగిస్తున్నాయి. వివిధ సొరంగాల్లో సుమారు 900 మంది కార్మికులు చిక్కుకుని ఉండొచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు. ఆగస్టు 26న సంభవించిన జల విలయంలో సుమారు 1,300 మంది ప్రాణాలు కోల్పోగా, మరో 5 వేల మంది ఆచూకీ గల్లంతైనట్లు సమాచారం. శుక్రవారం వరదల తర్వాత తొమ్మిదో రోజు త్రిశూలీ టన్నెల్ నుంచి ఇద్దరు నేపాలీ పౌరులను సైతం సజీవంగా రక్షించారు. ఇదిలా ఉండగా నువాకోట్ పట్టణంలో ని పూర్తిగా ధ్వంసమైన ఓ ఇంటి శిథిలాల నుంచి 64 ఏళ్ల చండికా శ్రేష్ట అనే మహిళను నేపాల్ ఆర్మీ సురక్షితంగా బయటకు తీసింది. బేత్రావతి ప్రాంతం లో ఇంటి శిథిలాల కింద చిక్కుకున్న ఆమెను గుర్తించిన సైనికులు తీవ్రంగా శ్రమించి రక్షించారు. బయటకు తీసే సమయానికి ఆమె పూర్తిగా బురదతో కప్పబడి ఉన్నప్పటికీ ప్రాణాలతో బయటపడటం సహాయక బృందాల్లో కొత్త ఆశలు నింపింది. వరదల్లో చిక్కుకున్న మరింత మందిని సురక్షితంగా బయటకు తీసేందుకు రెస్క్యూ ఆపరేషన్ కొనసాగుతోంది.



# ఒక్కడే.. ఓ నదిని శుభ్రం చేశాడు!

- ప్రభుత్వాలు చేయలేనిది చేసి చూపిన యువకుడు
- దేశవ్యాప్తంగా ప్రశంసలు
- నెదర్లాండ్స్ సంస్థ నుంచి ఉద్యోగ ఆహ్వానం

**భోపాల్:** ప్రభుత్వాలు, అధికార యంత్రాంగం చేయలేనిది ఓ కుర్రాడు చేసి చూపించాడు. ప్రజలు చెత్తాచెదారంతో డంపింగ్ యార్డుగా మార్చేసిన ఓ నదిని ఒంటరిగా శుభ్రం చేసి దేశవ్యాప్తంగా ప్రశంసలు అందుకున్నాడు. మధ్యప్రదేశ్‌లోని రాజ్‌గఢ్ జిల్లా బయారా గ్రామానికి చెందిన సురేంద్ర సింగ్ చౌదరి ఈ అసాధారణ పనితో సోషల్ మీడియాలో బిట్టు తబాహి పేరుతో ఫేమస్ అయ్యాడు. తాజాగా అతని సేవలను గుర్తించిన నెదర్లాండ్స్‌కు చెందిన ఓ పర్యావరణ సంస్థ తమతో కలిసి పనిచేయాలంటూ ఉద్యోగ ఆహ్వానం పంపింది. తన గ్రామంలోని స్థానిక ఆలయానికి సమీపంగా ప్రవహించే అజ్నర్ నదిని ప్రజలు చెత్తతో నింపేసి డంపింగ్ యార్డులా మార్చడాన్ని చూసి సురేంద్ర చలించిపోయాడు. సమస్యను అధికారులు పరిష్కరిస్తారని ఎదురుచూడకుండా జనవరి 26న స్వయంగా నదిని శుభ్రం చేసే పనికి శ్రీకారం చుట్టాడు. ప్రతిరోజూ దాదాపు మూడు గంటల పాటు ఒంటరిగా నదిలోకి దిగి, చేతులతోనే చెత్తను ఏరివేస్తూ శుభ్రం చేయడం ప్రారంభించాడు. ఈ క్రమంలో పలుమార్లు చేతులు, కాళ్లకు చర్మ సమస్యలు ఎదురైనా వెనక్కి తగ్గలేదు. చివరకు తన సొంత డబ్బుతో దాదాపు రూ.30 వేల వరకు ఖర్చు చేసి యంత్రాలను ఉపయోగించి నదిలో పేరుకు పోయిన చెత్తను పూర్తిగా తొలగించాడు. అతని పట్టుదల, పర్యావరణంపై ఉన్న బాధ్యత సోషల్ మీడియాలో వైరల్‌గా మారడంతో దేశవ్యాప్తంగా ప్రశంసలు వెల్లు వెత్తాయి. ఇప్పుడు నెదర్లాండ్స్‌కు చెందిన పర్యావరణ సంస్థ నుంచి ఉద్యోగ ఆహ్వానం అందుకోవడంతో సురేంద్ర చేసిన సేవకు అంతర్జాతీయ స్థాయిలోనూ గుర్తింపు లభించింది.

# అమెరికా నుంచి యూరప్‌కు తరలుతున్న బంగారం

- నెదర్లాండ్స్ 86 టన్నుల గోల్డ్ తరలింపు
- జర్మనీ, ఫ్రాన్స్ సైతం అదే బాటలో
- పెరుగుతున్న భౌగోళిక, ఆర్థిక అనిశ్చితులే కారణమా?



**లండన్:** ఒకప్పుడు అమెరికాను అత్యంత సురక్షితమైన బంగారం నిల్వ కేంద్రంగా భావించిన యూరప్ దేశాలు ఇప్పుడు తమ రిజర్వులను వెనక్కి తెచ్చుకుంటున్నాయి. తాజాగా నెదర్లాండ్స్ కూడా ఈ జాబితాలో చేరింది. డచ్ సెంట్రల్ బ్యాంక్ (డీఎన్‌బీ) మార్చి, ఆగస్టు మధ్య అమెరికా, కెనడాలోని నిల్వల నుంచి సుమారు 86 టన్నుల బంగారాన్ని లండన్, నెదర్లాండ్స్‌కు తరలించినట్లు సమాచారం. అయితే ఇందులో మొత్తం బంగారాన్ని భౌతికంగా తరలించలేదు. అమెరికాలోనే సుమారు 59 టన్నుల బంగారాన్ని విక్రయించి, దానికి సమానమైన బంగారాన్ని లండన్‌లో కొనుగోలు చేసింది. మరో 27 టన్నులను అమెరికా, కెనడా నుంచి నెదర్లాండ్స్‌లోని జీస్ట్‌కు తరలించింది. భవిష్యత్తులో ఎదురయ్యే సంక్షోభ పరిస్థితులను ముందుగానే ఎదుర్కొనేందుకు నిల్వలను పునర్వ్యవస్థీకరిస్తున్నామని డీఎన్‌బీ అధ్యక్షుడు ఓలాఫ్ స్లీజ్‌పెన్ తెలిపారు. నెదర్లాండ్స్ వద్ద మొత్తం 612.4 టన్నుల బంగారం ఉండగా, దాని విలువ సుమారు 83.8 బిలియన్ డాలర్లుగా పేర్కొంది. తాజా చర్యతో లండన్‌లోని నెదర్లాండ్స్ బంగారం వాటా 18.1 శాతం నుంచి 32.1 శాతానికి పెరిగింది. మరోవైపు అమెరికా–యూరప్ సంబంధాల్లో చోటుచేసుకుంటున్న మార్పులు, వాణిజ్య ఉద్రిక్తతలు, యుద్ధ భయాలు కూడా ఈ పరిణామానికి కారణమై ఉండొచ్చనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఫ్రాన్స్ ఇప్పటికే అమెరికా నుంచి తన బంగారం నిల్వల్లో కొంత భాగాన్ని వెనక్కి తెచ్చుకోగా, జర్మనీ కూడా న్యూయార్క్ నుంచి 111 టన్నులు, పారిస్ నుంచి 105 టన్నులు కలిపి మొత్తం 216 టన్నుల బంగారాన్ని స్వదేశానికి తరలించింది. యుద్ధాలు, వాణిజ్య ఉద్రిక్తతలు, అధిక ద్రవ్యోల్బణం, వడ్డీ రేట్ల వంటి పరిణామాల నేపథ్యంలో కొన్ని దేశాలు తమ బంగారం నిల్వలను సొంత నియంత్రణలో ఉంచుకోవడానికి ప్రాధాన్యం ఇస్తున్నాయని వరల్డ్ గోల్డ్ కౌన్సిల్ సీనియర్ మార్కెట్ స్ట్రాటజిస్ట్ జోసెఫ్ కవటోని పేర్కొన్నారు. అయితే బంగారం విక్రయాలు, కొనుగోళ్లకు లండన్ ఇప్పటికీ కీలక కేంద్రంగా కొనసాగుతోంది. ముఖ్యంగా బ్యాంక్ ఆఫ్ ఇంగ్లండ్‌లో ప్రపంచ దేశాలకు చెందిన భారీ బంగారం నిల్వలు ఉన్నాయి. దాదాపు 300 ఏళ్ల చరిత్ర కలిగిన ఈ బ్యాంకులో సుమారు నాలుగు లక్షల బంగారు కడ్డీలు ఉన్నాయని, వాటి విలువ దాదాపు 200 బిలియన్ పౌండ్లుగా ఉంటుందని అంచనా. ప్రపంచవ్యాప్తంగా ఆర్థిక, భౌగోళిక అనిశ్చితులు పెరుగుతున్న వేళ.. బంగారాన్ని వ్యూహాత్మక రిజర్వుగా భావిస్తున్న దేశాలు తమ నిల్వలను పునర్వ్యవస్థీకరించుకోవడం ఆసక్తికర పరిణామంగా మారింది. అదే సమయంలో అంతర్జాతీయ మార్కెట్లో బంగారం ధరలు రికార్డు స్థాయికి చేరుతుండటం ఈ ధోరణికి మరింత ప్రాధాన్యం తెచ్చింది. భవిష్యత్తులో దేశాల బంగారం నిల్వల విధానాల్లో చోటుచేసుకునే మార్పులు ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై ఎలాంటి ప్రభావం చూపుతాయన్నది ఆసక్తికరంగా మారింది.

# ఖర్గ్ ఐలాండ్‌పై అమెరికా మిస్సైల్ దాడి

- నాలుగు క్షిపణులతో విరుచుకుపడిన అగ్రరాజ్యం
- ఇరాన్ చమురు ఎగుమతులకు కీలకమైన దీవే లక్ష్యం



**న్యూఢిల్లీ:** అమెరికా–ఇరాన్ మధ్య కొనసాగుతున్న యుద్ధం మరింత తీవ్రరూపం దాల్చుతోంది. ఇరాన్‌కు అత్యంత కీలకమైన ఖర్గ్ ఐలాండ్‌పై అమెరికా క్షిపణి దాడికి దిగింది. ఖర్గ్ ఐలాండ్ వద్ద ఉన్న ఓ ఆయిల్ ట్యాంకర్‌ను లక్ష్యంగా చేసుకుని అమెరికా నాలుగు మిస్సైళ్లను ప్రయోగించినట్లు సమాచారం. ఇరాన్ తీరానికి సుమారు 33 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఖర్గ్ ఐలాండ్.. ఆ దేశ చమురు ఎగుమతుల్లో కీలక పాత్ర పోషిస్తోంది. ఇక్కడి నుంచే ఇరాన్ భారీగా క్రూడాయిల్‌ను విదేశాలకు తరలిస్తోంది. దీంతో ఇరాన్ ఆర్థిక వ్యవస్థకు కీలకమైన చమురు రవాణా వ్యవస్థను దెబ్బతీయడమే లక్ష్యంగా అమెరికా ఈ దీవిని టార్గెట్ చేసినట్లు తెలుస్తోంది. ఇరాన్‌పై దాడులు కొనసాగిస్తామని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ శుక్రవారం హెచ్చరించిన కొద్ది గంటల్లోనే ఈ దాడి జరగడం ప్రాధాన్యం సంతరించుకుంది. ఇరాన్‌లోని పిక్కేక్స్ పర్వత ప్రాంతంలో ఉన్న భూగర్భ అణు కేంద్రంపై దాడి చేస్తామని ట్రంప్ హెచ్చరించారు. ఇరాన్ అణ్వాయుధాన్ని తయారు చేయకుండా అడ్డుకోవడమే తమ ప్రధాన లక్ష్యమని మరోసారి స్పష్టం చేశారు. ఈ హెచ్చరికల అనంతరం ఖర్గ్ ఐలాండ్‌పై నాలుగు క్షిపణులతో దాడి జరగడం ఇరాన్‌పై అమెరికా ఒత్తిడి మరింత పెరిగిన సంకేతంగా కనిపిస్తోంది. ఖర్గ్ ఐలాండ్‌పై అమెరికా దాడి చేయడం ఇది మూడోసారి కావడం గమనార్హం. తాజా దాడిలో ఎంతమేర నష్టం జరిగిందన్న దానిపై ఇప్పటివరకు అధికారిక ప్రకటన వెలువడలేదు. అమెరికా, ఇరాన్ ప్రభుత్వాలు కూడా ఈ దాడిపై స్పందించలేదు. మరోవైపు లెబనాన్‌పై ఇజ్రాయెల్ దాడులు కొనసాగుతున్నాయి. దక్షిణ లెబనాన్‌లోని అలి తాహెర్ ప్రాంతాన్ని 'ఆపరేషన్ కంట్రోల్' ద్వారా తమ అధీనంలోకి తీసుకున్నట్లు ఇజ్రాయెల్ ప్రకటించింది. ఈ ప్రాంతంలో హెజ్ బొల్లాకు చెందిన భూగర్భ స్థావరాలు, ఆయుధ నిల్వ లు ఉన్నట్లు సమాచారం. దీంతో మధ్యప్రాచ్యం లో ఒకవైపు అమెరికా–ఇరాన్ ఘర్షణ, మరోవైపు ఇజ్రా యెల్–హెజ్‌బొల్లా ఉద్రిక్తతలు మరింత ము దురుతుం డటంతో పరిస్థితులు ఆందోళనకరంగా మారుతున్నాయి.

## నదికి అడ్డుగా కొండచరియలు

- నేపాల్‌కు మరో వరద ముప్పు
- అప్రమత్తమైన అధికారులు

**కాట్మాండు:** హిమానీనదం విరిగిపడి వచ్చిన భారీ వరదలతో అతలాకుతలమైన నేపాల్‌ను ఇప్పుడు మరో ముప్పు వెంటాడుతోంది. తాజాగా జారీ చేసిన వరద ప్రమాద హెచ్చరికలు ఆ దేశంలో ఆందోళన పెంచుతున్నాయి. భారీ వర్షాల కారణంగా దార్చులా జిల్లాలోని భట్టార్ ప్రాంతంలో కొండచరియలు విరిగిపడి చౌలానీ నది ప్రవాహానికి అడ్డం కిగా మారాయి. కొండలపై నుంచి భారీగా రాళ్లు, మట్టి జారిపడటంతో నదీ ప్రవాహం పాక్షికంగా నిలిచిపోయింది. దీంతో అప్రమత్తమైన అధికారులు.. ఈ అడ్డంకులు ఒక్కసారిగా తొలగిపోతే నిలిచిపోయిన నీరు వేగంగా దిగువకు దూసుకొచ్చి ఆకస్మిక వరదలకు దారితీసే ప్రమాదం ఉందని హెచ్చరించారు. నదీ పరివాహక ప్రాంతాల్లో నివసించే ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా యంత్రాం గం సూచించింది. పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించేందుకు పోలీసు బలగాలను రంగంలోకి దించింది.

## బీఎల్ఏ దాడులు.. 25 మంది పాక్ సైనికుల మృతి

- రెండు వేర్వేరు దాడుల్లో పాక్ సైన్యంపై విరుచుకుపడిన తిరుగుబాటు గ్రూప్
- బెలూచిస్తాన్‌లో మళ్లీ ఉద్రిక్తత

**ఇస్లామాబాద్:** పాకిస్థాన్‌లో సైన్యానికి, బెలూచిస్తాన్ లిబరేషన్ ఆర్మీ (బీఎల్ఏ)కు మధ్య కొనసాగుతున్న ఘర్షణలు మరింత ఉధృతమవుతున్నాయి. ఇరుపక్షాలు పరస్పరం దాడులు చేసుకుంటున్న నేపథ్యంలో బీఎల్ఏ తాజాగా జరిపిన రెండు వేర్వేరు దాడుల్లో 25 మంది పాక్ సైనికులు మరణించినట్లు ఆ సంస్థ ప్రకటించింది. ఈ దాడులకు సంబంధించిన వీడియోను కూడా బీఎల్ఏ విడుదల చేసింది. శుక్రవారం జియారత్ క్రాస్ వద్ద పాక్ మిలిటరీ కాన్వాయ్‌కు చెందిన రెండు వాహనాలు వెళ్తుండగా బీఎల్ఏకు చెందిన ఫతేహ్ స్క్వాడ్ దాడి చేసినట్లు తెలిపింది. ఈ ఘటనలో 18 మంది సైనికులు మరణించగా, పలువురు గాయపడినట్లు పేర్కొంది. బీఎల్ఏలోని అత్యంత శక్తిమంతమైన సాయుధ విభాగాల్లో ఫతేహ్ స్క్వాడ్ ఒకటిగా చెబుతున్నారు. బెలూచిస్తాన్‌లోని పర్వత ప్రాంతాలను కేంద్రంగా చేసుకుని గెరిల్లా తరహా మెరుపు దాడులు నిర్వహించ డంలో ఈ గ్రూప్ కీలకంగా వ్యవహరిస్తున్నట్లు సమాచారం. గతేడాది మార్చిలో జాఫర్ ఎక్స్‌ప్రెస్‌ను హైజాక్ చేసిన ఘటనలోనూ ఫతేహ్ స్క్వాడ్ పేరు తెరపైకి వచ్చింది. మరోవైపు సూరబ్ పరిధిలోని హజికా ప్రాంతంలో బీఎల్ఏకు చెందిన ఎస్‌టీఓఎస్ గ్రూప్ పాక్ సైన్యంపై దాడి చేసినట్లు ప్రకటించింది. రిమోట్ కంట్రోల్ వాహనాన్ని ఉపయోగించి జరిపిన ఈ దాడిలో ఏడుగురు సైనికులు మరణించినట్లు బీఎల్ఏ వెల్లడించింది. ఈ రెండు దాడులపై పాకిస్థాన్ ప్రభుత్వం లేదా సైన్యం నుంచి ఇప్పటివరకు అధికా రిక ప్రకటన వెలువడలేదు. అయితే వరుస దాడులు పాక్ సైన్యానికి సవాల్‌గా మారాయని స్థానిక విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ముఖ్యంగా ఆర్మీ చీఫ్ అసిమ్ మునీర్ నేతృత్వంలోని భద్రతా వ్యవస్థ వైఫల్యంగా కొందరు స్థానికులు విమర్శలు చేస్తున్నారు. బెలూచిస్తాన్‌లో పాకిస్థాన్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా చాలాకాలంగా అసంతృప్తి, ఆందోళనలు కొనసాగుతున్నాయి.

# నగ్న పూజ పేరుతో బ్లాక్‌మెయిల్

**దృశ్యాలను రికార్డు చేసి డబ్బుల కోసం బెదిరింపులు, నిందితుడి అరెస్ట్**



**చెన్నై:** వీడియో కాల్‌లో ఓ విదేశీ మహిళతో నగ్నంగా పూజ చేయించి, ఆ దృశ్యాలను రికార్డు చేసి బ్లాక్‌మెయిల్‌కు పాల్పడిన ఘటన చెన్నైలో వెలుగు చూసింది. పోలీసుల వివరాల ప్రకారం.. కెనడాకు చెందిన 37 ఏళ్ల మహిళ ఇటీవల తమిళనాడు పర్యటనకు వచ్చారు. ఈ క్రమంలో చెన్నైలోని బెసెంట్ నగర్ బీచ్‌లో ఆమెకు చిలుక జోస్యం చెప్పే ఇసక్కిముత్తు అనే వ్యక్తి పరిచయమయ్యాడు. జాతకం చెబుతూ.. గతంలో ఆమెను టీవీలో చూశానని, తాను చెప్పినట్లు చేస్తే జీవితంలో మరింత ఉన్నత స్థాయికి ఎదుగుతారని నిందితుడు నమ్మబలికాడు. అనుకున్న ది సాధించాలంటే ప్రత్యేక పూజ చేయాలని, దానిని నగ్నంగా నిర్వహించాల్సి ఉంటుందని చెప్పాడు. ప్రత్యక్షంగా కాకుండా వీడియో కాల్ ద్వారా కూడా పూజ చేయవచ్చని చెప్పడంతో అతని మాటలను నమ్మిన బాధితురాలు వీడియో కాల్‌లో నగ్నంగా పూజలో పాల్గొన్నారు. ఇందుకోసం ఇసక్కిముత్తు ఆమె నుంచి రూ.20 వేలు తీసుకున్నాడు. ఇదే సమయంలో పూజ జరుగుతున్న దృశ్యాలను తన మొబైల్ ఫోన్‌లో రికార్డు చేసుకున్నాడు. కొన్ని రోజుల తర్వాత బాధితురాలికి ఫోన్ చేసిన నిందితుడు తన వద్ద ఉన్న వీడియోను చూపించి, మరింత డబ్బు ఇవ్వాలని డిమాండ్ చేశాడు. డబ్బులు ఇవ్వకపోతే ఆ వీడియోను సోషల్ మీడియాలో విడుదల చేస్తానని బెదిరించాడు. దీంతో తాను మోసపోయినట్లు గుర్తిం చిన బాధితురాలు బుధవారం మాంబలం పోలీసుల ను ఆశ్రయించి ఫిర్యాదు చేశారు. ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టి ఇసక్కిముత్తును అరెస్ట్ చేశారు.

# అప్పు కోసం మహిళ కిడ్నాప్.. అర్ధనగ్న వీడియోలతో బెదిరింపులు

- నాలుగు రోజుల పాటు నిర్బంధం
- రూ.11 లక్షలు చెల్లించాలంటూ వేధింపులు
- తప్పించుకుని పోలీసులను ఆశ్రయించిన బాధితురాలు



**బెంగళూరు:** అప్పు చెల్లించడం లేదన్న కారణంతో ఓ మహిళను కిడ్నాప్ చేసి నాలుగు రోజుల పాటు నిర్బంధించడమే కాకుండా అర్ధనగ్న వీడియోలు చిత్రీకరించి బెదిరించిన దారుణ ఘటన బెంగళూరులో వెలుగుచూసింది. బాధితురాలి ఫిర్యాదుతో చంద్ర లేఔట్ పోలీసులు నలుగురు నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ నెల 31న నమోదైన ఎఫ్ఐఆర్ ప్రకారం.. బెంగళూరులో నివసించే 30 ఏళ్ల మహిళ నజాత్ బేగం అనే మహిళ నుంచి రూ.50 వేల అప్పు తీసుకుంది. దీనికి వారానికోసారి ఈఎంఐ చెల్లించాల్సి ఉంది. అలాగే రేష్మ బాను అనే మరో మహిళ నుంచి రూ.లక్ష తీసుకుని రెండేళ్ల పాటు నెలవారీ వడ్డీ చెల్లించేందుకు అంగీకరించింది. అయితే కొన్ని వారాలుగా ఈఎంఐ చెల్లించలేకపోవడంతో నజాత్ బేగం ఆమెను ఆగస్టు 27న మెట్రో లేఔట్‌లోని తన ఇంటికి పిలిపించింది. ఉద్యోగం ఇప్పిస్తానని, దాని ద్వారా అప్పు తీర్చుకోవచ్చని నమ్మించి రప్పించినట్లు బాధితురాలు పోలీసులకు తెలిపింది. అదే రోజు సాయంత్రం ఆమె తన కుమారుడితో కలిసి అక్కడికి వెళ్లగా, అప్పటికే రేష్మ బాను, ఆమె భర్త సుహేల్‌తో పాటు మరో ఇద్దరు అక్కడికి చేరుకున్నారు. అనంతరం బాధితురాలిని ఇంట్లోనే నిర్బంధించి అప్పు చెల్లించాలని డిమాండ్ చేశారు. వడ్డీతో కలిపి రూ.11 లక్షలు చెల్లించాలని, లేదంటే కత్తితో పొడిచి చంపేస్తామని బెదిరించినట్లు ఫిర్యాదులో పేర్కొంది. ఆమె మొబైల్ ఫోన్‌ను లాక్కొని పగులగొట్టడంతో పాటు, ఆమెను కుమారుడిని బెదిరించి రాత్రివేళ ఆటోలో కుంబలగోడు ప్రాంతంలోని మరో ఇంటికి తరలించారు. అక్కడి అపార్ట్‌మెంట్‌లో ఆమెను బంధించి క్రూరంగా దాడి చేసినట్లు ఆరోపించింది. అనంతరం ఆగస్టు 29న రేష్మ బాను భర్త, ఇతర నిందితులు కలిసి ఆమె దుస్తులు విప్పించి అర్ధనగ్నంగా ఉన్న వీడియోలను మొబైల్‌లో చిత్రీకరించినట్లు తెలిపింది. అప్పు చెల్లించకపోతే ఆ వీడియోలను సోషల్ మీడియాలో వైరల్ చేస్తామని బెదిరించారని, డబ్బు రాబట్టుకునేందుకు తనను వ్యభిచారంలోకి దింపుతామని హెచ్చరించినట్లు బాధితురాలు ఆరోపించింది. అదే రోజు ఆమె కుమారుడిని నిందితులు విడిచిపెట్టారు. దీంతో కుమారుడిని తన తల్లి వద్దకు వెళ్లాలని బాధితురాలు సూచించింది. అయితే ఆమెను మాత్రం అక్కడే నిర్బంధంలో ఉంచారు. ఆగస్టు 30న ఆమెను ఓ న్యాయవాది వద్దకు తీసుకెళ్లి కొన్ని ఖాళీ పేపర్లపై సంతకాలు చేయించుకున్న అనంతరం తిరిగి తీసుకొచ్చి నిర్బంధించినట్లు ఫిర్యాదులో పేర్కొంది. చివరకు ఆగస్టు 31న టాయిలెట్‌కు వెళ్లేందుకు రేష్మ బాను గది తలుపు తెరవడంతో అదును చూసుకున్న బాధితురాలు అక్కడి నుంచి తప్పించుకుంది. అనంతరం పోలీసులను ఆశ్రయించి జరిగిన ఘటనపై ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకున్న చంద్ర లేఔట్ పోలీసులు నిందితుల కోసం గాలిస్తున్నారు. ఘటనపై దర్యాప్తు కొనసాగుతోంది.



# బాబర్ 'డమ్మీ కెప్టెన్'

- పాక్ క్రికెట్ పతనానికి బోర్డు నిర్ణయాలే కారణం
- కోచ్‌లు, సిబ్బందిపై వేటు.. కెప్టెన్‌గా బాబర్ మౌనంగా ఉండటంపై ఎందుకు?: మాజీ క్రికెటర్ రషీద్ లతీఫ్

**ఇస్లామాబాద్:** పాకిస్థాన్ క్రికెట్ పతనావస్థకు చేరడానికి ప్రధాన కారణం బోర్డేనని మాజీ ఆటగాళ్లు తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. ఈ క్రమంలోనే ఇంగ్లాండ్ చేతిలో ఘోర ఓటమిని చవిచూసిన తర్వాత ఆటగాళ్లతోపాటు కోచింగ్ సిబ్బందిపై పీసీబీ వేటు వేసింది. ప్రధాన కోచ్ సర్ఫరాజ్ అహ్మద్, బౌలింగ్ కోచ్ ఉమర్ గుల్‌ను స్వదేశానికి పిలిపించింది. ఇక, సెలక్టర్ పదవికి మిస్బా ఉల్ హక్ రాజీనామా చేయడం సంచలనంగా మారింది. ఇప్పుడు పీసీబీ దృష్టంతా చీఫ్ సెలక్టర్ అకిబ్ జావెద్‌పైనే ఉంది. ఈ నేపథ్యంలోనే పాక్ బోర్డు తర్వాతి టార్గెట్.. కెప్టెన్ బాబర్ అజామ్ అంటూ మాజీ క్రికెటర్ రషీద్ లతీఫ్ వ్యాఖ్యానించాడు.

''మీరు (పీసీబీని ఉద్దేశిస్తూ) జట్టును 'రిమోట్ కంట్రోల్' ద్వారానే నడపాలని అనుకుంటున్నట్లు ఉంది. సర్ఫరాజ్, ఉమర్ గుల్‌ను ఎందుకు ఇంగ్లాండ్‌కు పంపారు? ఇప్పుడు ఆ ఇద్దరిని ఎందుకు వెనక్కి పిలిచారు? గ్యారీ కిరిస్టెన్, జాసన్ గిలెస్పీ నుంచి అధికారాలను ఎందుకు తొలగించారు? మీ నిర్ణయాలు ఏంటో అర్థం కావడం లేదు. మీ మాట కెప్టెన్ బాబర్ అజామ్ వినకపోతే అతడిని తొలగించి ఉండాల్సింది కదా..! అలా కాకుండా సర్ఫరాజ్, ఉమర్‌పై వేటు ఎందుకు? వీరి తర్వాత మీ లక్ష్యం ఎవరు? బాబర్ అజామేనా?'' అని ఘాటుగా పోస్టు పెట్టాడు.

### బాబర్ రాజీనామా చేయాల్సింది..

''పాకిస్థాన్ క్రికెట్ బోర్డు చేతిలో బలిపశువులైన ఆటగాళ్లు, కోచ్‌లకు సంఘీభావంగా కెప్టెన్ బాబర్ అజామ్ ఇప్పటికే రాజీనామా చేస్తే బాగుండేది. స్క్వాడ్‌లోని సగం జట్టును వెనక్కి పిలిపించడమంటే చిన్న విషయం కాదు. ఒకవేళ నేను ఆ ప్లేస్‌లో ఉండుంటే.. కెప్టెన్సీని వదిలేసేవాడిని. ఇప్పుడు నువ్వు (బాబర్) డమ్మీ సారథిగా మారిపోయావు. ఇమామ్‌ను స్వదేశానికి పంపించారంటే అతడికి గాయమైంది కాబట్టి అని అర్థం చేసుకుంటాం. మరో ఆరుగురిని ఎందుకు పంపారు? పాక్‌కు ఛాంపియన్స్ ట్రోఫీని అందించిన కోచ్‌తోపాటు స్టార్ పేసర్‌నూ వెనక్కి పిలిపించారు. ఇలాంటప్పుడు వారికి మద్దతుగా నిలవాల్సింది. కానీ సైలెంట్‌గా ఉన్నావు. పీసీబీకి నీలాంటి డమ్మీ కెప్టెన్ అవసరం ఎప్పుడూ ఉంటుంది'' అని లతీఫ్ విమర్శించాడు.

# పాక్‌పై భారత్ ఘన విజయం!

- రఫ్ఫాడించిన తెలుగు తేజం
- 55 పరుగులకే పాకిస్థాన్ ఆలౌట్.. 7 వికెట్ల తేడాతో టీమ్ఇండియా గెలుపు
- శ్రీచరణి, ప్రేమ్ రావత్ మూడేసి వికెట్లతో పాక్ పతనం
- 68 బంతులు మిగిలుండగానే లక్ష్య ఛేదన.. సెమీస్‌లోకి భారత్



**దుబాయ్:** మహిళల ఆసియా కప్ 2026లో భారత్ జోరు కొనసాగుతోంది. దాయాదీ పాకిస్థాన్‌తో శనివారం జరిగిన ఏకపక్ష పోరులో టీమ్ఇండియా 7 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. భారత స్పిన్ త్రయం ధాటికి పాకిస్థాన్ బ్యాటింగ్ పేకమేడలా కూలిపోయింది. తొలుత బ్యాటింగ్ చేసిన పాక్ 18.1 ఓవర్లలో కేవలం 55 పరుగులకే ఆలౌటైంది. అనంతరం భారత్ 8.4 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి 57 పరుగులు చేసి విజయాన్ని అందుకుంది.

### రఫ్ఫాడించిన శ్రీచరణి

భారత్ విజయంలో తెలుగు తేజం శ్రీచరణి కీలక పాత్ర పోషించింది. అద్భుతమైన స్పిన్‌తో పాకిస్థాన్ బ్యాటర్లను బెంబేలెత్తించిన ఆమె 3.1 ఓవర్లలో కేవలం 7 పరుగులిచ్చి మూడు వికెట్లు పడగొట్టింది. ప్రేమ్ రావత్ కూడా మూడు వికెట్లతో రాణించగా.. దీప్తి శర్మ రెండు వికెట్లు తీసింది. షెఫాలీ వర్మకు ఒక వికెట్ దక్కింది.

### 55 పరుగులకే పాక్ పతనం

టాస్ గెలిచి తొలుత బ్యాటింగ్‌కు దిగిన పాకిస్థాన్ ఆరంభంలో కాస్త దూకుడుగా ఆడింది. ఓపెనర్లు మునీబా అలీ (13), షవాల్ జుఫికర్ (14) బౌండరీలతో జట్టుకు శుభారంభం అందించారు. అయితే మునీబా వికెట్ అనంతరం పాక్ పతనం మొదలైంది. శ్రీచరణి వరుస దెబ్బలు తీయడంతో పాకిస్థాన్ బ్యాటర్లు క్రీజులో నిలదొక్కుకోలేకపోయారు. గుల్ ఫెరోజా (0), షవాల్ జుఫికర్ (14), ఆయేషా జఫర్ (2)లను శ్రీచరణి పెవిలియన్‌కు పంపింది. ప్రేమ్ రావత్ సదాఫ్ షమాస్ (3), ఉమ్మ్–ఈ–హాని (6) వికెట్లు తీయగా.. దీప్తి శర్మ కెప్టెన్ ఫాతిమా సనా (0), టుబా హసన్‌లను ఔట్ చేసింది. దీంతో పాక్ 55 పరుగులకే కుప్పకూలింది.

స్వల్ప లక్ష్య ఛేదనలో భారత్‌కు ఆరంభంలోనే షాక్ తగిలింది. షెఫాలీ వర్మ (12) భారీ సిక్సర్‌తో ఇన్నింగ్స్‌ను ప్రారంభించినా.. పాక్ కెప్టెన్ ఫాతిమా సనా ఆమెను రిటర్న్ క్యాచ్‌తో పెవిలియన్‌కు పంపింది. ఆ వెంటనే ప్రతికా రావల్ (4) కూడా ఔటైంది. తన మరుసటి ఓవర్‌లో స్మృతి మంధాన (9)ను సనా ఎల్బీగా వెనక్కి పంపడంతో భారత్ 29 పరుగులకే మూడు వికెట్లు కోల్పోయింది. దీంతో మ్యాచ్‌పై కాసేపు ఉత్కంఠ నెలకొంది.

### హర్మన్‌ప్రీత్, దీప్తి ప్రశాంతంగా..

లక్ష్యం చిన్నది కావడంతో కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్, దీప్తి శర్మ ఎలాంటి ఒత్తిడికి లోనుకాకుండా ఆచితూచి ఆడారు. హర్మన్‌ప్రీత్ 18 బంతుల్లో ఫోర్, సిక్సర్‌తో 18 పరుగులు, దీప్తి శర్మ 14 బంతుల్లో ఫోర్‌తో 12 పరుగులు చేసి నాటౌట్‌గా నిలిచారు. చివర్లో హర్మన్‌ప్రీత్ వరుసగా బౌండరీ, సిక్సర్ బాది భారత్‌కు విజయాన్ని అందించింది.

### భారత్ సెమీస్‌లోకి..

ఈ విజయంతో భారత్ ఇప్పటికే సెమీఫైనల్ బెర్త్ ఖరారు చేసుకుంది. మరోవైపు పాకిస్థాన్ సెమీస్ అవకాశాలను సంక్లిష్టం చేసుకుంది. హాంగ్‌కాంగ్‌తో జరిగే చివరి మ్యాచ్‌లో భారీ తేడాతో విజయం సాధిస్తేనే పాక్ నాకౌట్ దశకు చేరుకునే అవకాశాలు ఉంటాయి.

## మహమ్మద్ షమీని దీటుగా ఎదుర్కొంటాం

**సౌత్ జోన్ కెప్టెన్ తిలక్ వర్మ వెల్లడి**



**చెన్నై:** దులీప్ ట్రోఫీ 2026 ఫైనల్ కోసం అన్ని విధాల సిద్ధమయ్యామని సౌత్ జోన్ కెప్టెన్ తిలక్ వర్మ తెలిపాడు. మహమ్మద్ షమీని సమర్థవంతంగా ఎదుర్కొంటామని ధీమా వ్యక్తం చేశాడు. ఆదివారం చెన్నై వేదికగా ప్రారంభమయ్యే దులీప్ ట్రోఫీ ఫైనల్లో ఇషాన్ కిషన్ సారథ్యంలో ఈస్ట్ జోన్‌తో సౌత్ జోన్ అమీతుమీ తేల్చుకోనుంది. ఈ మ్యాచ్ నేపథ్యంలో శనివారం మీడియా సమావేశంలో పాల్గొన్న తిలక్ వర్మ.. సౌత్ జోన్ తరఫున ఎల్ రాహుల్ ఆడటం లేదని స్పష్టం చేశాడు. దేవదత్ పడిక్కల్‌తో పాటు సిరాజ్ బరిలోకి దిగుతున్నారని చెప్పాడు. 'సీనియర్ పేసర్ మహమ్మద్ షమీని అడ్డుకునేందుకు సిద్ధంగానే ఉన్నాం. ఈ మ్యాచ్ రసవత్తరంగానే ఉండబోతుంది. గత మ్యాచ్‌లో షమీ ఎలా బౌలింగ్ చేశాడో మేం గమనించాం. బ్యాటర్లను ఇబ్బంది పెడుతూ లైన్ అండ్ లెంగ్త్‌తో కట్టడి చేసేందుకు ప్రయత్నిస్తాడు. అతని బౌలింగ్‌ను ఎదుర్కొని సత్తా చాటుతాం. ఎల్ రాహుల్ ఈ మ్యాచ్ ఆడటం లేదు.'అని తిలక్ వర్మ తెలిపాడు. 54 ఏళ్ల తర్వాత దులీప్ ట్రోఫీ ఫైనల్లో సౌత్ జోన్, ఈస్ట్ జోన్ తలపడుతున్నాయి.

## తండ్రి పేరిట ఫెలోషిప్ ప్రకటించిన సచిన్

- ప్రొఫెసర్ రమేశ్ టెండూల్కర్ జ్ఞాపకార్థం ప్రత్యేక కార్యక్రమం
- ఏటా ఒక ఎండీ విద్యార్థికి ఆర్థిక సాయం.. శ్రీనగర్‌లో స్పెషల్ శిక్షణ

**శ్రీనగర్:** ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్ కీలక ప్రకటన చేశారు. తన తండ్రి, ప్రొఫెసర్ రమేశ్ టెండూల్కర్ జ్ఞాపకార్థం విద్యార్థుల కోసం ఫెలోషిప్‌ను ప్రారంభిస్తున్నట్లు వెల్లడించారు. యువ వైద్యులను ప్రోత్సహించడమే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఇంకా హెల్త్ ఫౌండేషన్‌తో కలిసి టెండూల్కర్ ఫౌండేషన్ ఈ ఫెలోషిప్‌ను అందించనుంది. ప్రతి ఏడాది డాక్టర్ ఆఫ్ మెడిసిన్ (ఎండీ) చేస్తున్న ఒక విద్యార్థిని ఎంపిక చేసి ఆర్థికంగా సాయం చేయనున్నారు. శ్రీనగర్‌లో క్లెఫ్ట్, క్రానియోఫేషియల్ కేర్‌లో ప్రత్యేక శిక్షణ పొందేందుకు ఈ ఫెలోషిప్ ఉపయోగపడనుంది. ''టీచర్స్ డే సందర్భంగా సచిన్ సోషల్ మీడియా వేదికగా తన తండ్రిని గుర్తు చేసుకున్నారు. చిన్నప్పటి నుంచే తనకు క్రికెట్ అంటే ఎంతో ఇష్టమని, అయితే తన తండ్రి తనలో దానికంటే ఎక్కువ ప్రతిభను చూశారని తెలిపారు. తాను ఏం కావాలో నిర్ణయించకుండా.. తన భవిష్యత్తును తానే ఎంచుకునే స్వేచ్ఛను తండ్రి ఇచ్చారని పేర్కొన్నారు.

తన తండ్రి నమ్మిన సిద్ధాంతాల్లో విద్యకు ప్రత్యేక స్థానం ఉందని సచిన్ అన్నారు. విద్యే కొత్త అవకాశాలను సృష్టిస్తుందని ఆయన విశ్వసించేవారని గుర్తుచేసుకున్నారు. ఆ ఆలోచన ఇతరులకు ఉపయోగపడేలా చేయడం కంటే గొప్ప పరమార్థం మరొకటి ఉండదని పేర్కొన్నారు.

# సీఎస్కే కెప్టెన్ మార్పు తప్పదా?



**చెన్నై:** జట్టు భవిష్యత్తును దష్టిలో ఉంచుకుని ప్రస్తుత సారథి రుతురాజ్ గైక్వాడ్‌ను తప్పించి, వికెట్ కీపర్ బ్యాటర్ సంజూ శాంసన్‌కు పగ్గాలు అప్పగించాలని ఫ్రాంచైజీకి సూచించారు. గత వదు సీజన్లుగా చెన్నై సూపర్ కింగ్స్ వరుసగా ప్లేఆఫ్స్ అర్హత సాధించడంలో విఫలమైంది. మరోవైపు 2026 సీజన్‌లో కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్ వ్యక్తిగత ప్రదర్శన డా తీవ్ర విమర్శలకు దారితీసింది. పవర్‌ప్లేలో అత్యంత తక్కువ స్ట్రైక్ రేట్ నమోదు చేసిన బ్యాటర్‌గా నిలిచిన రుతురాజ్, 28 సగటుతో వలం 337 పరుగులు మాత్రమే చేయగలిగాడు. ఈ క్రమంలో శాంసన్ జట్టులోకి రావడంతో నాయకత్వ బాధ్యతలు ఆయన అప్పగించాలనే డిమాండ్లు బలంగా వినిపిస్తున్నాయి. సీఎస్ ఎప్పుడూ స్థిరత్వానికి ప్రాధాన్యమిస్తుందని, తొందర పాటు నిర్ణయాలు తీసుకోదని గుర్తుచేసిన రమేశ్.. తాజా పరిస్థితుల దష్ట్యా మార్పు అనివార్యమని పేర్కొన్నారు. తన ఇన్‌స్టాగ్రావ్ వేదికగా మాట్లాడిన ఆయన.. "కెప్టెన్సీ మార్పు అవసరమా లేదా అనే అంశంపై సీఎస్ పలు ప్రత్యామ్నాయాలను పరిశీలిస్తున్నట్లు కనిపిస్తోంది. సంజూ శాంసన్ ఒక అద్భుతమైన టీవ్ ప్లేయర్ కాబట్టి అతడి పేరును తప్పక పరిగణనలోకి తీసుకోవాలి. ఒకవేళ కెప్టెన్సీని మార్చాలనుకుంటే శాంసన్‌కు ప్రాధాన్యత ఇవ్వాలి. ఐపీఎల్‌లో 66 మ్యాచ్‌లకు సారథ్యం వహించిన సంజూ 33 విజయాలు సాధించి, 50 శాతం విజయాల రేటును కలిగి ఉన్నాడు. అతని కెప్టెన్సీలోనే రాజస్థాన్ రాయల్స్ ఫైనల్‌కు చేరడంతో పాటు మరోసారి ప్లేఆఫ్స్‌కు చేరుకుంది. అయితే వలం సంజూను కెప్టెన్ చేసినంత మాత్రాన ట్రోఫీ గెలవలేరు, జట్టులో మరికొన్ని అంశాలను డా మార్చాల్సి ఉంది" అని విశ్లేషించారు. మరోవైపు మాజీ క్రికెటర్ సుబ్రమణ్యం బద్రీనాథ్ డా గతంలో ఇదే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. "రుతురాజ్ నుంచి కెప్టెన్సీ బాధ్యతలను తప్పిస్తే అతడు బ్యాటర్‌గా మరింత స్వేచ్ఛగా, మెరుగ్గా రాణించగలడని బద్రీనాథ్ పేర్కొన్నారు.

# ప్రిన్స్ యాదవ్‌పై బీసీసీఐ ఫోకస్!



**ముంబై:** ఇండియా స్టార్ పేసర్ జస్ప్రీత్ బుమ్రా రీఎంట్రీపై ఇంకా సస్పెన్స్ కొనసాగుతోంది. బీసీసీఐ మెడికల్ టీవ్ నుంచి అతడికి ఇప్పటివరకు ఫిట్‌నెస్ క్లియరెన్స్ రాలేదు. రాబోయే అఫ్గానిస్థాన్ టీ20 సిరీస్, 2026 ఏషియన్ గేమ్స్ కోసం ఎంపిక చేసిన స్క్వాడ్స్‌లో బుమ్రా పేరు ఉన్నా, అతడి పాల్గొనడం ఫిట్‌నెస్‌పై ఆధారపడి ఉంటుందని సమాచారం. ఇంగ్లాండ్‌తో జూలై 16న జరిగిన రెండో వన్డేలో బుమ్రా మోకాలికి మరోసారి ఇబ్బంది ఎదురైనట్లు తెలుస్తోంది. ఇప్పటి కొంతకాలంగా వేధిస్తున్న మోకాలి సమస్య మరింత పెరిగినట్లు సమాచారం. ఆ మ్యాచ్ తర్వాత అతడు బౌలింగ్ చేయలేదు. ప్రస్తుతం రికవరీ ప్రక్రియ కొనసాగుతోంది. తను టీమిండియా లోకి ఎప్పుడు వస్తానేది మిలియన్ డాలర్ ప్రశ్నగా మారింది. బుమ్రా రీఎంట్రీ తేదీపై స్పష్టత లేకపోవడంతో సెలెక్టర్లు బ్యాకప్ ప్లాన్‌పై దష్టి పెట్టినట్లు తాజా నివేదిక పేర్కొంది. ఈ క్రమంలో పేసర్ ప్రిన్స్ యాదవ్‌ను ప్రాబబుల్ బ్యాకప్‌గా గుర్తించినట్లు సమాచారం. బుమ్రాతో పాటు నితీశ్ కుమార్ రెడ్డి, వాషింగ్టన్ సుందర్, హర్షిత్ రాణా డా ఫిట్‌నెస్ పరీక్షలకు హాజరుకానున్నట్లు తెలుస్తోంది. వీరికి వారం రోజుల పాటు మ్యాచ్ సిమ్యులేషన్ టెస్టులు నిర్వహించే అవకాశం ఉంది. ఈ పరీక్షల్లో ఫిట్‌నెస్ నిరూపించుకున్న తర్వాత సెప్టెంబర్ 10న ఢిల్లీ చేరే టీవ్‌తో కలిసే అవకాశం ఉంటుందని బోర్డు వర్గాలు పేర్కొంటున్నాయి.బుమ్రా విషయంలో టీవ్ మేనేజ్‌మెంట్ వ్యవహరిస్తున్న తీరుపై మాజీ ఇండియా బ్యాటర్ సుబ్రమణ్యం బద్రీనాథ్ అసంతృప్తి వ్యక్తం చేశాడు. గత ఏడాది జనవరిలో బుమ్రాకు ఎదురైన వెన్ను గాయం తర్వాత అతడి వర్క్‌లోడ్‌ను జాగ్రత్తగా మేనేజ్ చేస్తున్నా, వరుసగా ఫిట్‌నెస్ సమస్యలు రావడం ఆందోళన కలిగిస్తోందని పేర్కొన్నాడు. బుమ్రా విషయంలో నిర్ణయాలు తీసుకునేది కెప్టెన్, కోచ్, సెలెక్టర్లేనని, అయినప్పటికీ తను టీమిండియాలో రెగ్యులర్ గా ఆడటం లేదని బద్రీనాథ్ అన్నాడు. సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ వలం ఆటగాడి శారీరక పరిస్థితి, అతడు ఏ మ్యాచ్‌లకు ఆడే స్థితిలో ఉన్నాడో సమాచారాన్ని మాత్రమే అందిస్తుందని తెలిపాడు. బుమ్రా ఒక్కడే కాదు. నితీశ్ కుమార్ రెడ్డి, హర్షిత్ రాణా, వాషింగ్టన్ సుందర్, సాయి సుదర్శన్ డా ప్రస్తుతం గాయాల కారణంగా ఆటకు దూరంగా ఉన్నారు. దీంతో కీలక సిరీస్‌లకు ముందు ఇండియా టీవ్ ఫిట్‌నెస్ పరిస్థితిపై ఆసక్తి నెలకొంది. మరోవైపు ప్రపంచకప్ మరో ఏడాది మాత్రమే సమయం ఉండటంతో బుమ్రా ఫిట్ నెస్ సాధించకపోవడం, తరచూ గాయపడుతుండటంపై భారత అభిమానులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

## Business బిజినెస్

# కియా సొరెంటో హైబ్రిడ్ ఎస్‌యూవీ



**న్యూఢిల్లీ:** కియా ఇండియా తన ప్రీమియం 7–సీటర్ ఎస్‌యూవీ సొరెంటోను శుక్రవారం విడుదల చేసింది. ధరల శ్రేణి రూ.27.99–40.39 లక్షలు. ఇందులో 1.6 లీటర్ స్ట్రాంగ్ హైబ్రిడ్, 2.0 లీటర్ డీజిల్ ఇంజిన్లు అందించారు. ఈ కారును ఆంధ్రప్రదేశ్‌లోని అనంతపురం ప్లాంట్‌లో తయారు చేస్తున్నారు. పనోరమిక్ సన్‌రూఫ్, వెంటిలేటెడ్ సీట్లు, పవర్డ్ టెయిల్‌గేట్, బోస్ 12–స్పీకర్ ప్రీమియం ఆడియో సిస్టమ్, డ్యూయల్ 12.3 అంగుళాల డిస్‌ప్లే, లెవెల్–2 అడాస్ భద్రతా ఫీచర్లు ఉన్నాయి. టాప్ వేరియంట్లలో కియా కనెక్ట్ 2.0, ఓవర్–ది–ఎయిర్ అప్‌డేట్‌లు, డిజిటల్ కీ, హెడ్–అప్ డిస్‌ప్లే, జనరేటివ్ ఏఐ అసిస్టెంట్ ఉన్నాయి. ఏడుగురు ప్రయాణిం చేందుకు వీలుగా మూడు వరుసల సీటింగ్ ఉంది. 6 సీట్ల ఆప్షన్ కూడా ఉంది. భద్రత కోసం 7 ఎయిర్‌బ్యాగులు ఇచ్చారు. టాప్ వేరియంట్లలో 10 ఎయిర్‌బ్యాగులు, లెవెల్ 2+ అడాస్, సరౌండ్ వ్యూ మానిటర్, రిమోట్ పార్కింగ్ అసిస్ట్ వంటి ఫీచర్లు ఉన్నాయి. టయోటా ఫార్చునర్, స్కోడా కొడియాక్, జీప్ మెరిడియన్, ఫోక్స్‌వ్యాగన్ టైరాన్‌తో ఇది పోటీ పడనుంది.

# 15 ట్రిలియన్ డాలర్లకు చేరిన కుబేరుల సంపద



**ముంబై:** కృత్రిమ మేధ కారణంగా ఒకవైపు చాలామంది ఉద్యోగాలు కోల్పోతుంటే.. మరోవైపు పెద్ద పెద్ద కంపెనీలు భారీగా సంపద సృష్టిస్తున్నాయి. ఏఐ రంగంలో పెట్టుబడులు కలసిరావడంతో ప్రపంచ వ్యాప్తంగా సంపన్నుల జనాభా పెరుగుతోంది. గతేడాది బిలియనీర్ల సంఖ్య దాదాపు 3800కు చేరినట్లు గ్లోబల్ ఇంటెలిజెన్స్ ప్లాట్‌ఫామ్ అల్ట్రాటా తన వెల్త్ రిపోర్ట్‌లో వెల్లడించింది. వీరి మొత్తం సంపద సుమారు 15.1 ట్రిలియన్ డాలర్లకు (భారత కరెన్సీ ప్రకారం.. రూ.1,417.37 లక్షల కోట్లు) చేరుకున్నట్లు తెలిపింది.

గత 5 ఏళ్లలో ఏఐ రంగంలో సగటున 30 మిలియన్ డాలర్ల (దాదాపు రూ.283.25 కోట్లు) వరకు పెట్టుబడులు చేసిన కంపెనీలు అధిక మార్కెట్ విలువను సాధించాయని అల్ట్రాటా తన నివేదికలో పేర్కొంది. దీంతో బిలియనీర్ల సంపద 12.8 శాతం పెరగ్గా.. కుబేరుల సంఖ్య 8.2 శాతం ఎగబాకింది. ఏఐ రంగానికి సంబంధించిన టెక్నాలజీ స్టాక్స్‌లో పెట్టుబడులు భారీ సంపద సృష్టించాయని నివేదిక వెల్లడించింది. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న కుబేరుల మొత్తం సంపదలో.. 27శాతం కేవలం 29 మంది సూపర్ బిలియనీర్ల (50 బిలియన్ డాలర్లను మించి ఆదాయం ఉన్న వారిని ఇలా పరిగణిస్తారు) వద్దే ఉన్నట్లు పేర్కొంది. అత్యధికంగా 1,337 మంది బిలియనీర్లతో ఉత్తర అమెరికా మొదటి స్థానంలో నిలవగా, 1,081 మందితో ఐరోపా రెండో స్థానంలో ఉంది. ఆసియాలో 881 మంది బిలియనీర్లు ఉన్నారు. మొత్తం సంపన్నుల్లో మహిళలు కేవలం 13 శాతం మాత్రమే ఉండడం గమనార్హం.

## జియో సేవలకు పదేళ్లు



**ముంబై:** 2016 సెప్టెంబర్ 5న వాణిజ్య సేవలు ప్రారంభించిన రిలయన్స్ జియో.. పదేళ్లలో దేశీయ టెలికాం రంగాన్ని మలుపు తిప్పింది. డేటా అయిపోతుందేమోనన్న భయం నుంచి అపరిమిత డిజిటల్ లభ్యత వరకు జరిగిన పరిణామాల గురించి ప్రత్యేకంగా చెప్పుకోవాల్సిందే. 2016లో 1 జీబీ డేటా ధర సుమారు రూ.228గా ఉండేది. దేశమంతటా కలిపి 4జీ వాడుతున్న వారి సంఖ్య కోటి కంటే తక్కువే. ఇంటర్నెట్ వేగం సగటున 2.5 ఎంబీపీఎస్ దాటడానికి ముప్పుతిప్పలు పడాల్సి వచ్చేది. హై–స్పీడ్ ఇంటర్నెట్‌ను విలాసవంతమైన వస్తువుగా కాకుండా ప్రాథమిక అవసరంగా మార్చడమే ప్రధాన వ్యూహంతో జియో దూసుకెళ్లింది. ఫలితంగా.. ఈ దశాబ్ద కాలంలో 1 జీబీ డేటా ధర ఏకంగా 97 శాతం తగ్గి, ప్రస్తుతం రూ.7.9కి పడిపోయింది. దేశంలో 4జీ, 5జీ వాడే చందాదారుల సంఖ్య 93.8 కోట్లకు చేరింది. ప్రస్తుతం ఒక జియో వినియోగదారు సగటున నెలకు ఏకంగా 42.3 జీబీ డేటాను వాడుతున్నారు.

తెలుగు రాష్ట్రాల్లో రికార్డు వృద్ధి: తెలుగు రాష్ట్రాల (ఆంధ్రప్రదేశ్, తెలంగాణ) టెలికాం సర్కిల్‌లో జియో సేవలు ప్రారంభించిన తొలి నెలలోనే 12.4 లక్షల కనెక్షన్లను సాధించింది. జూన్ 2026 నాటికి ఇవి 3.25 కోట్లకు చేరాయి. 2024 జూన్ నాటికి ఏపీ, తెలంగాణలో జియో గరిష్ఠంగా 3.30 కోట్ల చందాదారుల మైలురాయిని తాకింది. 2026 జూన్ నాటికి తెలుగు రాష్ట్రాల్లో ఉన్న మొత్తం 8.83 కోట్ల వైర్‌లెస్ కనెక్షన్లలో 36.9% వాటాతో జియో బలమైన రెండో అతిపెద్ద టెలికాం వ్యవస్థగా అవతరించింది.

# జాగ్వార్ కంపెనీలో 4వేల ఉద్యోగాలు కోత!



**ముంబై:** టాటా మోటార్స్‌కు చెందిన లగ్జరీ కార్ల తయారీ సంస్థ జాగ్వార్ ల్యాండ్ రోవర్ భారీ సంఖ్యలో ఉద్యోగులను తొలగించే యోచనలో ఉన్నట్లు వార్తలు వస్తున్నాయి. రాబోయే రెండేళ్లలో బ్రిటన్‌లో దాదాపు 4 వేల ఉద్యోగాలకు కోత విధించనున్నట్లు 'ది టైమ్స్' కథనం పేర్కొంది. అమెరికా టారిఫ్‌లు, వాహన తయారీ ఖర్చులు పెరగడం, విక్రయాలు తగ్గడమే ఇందుకు కారణమని తెలిపింది. మరోవైపు, ఉద్యోగాల కోతకు సంబంధించి ఇప్పటికే సిబ్బందికి సమాచారం అందజేశామని, త్వరలోనే ఇందుకు సంబంధించిన ప్రకటన వెలువడనున్నట్లు కంపెనీ పేర్కొన్నట్లు సదరు వార్తా కథనం తెలిపింది. ఆర్థికపరమైన అంశాలకు తగ్గట్టుగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. వేతన సిబ్బంది, మేనేజ్‌మెంట్ టీమ్‌లపై ఈ ప్రభావం పడే అవకాశం ఉంది. కాగా, బ్రిటన్‌లో అతిపెద్ద కార్ల తయారీ సంస్థల్లో ఒకటైన జేఎల్‌ఆర్ సంస్థ.. బ్రిటన్‌లో సుమారు 34 వేల మందికి ఉపాధి కల్పిస్తోంది. ఎలక్ట్రిక్ వాహనాల తయారీకి అయ్యే భారీ వ్యయం, చైనా నుంచి ఎదురవుతున్న తీవ్రమైన పోటీ, అంతర్జాతీయ ఆంక్షల ఒత్తిళ్లను తట్టుకొనేందుకే కంపెనీ ఈ కఠిన నిర్ణయం తీసుకున్నట్లు కనిపిస్తోంది. ఈ ఏడాది జూన్ చివరి నాటికి కంపెనీ ఆదాయం దాదాపు 10 శాతం వరకు తగ్గడం గమనార్హం. మరోవైపు, జర్మనీ కార్ల తయారీ దిగ్గజం ఫోక్స్‌వ్యాగన్ కూడా లక్ష ఉద్యోగాలకు కోత విధిస్తున్నట్లుగా ప్రకటించిన సంగతి తెలిసిందే.

# రూ.6.09 లక్షలతో కొత్త బలెనో




**ముంబై:** దేశీయ ప్యాసింజర్ కార్ల దిగ్గజం మారుతీ సుజుకి తన పాపులర్ ప్రీమియం హ్యాచ్‌బ్యాక్ బలెనోను సరికొత్త మోడల్‌లో మార్కెట్లోకి విడుదల చేసింది. రూ. 6.09 లక్షల ప్రారంభ ధరతో (ఎక్స్–షోరూమ్) లభించే ఈ కొత్త కార్, ఫ్రంట్ గ్రిల్, ఎల్‌ఈడీ డీఆర్‌ఎల్‌లు, షార్క్–ఫిన్ యాంటెన్నాతో రీ–డిజైన్ చేసిన సరికొత్త ఫేస్‌లిఫ్ట్ లుక్‌లో ఆకట్టుకుంటోంది.

ఈ సెగ్మెంట్‌లోనే మొదటిసారిగా లెవెల్–ఎ అడాస్ (అడ్వాన్స్‌డ్ డ్రైవర్ అసిస్టెన్స్ సిస్టమ్) సాంకేతికతతో తీసుకురావడం విశేషం. రాడార్, కెమెరాల సహాయంతో పనిచేసే ఈ సిస్టమ్‌లో ఎమర్జెన్సీ బ్రేకింగ్, లేన్ కీప్ అసిస్ట్, అడాప్టివ్ క్రూజ్ కంట్రోల్ వంటి ఆధునిక భద్రతా ఫీచర్లు ఉన్నాయి. వీటితో పాటు 6 ఎయిర్‌బ్యాగ్‌లు, టైర్ ప్రెజర్ మానిటరింగ్ సిస్టమ్, ఈఎస్‌పీ వంటి స్టాండర్డ్ సేఫ్టీ ఫీచర్లను కూడా అందించారు. ఇంటీరియర్ ఈ విభాగంలోనే తొలిసారిగా వెంటిలేటెడ్ ఫ్రంట్ సీట్లు అందించడం విశేషం.

9–అంగుళాల స్మార్ట్‌ప్లే ప్రో పల్స్ ఇన్ఫోటైన్‌మెంట్, వైర్‌లెస్ యాపిల్ కార్‌ప్లే/ఆండ్రాయిడ్ ఆటో, వైర్‌లెస్ ఛార్జర్, 360–డిగ్రీ కెమెరా, హెడ్–అప్ డిస్‌ప్లే వంటి హై–ఎండ్ సదుపాయాలు ఉన్నాయి. ఈ కారు మాన్యువల్ వెర్షన్‌లో లీటరుకు 23.80 కి.మీ., ఏజీఎస్ (ఆటోమేటిక్) వెర్షన్‌లో 24.77 కి.మీ. మైలేజ్ ఇస్తుందని కంపెనీ చెబుతోంది. ఇక ఎస్–సీఎన్‌జీ మోడల్ కిలోకు ఏకంగా 33.61 కి.మీ. మైలేజ్ ఇస్తుంది.

## మోహన్‌లాల్ భారీ యాక్షన్ థ్రిల్లర్
# ఆపరేషన్ గంగా



మలయాళ సూపర్‌స్టార్ మోహన్‌లాల్, దర్శకుడు విష్ణు మోహన్ కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న మోస్ట్ అవైటెడ్ ప్రాజెక్ట్ L367కి 'ఆపరేషన్ గంగా' అనే టైటిల్‌ను ఖరారు చేశారు. ఫస్ట్ లుక్ పోస్టర్‌ను కూడా విడుదల చేయగా.. ఇది సినిమాపై ఆసక్తిని మరింత పెంచుతోంది. రష్యా–ఉక్రెయిన్ యుద్ధ సమయంలో భారతీయులను సురక్షితంగా స్వదేశానికి తీసుకువచ్చేందుకు ప్రభుత్వం చేపట్టిన చారిత్రాత్మక 'ఆపరేషన్ గంగా' తరలింపు మిషన్ ఆధారంగా దర్శకుడు ఈ కథను రూపొందించినట్లు సమాచారం. ఇప్పటికే జార్జియాలో షూటింగ్ ప్రారంభమైంది. త్వరలో మోహన్‌లాల్ కూడా షూటింగ్‌లో జాయిన్ కానున్నారు. 180 రోజులకు పైగా చిత్రీకరణకు ప్లాన్ చేసిన ఈ సినిమాను పోలాండ్, జార్జియా, కజకిస్తాన్‌తో పాటు ఢిల్లీ, డెహ్రాడూన్, కొచ్చి ప్రాంతాల్లో తెరకెక్కించనున్నారు. శ్రీ గోకులం మూవీస్ బ్యానర్‌పై గోకులం గోపాలన్ భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్న ఈ పాన్ ఇండియా చిత్రంలో అర్జున్ రాంపాల్, ఆదిల్ హుస్సేన్, భాగ్యశ్రీ భోర్సే, పార్థిబన్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. శాశ్వత్ సచ్‌దేవ్ సంగీతం అందిస్తుండగా.. ఓ సే–యెంగ్ యాక్షన్ సన్నివేశాలను డిజైన్ చేస్తున్నారు. ఆర్మీ సన్నివేశాల కోసం స్క్వాడ్రన్ లీడర్ వెర్లిన్ పన్వార్ మిలిటరీ అడ్వైజర్‌గా పనిచేస్తున్నారు. భారీ యాక్షన్, వాస్తవ ఘటనల స్ఫూర్తితో రూపొందుతున్న 'ఆపరేషన్ గంగా'పై ఫస్ట్ లుక్‌తోనే అంచనాలు పెరిగాయి.

## నవంబర్‌లో 'లీసా'.. అనన్య నాగళ్లకు మరో విభిన్న చిత్రం



విభిన్నమైన కథలను ఎంచుకుంటూ.. ప్రతి సినిమాలోనూ తన నటనకు కొత్త కోణాన్ని పరిచయం చేస్తున్న యంగ్ బ్యూటీ అనన్య నాగళ్ల మరో ఆసక్తికరమైన సినిమాతో ప్రేక్షకుల ముందుకు వచ్చేందుకు సిద్ధమవుతున్నారు. ఆమె ప్రధాన పాత్రలో నటిస్తున్న తాజా చిత్రం 'లీసా'. ఓం సాయి రామ్ ఆర్ట్స్, ఐరాస్ ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకాలపై వెంకట్ దుగ్గి రెడ్డి, రామకృష్ణ ఐల సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ సినిమాతో జవహర్ పవార్ దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. విభిన్నమైన కథాంశంతో తెరకెక్కుతున్న ఈ చిత్రం కోసం దర్శకుడు సరికొత్త ట్రీట్‌మెంట్‌ను ఎంచుకున్నట్లు తెలుస్తోంది. భారతీయ చిత్ర పరిశ్రమలో ఇప్పటి వరకు పెద్దగా చూడని విధంగా రెండు భిన్నమైన జోనర్లను ఒకదానితో ఒకటి మేళవిస్తూ 'లీసా'ను రూపొందిస్తున్నట్లు చిత్ర బృందం చెబుతోంది. దీంతో ఈ సినిమా కథ, స్క్రీన్‌ప్లే ఎలా ఉండబోతున్నాయనే ఆసక్తి ప్రేక్షకుల్లో మొదలైంది. సినిమాకు 'ఎస్సార్ కళ్యాణమండపం' ఫేమ్ శ్రీధర్ గాదె ఎడిటర్‌గా పనిచేస్తుండటం మరో విశేషం. కథకు తగ్గట్టుగా ఎడిటింగ్‌లో కొత్తదనాన్ని తీసుకురావడంతో పాటు, సినిమా వేగాన్ని ఆసక్తికరంగా కొనసాగించేలా ఆయన తనదైన శైలిలో వర్క్ చేస్తున్నట్లు సమాచారం. ఇక 'మెలోడీ బ్రహ్మ' మణి శర్మ సంగీతం అందించడం 'లీసా'కు మరో ప్రత్యేక ఆకర్షణగా మారింది. కథలోని భావోద్వేగా లకు, సన్నివేశాల తీవ్రతకు అనుగుణంగా మణిశర్మ అందించే సంగీతం సినిమాకు మరింత బలాన్ని చేకూర్చనుందని చిత్ర బృందం నమ్మకంగా ఉంది. ఇప్పటికే ఈ సినిమా షూటింగ్ విజయవంతంగా పూర్తయింది. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనులు శరవేగంగా కొనసాగు తున్నాయి. షూటింగ్ సమయంలో చిత్రీకరించిన రషెస్‌ను చూసిన చిత్ర బృందం సినిమా అవుట్‌పుట్‌పై పూర్తి సంతృప్తిని వ్యక్తం చేసినట్లు మేకర్స్ వెల్లడించారు. ముఖ్యంగా సినిమా మేకింగ్ విధానం, కథను తెరపై ఆవిష్కరించిన తీరు, అనన్య నాగళ్ల నటన ప్రేక్షకులను ఆకట్టుకునేలా ఉంటాయని చెబుతున్నా రు. ఇప్పటివరకు చేసిన పాత్రలకు భిన్నంగా అనన్య నాగళ్ల 'లీసా'లో కనిపించబోతుండటంతో ఆమె అభిమానుల్లోనూ సినిమాపై ఆసక్తి పెరుగుతోంది. కథకు తగ్గట్టుగా తన నటనలో కొత్తదనాన్ని చూపించేందుకు అనన్య ప్రత్యేకంగా శ్రమించినట్లు చిత్ర బృందం పేర్కొంది. ప్రస్తుతం నిర్మాణానంతర కార్యక్రమాలు చివరి దశకు చేరుకుంటుండగా.. అన్ని పనులను పూర్తి చేసి నవంబ ర్‌లో సినిమాను ఘనంగా ప్రేక్షకుల ముందుకు తీసుకురా వడానికి మేకర్స్ సన్నాహాలు చేస్తున్నారు. విభిన్నమైన జోనర్ల కలయిక, కొత్త దర్శకుడి ట్రీట్‌మెంట్, అనన్య నాగళ్ల నటన, మణిశర్మ సంగీతం వంటి అంశాలు 'లీసా'పై అంచనాలను పెంచుతున్నాయి. మరి ఈ విభిన్న ప్రయత్నం ప్రేక్షకులను ఏ స్థాయిలో మెప్పిస్తుందో తెలియాలంటే నవంబర్ వరకు వేచి చూడాల్సిందే.

## 'గూగుల్‌లో నా పేరు కొడితే..'.. వైష్ణవి చైతన్య ఎమోషనల్



'బేబీ' సినిమాతో ఒక్కసారిగా టాలీవుడ్‌లో సంచలనం సృష్టించి.. యూత్‌లో భారీ క్రేజ్ సంపాదించుకున్న యంగ్ బ్యూటీ వైష్ణవి చైతన్య ప్రస్తుతం వరుస సినిమాలతో బిజీగా ఉంది. 'బేబీ' తర్వాత ఆనంద్ దేవరకొండ, వైష్ణవి చైతన్య కాంబినేషన్‌లో తెరకెక్కిన 'ఎపిక్ ఫస్ట్ సెమిస్టర్' సెప్టెంబర్ 11న థియేటర్లలోకి రానుంది. '90s మిడిల్ క్లాస్ బయోపిక్'తో గుర్తింపు తెచ్చుకున్న ఆదిత్య హాసన్ ఈ చిత్రానికి దర్శకత్వం వహించారు. సినిమా ప్రమోషన్స్‌లో భాగంగా ఓ కార్యక్రమంలో పాల్గొన్న వైష్ణవి తన కెరీర్ ప్రారంభ రోజులను గుర్తుచేసుకుంటూ ఎమోషనల్ అయ్యారు. ''నిన్ను ఎవరు గుర్తుపడతారు? గూగుల్‌లో నీ పేరు కొడితే అసలు ఏమైనా సమాచారం వస్తుందా?'' అంటూ కొందరు తనను అప్పట్లో ఎగతాళి చేశారని తెలిపారు. ఆ మాటలు తనను ఎంతో బాధపెట్టాయని, అయితే అదే అవమానాన్ని ఎలాగైనా విజయంగా మార్చుకోవాలని అప్పుడే నిర్ణయించుకున్నానని చెప్పారు. ఇప్పుడు పరిస్థితులు పూర్తిగా మారిపోయాయని.. గూగుల్‌లో తన పేరు టైప్ చేస్తే తన గురించి పూర్తి వివరాలు కనిపించడం తన జీవితంలో ఒక 'ఎపిక్ మూమెంట్' అని ఆనందం వ్యక్తం చేశారు. ఇక ఆనంద్ దేవరకొండ నుంచి తాను ఓ గొప్ప విషయాన్ని నేర్చుకున్నానని వైష్ణవి తెలిపారు. మన చుట్టూ ఉన్నవారు ఎదుగుతున్నప్పుడు మనస్ఫూర్తిగా సంతోషించడం ఎంతో గొప్ప లక్షణమని.. ఆనంద్ తన ప్రవర్తనతో దాన్ని నిరూపిస్తారని ప్రశంసించారు. ఆయనలాంటి అరుదైన వ్యక్తితో కలిసి పనిచేయడం ఆనందంగా ఉందని పేర్కొన్నారు.

## 'గూఢచారి–2'.. ఆ విషయంలో షాక్ అయ్యా!



అడివి శేష్ హీరోగా నటిస్తున్న మోస్ట్ అవైటెడ్ పాన్ ఇండియా స్పై థ్రిల్లర్ 'గూఢచారి–2' (G2). సూపర్‌హిట్ 'గూఢచారి'కి సీక్వెల్‌గా భారీ బడ్జెట్‌తో తెరకెక్కుతున్న ఈ చిత్రానికి వినయ్ కుమార్ దర్శకత్వం వహిస్తున్నారు. వామికా గబ్బి హీరోయిన్‌గా నటిస్తుండగా.. బాలీవుడ్ స్టార్ ఇమ్రాన్ హాష్మీ కీలక పాత్రలో కనిపించనున్నారు. ప్రస్తుతం షూటింగ్ శరవేగంగా కొనసాగుతున్న నేపథ్యంలో.. ఈ సినిమా ఎడిట్ వెర్షన్‌ను చూసిన నటుడు, దర్శకుడు రాహుల్ రవీంద్రన్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. సాధారణంగా అడివి శేష్ తన సినిమాలను 90 శాతం షూటింగ్ పూర్తయిన తర్వాత చూపిస్తుంటాడని.. కానీ 'గూఢచారి–2' విషయంలో కేవలం 70 శాతం షూట్ పూర్తయిన ఎడిట్ వెర్షన్ చూసి తాను షాక్ అయ్యానని తెలిపారు. సినిమాలోని విజువల్స్, యాక్షన్ సీక్వెన్స్‌లు, మైండ్ గేమ్స్, ట్విస్ట్‌లు అద్భుతంగా ఉన్నాయని, భారతీయ స్పై థ్రిల్లర్ సినిమాల్లో ఇది సరికొత్త బెంచ్‌మార్క్ సెట్ చేస్తుందని అన్నారు. సినిమా విడుదలైన తర్వాత థియేటర్లు దద్దరిల్లడం ఖాయమని, శేష్ కెరీర్‌లో ఇది మరో మైలురాయిగా నిలుస్తుందని పేర్కొన్నారు. తనకు శేష్ నటించిన చిత్రాల్లో 'గూఢచారి–2' అత్యంత ఇష్టమైన సినిమాగా మారిందన్నారు. ఇమ్రాన్ హాష్మీ తనదైన క్లాస్ స్వాగ్‌తో ఆకట్టుకోగా.. వామికా గబ్బి కూడా అద్భుతంగా నటించిందని ప్రశంసించారు. దర్శకుడు వినయ్ కుమార్ గురించి మాట్లాడుతూ.. పదేళ్ల క్రితం ఓ లవ్‌స్టోరీతో తనను కలిశారని, నిర్మాత కుదరకపోవడంతో శేష్ టీమ్‌లో అసిస్టెంట్ డైరెక్టర్‌గా చేరారని గుర్తుచేశారు. ఇప్పుడు ఇంత భారీ ప్రాజెక్ట్‌తో దర్శకుడిగా పరిచయం కావడం ఆనందంగా ఉందని రాహుల్ రవీంద్రన్ తెలిపారు.

## సినిమాల వల్లే తమిళంపై ప్రేమ పెరిగింది

కోలీవుడ్‌లో యంగ్ అండ్ టాలెంటెడ్ నటిగా తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంటోంది అనిష్మా అనిల్ కుమార్. 'యూత్', 'సిరాయ్' వంటి చిత్రాలతో మంచి గుర్తింపు తెచ్చుకున్న ఈ భామ.. ప్రస్తుతం దర్శకుడు అమీర్ తెరకెక్కిస్తున్న 'మకాలి' చిత్రంలో నటిస్తోంది. తండ్రీకూతుళ్ల మధ్య అనుబంధం, భావోద్వేగాల నేపథ్యంలో రూపొందు తున్న ఈ సినిమా పూజా కార్యక్రమాలను పూర్తి చేసుకోగా.. త్వరలోనే రెగ్యులర్ షూటింగ్ ప్రారంభం కానుంది. ఇదిలా ఉంటే.. తాజాగా ఓ ఇంటర్వ్యూలో అనిష్మా తన చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకుంటూ తమిళ భాషపై తనకున్న ప్రత్యేకమైన అనుబంధాన్ని వెల్లడించింది. ''చిన్నప్పుడు మా అమ్మ వేరే జిల్లాలో ఉద్యోగం చేసేవారు. దీంతో ఇంట్లో నాన్న, నేను మాత్రమే ఉండేవాళ్లం. అర్ధరాత్రి దాటిన తర్వాత రెండు గంటల సమయంలో కూడా నాన్నతో కలిసి సినిమా లు చూసేదాన్ని. విజయ్ నటించిన 'గిల్లి', 'అళగియ తమిళ్ మగన్' వంటి సినిమాలు చూడటంతో పాటు తమిళ పాటలు వినడం వల్ల ఆ భాషపై నాకు ఆసక్తి పెరిగింది. అలా సినిమాలు చూస్తూనే ఒకటో తరగతిలోనే తమిళం చదవడం, రాయడం నేర్చుకున్నాను'' అని తెలిపారు. 'అళగియ తమిళ్ మగన్'లో ఓ పాత్ర తన పేరు గురు, స్వస్థలం గురువాయూర్ అని చెప్పే సన్నివేశం తనను ఎంతగానో ప్రభావితం చేసిందని అనిష్మా గుర్తుచేసుకుంది. దాంతో తాను కూడా తన స్వస్థలం 'కట్టకడై' అని తమిళంలో రాయడం ప్రాక్టీస్ చేశానని చెప్పింది.



## రాజ్ తరుణ్ 'టార్టాయిస్' నుంచి 'నీ పరిచయం..'

వైవిధ్యమైన కథలను ఎంచుకుంటూ తనదైన శైలిలో ముందుకు సాగుతున్న యువ హీరో రాజ్ తరుణ్ ప్రధాన పాత్రలో నటిస్తున్న తాజా చిత్రం 'టార్టాయిస్'. అమృత చౌదరి హీరోయిన్‌గా నటిస్తుండగా.. అవసరాల శ్రీనివాస్, ధన్య బాలకృష్ణ తదితరులు కీలక పాత్రల్లో కనిపించనున్నారు. ఎస్ కే గోల్డెన్ ఆర్ట్స్, ప్రశ్విత ఎంటర్టైన్మెంట్, ఎన్ వీ ఎల్ క్రియేషన్స్ బ్యానర్స్‌పై విజయ్ చౌదరి, శశిధర్ నల్ల, రామిశెట్టి రాంబాబు సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ సినిమాకు రిత్విక్ కుమార్ దర్శకత్వం వహిస్తున్నారు. సస్పెన్స్, డ్రామాతో పాటు ఇంటెన్స్ యాక్షన్ అంశాలను మేళవించి ఈ చిత్రాన్ని ఆసక్తికరమైన థ్రిల్లర్‌గా దర్శకుడు రూపొందిస్తున్నట్లు చిత్ర బృందం చెబుతోంది. ఇప్పటికే 'టార్టాయిస్' నుంచి విడుదలైన ఫస్ట్ లుక్ పోస్టర్ ప్రేక్షకుల దృష్టిని ఆకర్షించగా.. తాజాగా సినిమాలోని 'నీ పరిచయం..' పాటను చిత్ర బృందం గ్రాండ్‌గా విడుదల చేసింది. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో హీరోయిన్ అమృత చౌదరి మాట్లాడుతూ పాట చిత్రీకరణకు సంబంధించిన ఆసక్తికరమైన విషయాలను పంచుకున్నారు. ''నీ పరిచయం' సాంగ్ మీ అందరికీ నచ్చిందని నమ్ముతున్నాను. ఈ పాటను చిత్రీకరించే సమయంలో మేమంతా ఎంతో ఎంజాయ్ చేశాం. మేము ఎంతగా ఆస్వాదించామో.. ప్రేక్షకులు కూడా అంతే ఆనందంగా ఈ పాటను ఆస్వాదిస్తారని భావిస్తున్నాను. ఈ పాటను రావులపాలెంలో చిత్రీకరించాం. అక్కడ షూటింగ్ జరిగినన్ని రోజులు స్థానిక ప్రజలు మాపై ఎంతో ప్రేమ, ఆప్యాయత చూపించారు. బొబ్బట్లు, చేపలు వంటి వాటిని స్వయంగా తీసుకొచ్చి మాకు ఇచ్చేవారు. వారి నిస్వార్థమైన ప్రేమను దగ్గరుండి చూశాం. ఆ రోజులు షూటింగ్ అనుభవాన్ని మరింత ప్రత్యేకంగా మార్చాయి. ఇక అనూప్ గారు మాకు ఎంతో అందమైన పాటను అందించారు. ఈ పాటకు ప్రేక్షకుల నుంచి మంచి స్పందన వస్తుందని ఆశిస్తున్నాను. ఇదే విధంగా మీ అందరి ప్రేమ, మద్దతు మా 'టార్టాయిస్' సినిమాకు కూడా ఉండాలని కోరుకుంటున్నాను'' అంటూ అమృత చౌదరి ఆనందం వ్యక్తం చేశారు. ప్రస్తుతం విడుదలైన 'నీ పరిచయం..' పాట సినిమాపై మరింత ఆసక్తిని పెంచుతోంది. మరోవైపు సస్పెన్స్, యాక్షన్, డ్రామా అంశాలతో తెరకెక్కుతున్న 'టార్టాయిస్'లో రాజ్ తరుణ్ పాత్ర ఎలా ఉండబోతుందనే ఆసక్తి నెలకొంది. కొత్త తరహా కథ, ఇంటెన్స్ ట్రీట్‌మెంట్‌తో వస్తున్న ఈ చిత్రం ప్రేక్షకులను ఏ మేరకు మెప్పిస్తుందో చూడాలి.

## 'డెలులు' టీజర్.. యూత్‌కు ఫుల్ కిక్

నేటి యువతలో ట్రెండ్ అవుతున్న ఓ పాపులర్ పదాన్ని టైటిల్‌గా తీసుకుని, సరికొత్త కాన్సెప్ట్‌తో తెరకెక్కుతున్న యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్ 'డెలులు'. తాజాగా ఈ చిత్రానికి సంబంధించిన 1.32 నిమిషాల అధికారిక టీజర్‌ను మేకర్స్ విడుదల చేశారు. 'బ్రేకప్ దేవా' అనే డైలాగ్‌తో ఆసక్తికరంగా ప్రారంభమైన టీజర్.. ఆద్యంతం హిలేరియస్ సంభాషణలు, ఫన్నీ సన్నివేశాలతో ఆకట్టుకుంటోంది. 'సెల్ఫ్ రెస్పెక్ట్ లేదా నీకు?', 'నువ్వేమైనా ఫాదర్ ఆఫ్ ఇండియానా?', 'అత్తాపూర్‌కు రారా.. నీళ్ల ట్యాంకర్ దగ్గర కొట్టిస్తా' వంటి పంచ్ డైలాగులు టీజర్‌కు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఓ ఇంటి నేపథ్యంలో సాగే సరదా సంఘటనలు, పాత్రల మధ్య కెమిస్ట్రీ ప్రధానంగా కథను నడిపేలా సినిమా తెరకెక్కినట్లు టీజర్ చూస్తే అర్థమవుతోంది. ప్రీతం కస్తూరి దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని క్రియేటివ్ లాంచ్‌ప్యాడ్ బ్యానర్‌పై సంకీర్త్ కొండ నిర్మిస్తున్నారు. విజయ్ రాజ్‌కుమార్ కథ, అదనపు సంభాషణలు అందించగా.. రెష్మిత్ ఎస్. కౌశిక స్క్రీన్‌ప్లే, మాటలు సమకూర్చారు. విజయ్ రాజ్‌కుమార్, వేణి రావు, అఖిల్ జాక్సన్, సాయి ప్రసన్న, శ్రీ రామ మండవ, అభినయ్ తుల తదితరులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. జై రాజ్ నాయుడు సినిమాటోగ్రఫీ, హరికృష్ణ కురపాటి ఎడిటింగ్, ఆది చెబ్రోలు సంగీతం అందిస్తున్నారు. టీజర్‌లో సన్నివేశాలకు తగ్గట్టుగా వచ్చిన నేపథ్య సంగీతం కూడా ఆకట్టుకుంది. ఇప్పటికే ఫస్ట్ లుక్‌తో ఆసక్తిని పెంచిన 'డెలులు'.. తాజాగా టీజర్‌తో మరింత బజ్ క్రియేట్ చేసింది. యూత్‌ను టార్గెట్ చేసే కామెడీ, వినూత్న టైటిల్‌తో వస్తున్న ఈ సినిమా కుటుంబ ప్రేక్షకులను సైతం ఏ మేరకు అలరిస్తుందో చూడాలి.



## 'తెల్ల కాగితం' టీజర్‌కు గెస్ట్‌లెవరో తెలుసా?

'కోర్ట్', 'బ్యాండ్ మేళం' చిత్రాలతో గుర్తింపు తెచ్చుకున్న యంగ్ హీరో హర్ష్ రోషన్ నటిస్తున్న తాజా చిత్రం 'తెల్ల కాగితం'. నక్షత్ర హీరోయిన్‌గా నటిస్తున్న ఈ సినిమాకు రమేష్ బండ్రెడ్డి దర్శకత్వం వహిస్తున్నారు. అరుణాచల క్రియేషన్స్ బ్యానర్‌పై కృష్ణ కొమ్మలపాటి నిర్మిస్తున్న ఈ చిత్రం అక్టోబర్ 2న ప్రేక్షకుల ముందుకు రానుంది. విడుదల తేదీ దగ్గరపడుతుండటంతో ప్రమోషన్స్‌లో జోరు పెంచిన మేకర్స్.. తాజాగా టీజర్ లాంచ్‌కు సంబంధించిన అప్‌డేట్ ఇచ్చారు. రేపు ఉదయం 9 గంటల నుంచి హైదరాబాద్‌లోని ప్రసాద్ ల్యాబ్స్‌లో 'తెల్ల కాగితం' టీజర్‌ను విడుదల చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి ప్రముఖ నిర్మాత దిల్ రాజు, రచయిత, దర్శకుడు బీవీఎస్ రవి, దర్శకులు బాబీ, రామ్ అబ్బరాజు, భాను భోగవరపు ముఖ్య అతిథులుగా హాజరుకానున్నారు. ఈ చిత్రం అక్టోబర్ 2న థియేటర్లలో సందడి చేయనుంది.

Published And Owned By Adula Thirupathi, And Printed By Bommakanti Vinod Kumar, At Vangs Global Technologies Llp, #1-5-431/20/4, Jonnabanda, Old Alwal, Medchal Malkajgiri, Telangana - 500010. And Published From D. No.: 8-3-228/157/A/1a, Rehmath Nagar, Jawahar Nagar, Yousufguda, Hyderabad, Telangana - 500045. **Editor: Adula Thirupathi. PRGI Regd No: TGTEL/26/A6187**, Email: Prajanaava@Gmail.Com. Phone No: 99484 33277.